PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 217 | విజయవాడ, సోమవారం 10 మార్చి 2025 | 6 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Monday 10 March 2025 | Rs

కడప రైల్వే స్టేషన్‌లో అంగన్‌వాడీలను అడ్డుకుంటున్న పోలీసులు

అంగన్‌వాడీలపై నిర్బంధం

- రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల అరెస్టు
- నేటి విజయవాడ మహాధర్నాను అడ్డుకునేందుకు ప్రభుత్వ యత్నం

5

అప్పుల బాధతో గిరిజన రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి- రాజవొమ్మంగి (అల్లూరి జిల్లా)

పొగాకు పంటలో నష్టం రావడంతో మనస్తాపం చెందిన గిరిజన రైతు ఆత్మహత్య చేసుకున్నారు. ఈ విషాద ఘటన అల్లూరి సీతారామరాజు జిల్లా రాజవొమ్మంగి మండలం లాగరాయి గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు... పి.సత్తిబాబు (48) తన రెండు ఎకరాల పొలంలో పొగాకు పంట సాగు చేశారు. పెట్టుబడి కోసం అప్పులు చేశారు.

పంట దిగుబడి రాలేదు. అప్పులు తీరేలా లేవని మనస్తాపానికి గురై గురువారం పురుగుల మందు తాగారు. అపస్మారక స్థితికి చేరుకున్న ఆయనను కుటుంబ సభ్యులు స్థానిక పిహెచ్‌కి తరలించగా వారు ప్రాథమిక వైద్యం చేశారు. పరిస్థితి విషమంగా ఉండడంతో కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో సత్తిబాబు శనివారం రాత్రి మృతి చెందారు. రాజవొమ్మంగి హెడ్ కానిస్టేబుల్ రమణ కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఎంత అప్పు ఉన్నదీ దర్యాప్తులో తెలనుందని పోలీసులు తెలిపారు. సత్తిబాబుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. గ్రామంలో మంచి పేరు కలిగిన రైతు ఆత్మహత్యకు పాల్పడడంతో స్థానికంగా విషాదఛాయలు అలుముకున్నాయి.

ఛాంపియన్స్ మనమే

ఫైనల్లో న్యూజిలాండ్‌పై ఘన విజయం

- ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ రోహిత్
- ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ రచిన్ రవీంద్ర

దుబాయ్: ఐసిసి 9వ ఛాంపియన్స్ ట్రోఫీ టైటిల్‌ను టీమిండియా కైవసం చేసుకుంది. ఈ టోర్నీలో అప్రతిహతంగా ఫైనల్‌కు చేరుకున్న భారత్ ఆదివారం జరిగిన తుదిపోరులోనూ సత్తా చాటింది. దుబాయ్ ఇంటర్నేషనల్ స్టేడియంలో న్యూజిలాండ్‌తో జరిగిన ఫైనల్లో రోహిత్ సేన నాలుగు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. వరుసగా ఐదు మ్యాచుల్లో టాస్ ఓడిన రోహిత్.. అన్ని మ్యాచ్‌లను విజయాలతో ముగించడం మరో విశేషం. భారత్‌కు ఇది మూడో ఛాంపియన్స్ ట్రోఫీ. ఫైనల్లో తొలుత న్యూజిలాండ్‌ను 50ఓవర్లలో 7వికెట్ల నష్టానికి 251 పరుగులకే కట్టడి చేసిన టీమిండియా.. అనంతరం లక్ష్య ఛేదనలో 49ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 254పరుగులు చేసి విజయం సాధించింది. ఈ క్రమంలోనే 2021-22 ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్(డబ్ల్యుటిసి) ఫైనల్, 2000

రచిన్ రవీంద్ర

ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్లో న్యూజిలాండ్ చేతిలో ఓటమికి టీమిండియా బదులు తీర్చుకున్నట్లయ్యింది. లీగ్ దశలో బంగ్లాదేశ్‌ను చిత్తుచేసి శుభారంభం చేసిన టీమిండియా.. పాకిస్తాన్‌తో జరిగిన హై టెన్షన్ మ్యాచ్‌లోనూ ఆరు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. అప్పటికే సెమీస్ బెర్త్ ఖాయం చేసుకొన్న టీమిండియా.. నామమాత్రపు మూడో, చివరి లీగ్ మ్యాచ్‌లోనూ న్యూజిలాండ్‌ను చిత్తుచేసింది. ఇక సెమీఫైనల్లో పటిష్ట ఆస్ట్రేలియాపై 4వికెట్ల తేడాతో ఘన విజయం సాధించి రోహిత్ సేన ఫైనల్లోకి దూసుకొచ్చింది. ఈ క్రమంలోనే మరోసారి కివీస్‌పై విజయం సాధించి ముచ్చటగా మూడోసారి టైటిల్‌ను ముద్దాడింది. అంతకుముందు 2002, 2013లలో రెండుసార్లు ఛాంపియన్స్ ట్రోఫీ టైటిళ్లను నెగ్గిన టీమిండియా... దాదాపు 12ఏళ్ల తర్వాత మరోసారి ఛాంపియన్స్ ట్రోఫీలో విజేతగా నిలిచింది. మూడోసారి ఛాంపియన్స్ ట్రోఫీని కైవసం చేసుకున్న టీమిండియా రికార్డుపుటల్లోకెక్కింది. ఈ ట్రోఫీని మూడుసార్లు నెగ్గిన ఏకైక జట్టు టీమిండియా మాత్రమే. సౌరవ్ గంగూలీ(2002) సారథ్యంలోని భారతజట్టు శ్రీలంకతో తొలిసారి సంయుక్త విజేతగా నిలిచినా.. ధోనీ(2013) నేతృత్వంలో రెండోసారి టీమిండియా ఈ టైటిల్‌ను కైవసం చేసుకుంది.

ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీ అభ్యర్థులుగా

బీద రవిచంద్ర, గ్రీష్మ, బిటి నాయుడు

- ఒక స్థానం బిజెపికి కేటాయింపు
- నేడు నామినేషన్లు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ఎమ్మెల్యే కోటాలో ఖాళీ కానున్న శాసనమండలి స్థానాలకు టిడిపి కూటమి తన అభ్యర్థులను ఖరారు చేసింది. టిడిపి నుంచి నెల్లూరు జిల్లాకు చెందిన బీద రవిచంద్ర యాదవ్, శ్రీకాకుళం జిల్లాకు చెందిన కావలి గ్రీష్మ, కర్నూలు జిల్లాకు చెందిన సిట్టింగ్ ఎమ్మెల్సీ బిటి నాయుడు పేర్లను ఖరారు చేస్తూ ఆ పార్టీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదివారం సాయంత్రం ఒక ప్రకటన విడుదల చేశారు. బిజెపికి ఒక స్థానాన్ని కేటాయించారు. అయితే ఆదివారం రాత్రి వరకు బిజెపి తన అభ్యర్థిని ప్రకటించలేదు. ప్రస్తుతం ఎమ్మెల్సీలుగా కొనసాగుతున్న బిటి నాయుడు, పి అశోక్‌బాబు, యనమల రామకృష్ణుడు, జంగా కృష్ణమూర్తి, దువ్వారపు రామారావు మార్చి చివరి నాటికి పదవి విరమణ చేయనున్నారు. మొత్తం ఐదు స్థానాల్లో ఒక స్థానంలో ఇప్పటికే జనసేన నుంచి కొణిదెల నాగేంద్రబాబు నామినేషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. మిగిలిన నాలుగు స్థానాలకు గాను మూడు స్థానాల్లో టిడిపి తన అభ్యర్థులను ప్రకటించింది. ఆఖరి నిమిషంలో బిజెపికి ఒక స్థానం కేటాయించారు. నామినేషన్ల దాఖలుకు చివరి రోజు అయిన సోమవారమే వీరంతా నామినేషన్లు సమర్పించనున్నారు.

బీద రవిచంద్ర యాదవ్

గ్రీష్మ



బిటి నాయుడు

ఆశావహులకు నిరాశే

ఎమ్మెల్సీ పదవి కోసం టిడిపిలో చాలామంది ఆశలు పెట్టుకున్నారు. వీరిలో మాజీ ఎమ్మెల్యేలు ఎస్ఎన్ సత్యనారాయణ వర్మ, కొమ్మాలపాటి శ్రీధర్, దేవినేని ఉమామహేశ్వరరావు, కెఎస్ జవహర్, మోపిదేవి వెంకటరమణ, టిడి జనార్ధన్, పీతల సుజాత, కెఇ ప్రభాకర్,రెడ్డి సుబ్రహ్మణ్యం, తిప్పేస్వామి, మహ్మద్ నజీర్, మంతెన సత్యనారాయణ రాజు, జంగా కృష్ణమూర్తి తదితరులు ఉన్నారు. పిఠాపురం సీటు జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌కు త్యాగం చేసిన సత్యనారాయణ వర్మకు ఎమ్మెల్సీగా అవకాశం ఉంటుందని పార్టీలో అందరూ భావించినా అతనికి నిరాశ ఎదురైంది. టికెట్ ఇవ్వలేక పోతున్నామని వర్మతో పాటు మరికొంత మంది నాయకులకు టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్ ఫోన్ చేసి చెప్పినట్లు సమాచారం. 2027లో ఖాళీ అయ్యే స్థానాల్లో అవకాశం కల్పిస్తామని అధినేత చంద్రబాబు చెప్పారని నేతలకు శ్రీనివాస్ సమాచారం ఇచ్చారు.

చివరి నిమిషంలో బిజెపి

బిజెపికి చివరి నిమిషంలో ఎమ్మెల్సీ స్థానం దక్కింది. అయితే ఇటీవల రాజీనామాలతో ఖాళీ అయిన మూడు రాజ్యసభ స్థానాల్లో ఒక్కటి బిజెపికి కేటాయించామని, ఈ సారి ఇవ్వలేమని చంద్రబాబు బిజెపికి చెప్పినట్లు టిడిపి నేతలు చెబుతున్నారు. కానీ చివరి నిమిషంలో తమకు కూడా ఇవ్వాలని బిజెపి ఒత్తిడి చేయడంతో ఆ పార్టీకి కేటాయించినట్లు తెలిసింది. దీంతో టిడిపి నాయకుల్లో ఒకరికి కోత పెట్టాల్సి వచ్చిందని అంటున్నారు.

గిట్టుబాటు ధరపై ఆశలు

- నేటి నుంచి రాష్ట్రంలో పొగాకు కొనుగోలు
- గతేడాది డిమాండ్ వల్ల మంచి ధర

ప్రజాశక్తి- ఒంగోలు బ్యూరో

రాష్ట్రంలో కీలకమైన వాణిజ్య పంటైన పొగాకు వేలం సోమవారం నుంచి ప్రారంభం కానుంది. రైతులు వేలం కేంద్రాలకు బేళ్లను తరలించారు. ఆరంభంలో మంచి నాణ్యమైన పొగాకును అమ్మకానికి సిద్ధం చేసుకున్నారు. నాలుగు నెలలుగా కష్టపడి పండించిన పొగాకుకు గిట్టుబాటు ధర వస్తుందని ఆశిస్తున్నారు. వాతావరణం అనుకూలంగా లేనందున ఈ ఏడాది పెట్టుబడి ఎకరాకు అదనంగా రూ.50 వేలు పెరిగిందని రైతులు చెబుతున్నారు. ఈ తరుణంలో గతేడాది కంటే ఎంతోకొంత పెరిగితేనే గిట్టుబాటు అవుతుందని అంటున్నారు. వ్యాపారులు సిండికేట్ కాకుండా నియంత్రిస్తే పొగాకు బోర్డు రైతులకు మేలు చేసినట్లమవుతుంది. వేలంలో పోటీ ఉంటేనే ధరలు పెరుగుతాయి. గతేడాది డిమాండ్ ఉన్నందున ఆఖరులో కొనుగోలుదారులు ఎగబడ్డారు. ధరలు కూడా పెరిగాయి. రైతులకు లాభాలు రాకపోయినా నష్టం మాత్రం రాలేదు. ఈ ఏడాది కర్ణాటకలో ఆరంభ ధర రూ.330 పలికింది. అక్కడ పంట వంద మిలియన్ కిలోలకు అనుమతి ఇవ్వగా, 94 మిలియన్ కిలోల దిగుబడి వస్తుందని అంచనా. అక్కడ పంట అనుమతి కన్నా తగ్గడంపై ఇక్కడ రైతులకు కొంత ఊరట కలిగించే అంశం.

వాతావరణం అనుకూలంగా లేక పెరిగిన పెట్టుబడులు

ప్రకాశం రీజియన్ పరిధిలో 2,19,970 ఎకరాల్లో పొగాకు సాగైంది. 103.50 మిలియన్ కిలోలకు అనుమతి ఇవ్వగా, 161 మిలియన్ కిలోల దిగుబడి రావచ్చని అంచనా. గతేడాది ధర ఆశాజనకంగా ఉండడంతో ఈ ఏడాది సాగు పెరిగింది. అయితే, డిసెంబరులో మిగతా 2లో

పోర్టు ఆస్తుల ప్రైవేటీకరణ చర్యలు వేగవంతం

- గోల్డెన్ జూబ్లీ హాస్పిటల్‌కు రీ టెండర్
- 160 రోజులుగా పిపిపిపై పోరాడుతున్న ఉద్యోగులు, కార్మికులు
- పట్టించుకోని విపిటి యాజమాన్యం

3

విషాదాంతం

- టన్నెల్‌లో బయటపడిన మృతదేహం
- టిబిఎం ఆపరేటర్ గురుప్రీత్ సింగ్‌గా గుర్తింపు
- మరో ఏడుగురి కోసం అన్వేషణ

టన్నెల్‌లో సహాయక చర్యలు చేపడుతున్న రెస్క్యూ టీం

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

ఎస్ఎల్‌బిసి టన్నెల్ ప్రమాదంలో గల్లంతైన ఎనిమిది మందిలో ఒకరి మృతదేహం ఆదివారం బయటపడింది. కేరళ నుంచి రప్పించిన కడావర్ డాగ్స్, ఎన్‌డిఆర్ఎఫ్ ఆర్మీ, నేవీ బృందాల సమిష్టి కృషితో మట్టి దిబ్బల కింద మనుషుల ఆనవాళ్ళు గుర్తించారు. సహాయక బృందాలు వారిని వెలికితీసేందుకు పూర్తి స్థాయిలో సాంకేతికత, శక్తి సామర్థ్యాలను ఉపయోగిస్తున్నాయి.. కేరళ శునకాలు పసిగట్టిన ప్రాంతాల్లో తవ్వకాలు జరిపి ఆదివారం సాయంత్రం ఒక మృతదేహాన్ని బయటకు తీశాయి. 16 రోజులుగా బురదలో కూరుకుపోయి ఉండడంతో శరీరమంతా ఉబ్బి గుర్తుపట్టలేని విధంగా తయారైంది. చేతికి ఉన్న కడియం ఆధారంగా ఆ మృతదేహం టిబిఎం మిషన్ ఆపరేటర్ గురుప్రీత్ సింగ్‌గా గుర్తించారు. మృతదేహాన్ని అంబులెన్స్‌లో నాగర్ కర్నూల్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ పోస్ట్‌మార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించనున్నారు. సింగ్ మృతదేహం గుర్తించిన ప్రాంతంలోనే మిగిలిన వారు ఉండొచ్చని ఆ ప్రాంతంలో తవ్వకాలు జరుపుతున్నారు. సొరంగంలో గల్లంతైన ఎనిమిది మంది ఎప్పుడూ కలిసి ఉండే వారని, ఈ ప్రమాదంలో వీరందరూ కలిసే చనిపోయి ఉంటారని తోటి కార్మికులు కన్నీరు మున్నీరవుతున్నారు. ఒక మృతదేహాన్ని వెలికితీయడంతో సొరంగ ప్రాంతంలో విషాదఛాయలు అలుముకున్నాయి. 16 రోజుల క్రితం ఎస్ఎల్‌బిసి టన్నెల్ ప్రమాదం జరిగింది. అందులో చిక్కుకున్న వారిని కాపాడేందుకు 12 ఏజెన్సీలకు చెందిన సహాయక బృందాలు నిర్విరామంగా కృషి చేస్తున్నాయి. సొరంగం లోపల పరిస్థితులు ప్రమాదకరంగా మారడంతో పూర్తి స్థాయి సాంకేతికతను ఉపయోగించి రెస్క్యూ ఆపరేషన్ నిర్వహిస్తున్నారు. కార్మికులు గల్లంతైన ప్రదేశంలో 15 అడుగుల మేర మట్టి, బురద మేట వేయడంతో వారిని గుర్తించేందుకు కేరళ నుంచి కడావర్ డాగ్స్ మాయ, మర్ఫిలను తీసుకొచ్చారు. అవి మానవ ఆనవాళ్లను గుర్తించడంతో ఆ ప్రదేశంలో తవ్వకాలు జరిపి ఒక మృతదేహాన్ని వెలికితీశారు. రెండు రోజుల్లో ఎస్ఎల్‌బిసి సొరంగం ఆపరేషన్ పూర్తయ్యే అవకాశాలు ఉన్నాయని అధికారులు తెలిపారు. ఆదివారం సాయంత్రం ఆరు గంటల సమయంలో మరో మృతదేహం ఆనవాళ్లు గుర్తించినట్టు సమాచారం.

ప్రజా మిత్ర

సిపిఐ(యం)పై ఎందుకీ అక్కసు?

“విశ్వసనీయత” వెనుక మతలబు ఏమిటి?

ఆదివారం (ఈ నెల 9న) ఆంధ్రజ్యోతిలో ఆర్‌కె గారి కొత్త పలుకులో “కూటమికి పట్టం... ఐక్యత “భద్రం” అనే పేరుతో రాసిన సంపాదక వ్యాసం సిపిఐ(యం)పై ద్వేషాన్ని మరోసారి వెళ్లగక్కింది. గత మూడు మాసాల్లో సిపిఐ(యం)పై ఇలా దుర్మార్గంగా దాడి చేయడం, నిరాధార ఆరోపణలు చేసి ఆంధ్రజ్యోతి పాఠకుల్ని నమ్మించాలని ప్రయత్నించడం వెనుక మతలబు ఏమిటో సులభంగానే అర్థం చేసుకోవచ్చు. 'కామ్రేడ్స్ కష్టాలు' పేరుతో రాసిన ఈ దాడికి 'కామ్రేడ్స్‌తో కష్టాలు' అని పేరు పెట్టివుంటే బాగుండేది. తెలుగుదేశం తొమ్మిది నెలల పాలనా వైఫల్యం ప్రజల్లో వస్తున్న అసంతృప్తిని తగ్గించాలంటే ప్రజల తరపున గట్టిగా నిలబడి పోరాడుతున్న సిపిఐ(యం) “విశ్వసనీయత”ను దెబ్బతీయకుండా సాధ్యం కాదని రాధాకృష్ణ (ఆర్‌కె) గారు గ్రహించారని స్పష్టంగా అర్థమవుతున్నది. తెలుగుదేశాన్ని కాపాడే క్రమంలో సిపిఐ(యం)పై ఉద్దేశపూర్వకంగానే దాడి చేస్తున్నారు. మంచి కుక్కను కొట్టాలంటే పిచ్చికుక్కగా ముద్ర వేయాలన్న చాణక్య నీతిని ఆయనిక్కడ ప్రదర్శించారు. అందుకే ఉన్నవీ లేనివీ కల్పించి సిపిఐ(యం)పై ఆరోపణలు చేసి దాని విశ్వసనీయతపై దెబ్బకొడితే ప్రజా ఉద్యమాలను అరికట్టవచ్చని, అసంతృప్తిని అదుపు చేయొచ్చని ఆయన భావిస్తున్నారు. రానున్న రోజుల్లో సిపిఐ(యం) ఆధ్వర్యంలో ఉద్యమాలు ఉధృతమవుతాయని వారి కన్నా ముందే ఈయన పసిగట్టినట్లున్నారు. అందుకే ఈ ముందస్తు దాడి. వైసిపి కోసమే, వారి తరపున రహస్యంగా సిపిఐ(యం) ఈ పని చేస్తున్నదని నమ్మించడానికి నానా తంటాలు పడుతున్నారు.

రహస్య ఒప్పందం ఎవరిది?

సిపిఐ(యం)పై నిరాధార ఆరోపణలు చేస్తున్న ఆర్‌కె గారు అదే జగన్‌తో తెలుగుదేశం రహస్య ఒడంబడికల్ని మాత్రం కావాలని విస్మరిస్తున్నారు. అదానీ దగ్గర రూ.1750 కోట్లు లంచం తీసుకొని విద్యుత్ ఛార్జీలు పెంచి ఒప్పందం చేసుకున్న జగన్‌పై టిడిపి కూటమి ప్రభుత్వం ఎందుకు విచారణ జరపడం లేదు? ఎందుకు కేసు బుక్ చేయలేదు? ఇది రహస్య ఒప్పందం కాక మరేమిటి? జగన్ చేసుకున్న తప్పుడు విద్యుత్ ఒప్పందాల వల్ల లక్షా 80 వేల కోట్ల రూపాయల భారం పెరిగిందని శ్వేతపత్రంలో ఘనంగా పేర్కొన్న టిడిపి ప్రభుత్వం వాటిని ఎందుకు రద్దు చేయలేదు? స్మార్ట్ మీటర్లు ఉరితాళ్ళని, ధ్వంసం చేయమన్న లోకేష్ తమ పాలనలో అవే స్మార్ట్ మీటర్లను ఎందుకు బిగిస్తున్నారు? ఇది రహస్య ఒప్పందం కాదా? జగన్‌తో చేతులు కలపడం కాదా? ప్రజలపై దాడి చేయడానికి, భారాలు మోపడానికి జగన్ - చంద్రబాబుకు విభేదాల్లేవు. తగాదా అల్లా కుర్చీల కోసమే. అది కూడా నిజమైన పోరాటం కాదు. నిన్నటిదాకా వైసిపిలో పదవులు వెలగబెట్టిన పెద్ద మనుషులు ఇప్పుడు గోడదూకి టిడిపిలోకి రాగానే పవిత్రమైపోతారు. జగన్‌కు చంద్రబాబుకు వీరే వారధులనుకోవాలి కదా ! ఇందులో రాధాకృష్ణ గారికి ఏ విశ్వసనీయత కనిపించింది? తొమ్మిది మాసాల పాలన అనంతరం టిడిపికి వైసిపికి తేడా ఏమిటని టిడిపి శ్రేణులే అడుగుతున్నాయి. అది ఆర్‌కె రచనల్లోనూ వెల్లడవుతుంది.

రాష్ట్రానికి ద్రోహం చేసిన వారు పుణ్యాత్ములా?

ప్రత్యేక హోదా ఇవ్వకుండా విభజన హామీలు అమలు జరపకుండా ద్రోహం చేసిన బిజెపి సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వంలో ఆర్‌కె గారికి రవ్వంత తప్పు కనిపించలేదు. ఆ ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న టిడిపి విశాఖ ఉక్కును గాలికొదిలేసి కడప ఉక్కును పట్టించుకోకపోయినా, వాటికి బదులుగా మిట్టల్ ఫ్యాక్టరీకోసం నానా అగచాట్లు పడడం సరైందిగా కనిపిస్తుంది. బిజెపికి వైసిపి - టిడిపి ఇద్దరూ మద్దతుదారులే. ఢిల్లీలో మోడీ కుడి ఎడమల మద్దతునిస్తున్న ఈ రెండు పార్టీల వెనకున్న రహస్య అజెండా ఏమిటి? ఈ పార్టీల కూటమి టిడిపి - జనసేన - బిజెపి తెలంగాణాలో సైతం రావాలని కోరుకుంటున్న ఆర్‌కె గారికి ఇందులో విశ్వసనీయత చాలా కనిపిస్తున్నది.

సొంత ఫైళ్ళు తిరగేయండి సార్!

వైసిపి అధికారంలోకి వచ్చిన కొద్ది రోజుల్లోనే ఇసుక, మద్యం విధానాలను వ్యతిరేకించి పోరాడింది సిపిఐ(యం). ఒక్కసారి ఆంధ్రజ్యోతి పాత ఫైళ్ళు తిరగేయాలని రాధాకృష్ణ గారిని కోరుతున్నాను. పోలవరం నిర్వాసితులు, విశాఖ ఉక్కు, కడప ఉక్కు, దళితులపై అత్యాచారాలు, ప్రత్యేక హోదా, ఇలా ప్రతి సమస్యమీదా పోరాడింది సిపిఐ(యం). విద్యార్థి, యువజన, కార్మిక, రైతాంగ పోరాటాల్లోనూ సిపిఐ(యం) చురుగ్గా ఉన్న విషయం ఆంధ్రజ్యోతి పాత ఫైళ్ళు (జిల్లా ఎడిషన్లు) సహా. ఎందుకంటే వైసిపికి వ్యతిరేకంగా సిపిఐ(యం) పోరాటాలకు నాడు కూడా ఈ పత్రిక ప్రాచుర్యం కల్పించలేదు. అదీ వైసిపిపై వీరి ప్రేమ.

నాడు పోరాటాలు చేసి టీచర్స్, అంగన్‌వాడీ, ఆశా, మున్సిపల్, కాంట్రాక్టు ఉద్యోగుల పట్ల టిడిపి తీసుకున్న వైఖరి ఏమిటి? గిట్టుబాటు ధరలూ, పెన్షన్ల కోసం ఒక్క ఆందోళనైనా చేసిందా టిడిపి? దాన్ని గురించి ఆర్‌కె ఎందుకు ప్రస్తావించరు? జి.వో.నెం.3కి వ్యతిరేకంగా పోరాడింది ఎవరు? విద్యుత్ ఛార్జీల పెంపుదలను వ్యతిరేకించింది ఎవరు? పౌర హక్కుల్ని హరిస్తున్న జి.వో.కు వ్యతిరేకంగా పోరాడింది ఎవరు? భూటైటిలింగ్ యాక్టుకు నాడు గట్టిగా వ్యతిరేకించింది సిపిఐ(యం). టిడిపి కాదు. నాడు హైకోర్టులో కేసులకు, ప్రెస్‌కాన్ఫరెన్సు, టివి డిబేట్లకే పరిమితమైన టిడిపి చేసిందా? వైసిపి ప్రభుత్వం అంగన్‌వాడీలను బెదిరించి, నిర్బంధిస్తే, టీచర్లపై జులుం ప్రదర్శిస్తే ఆనాడు టిడిపి ఎక్కడుంది? కనీసం ఖండించిందా? నాడు సిపిఐ(ఎం)పై వైసిపి దాడి చేయగా ఆ పని నేడు టిడిపి చేస్తున్నది. అదే తేడా! నాడు విద్యుత్ ఛార్జీలు, స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా పయ్యావుల కేశవ్, చంద్రమోహన్‌రెడ్డి కేసులు వేశారా? వారు వేసిన కేసులకు వ్యతిరేకంగానే వారు నేడు నిర్ణయాలు చేసి అమలు చేస్తున్నారు. ఇది జగన్‌తో కుమ్మక్కు అవడం కాదా? దాన్ని ఆర్‌కె గారు ఎందుకు ప్రశ్నించడం లేదు? దిగజారుడు విమర్శలతో, ఆర్‌కె గారి విశ్వసనీయత ప్రశ్నార్థకం కాకుండా చూసుకోవాలని కోరుకుంటున్నాము.

ఇక సిపిఐ(యం) గతకాలపు నిజాయితీ, నిక్కచ్చి, విశ్వసనీయత గురించి, రాధాకృష్ణ గారు రాస్తూ అవి ఇప్పుడు లేవని, నాయకత్వం జగన్‌తో “రహస్య ఒప్పందాలు” చేసుకుందని నిరాధార ఆరోపణ చేశారు. ఆయన వద్ద ఏమైనా సాక్ష్యాధారాలు ఉంటే బయటపెడితే ప్రజలు కూడా సంతోషిస్తారు. తాను ఒక జర్నలిస్టునన్న విషయం మరిచిపోయి అనైతికంగా, రాజకీయ నాయకుడిలా సిపిఐ(యం)పై ద్వేషంతో నిరాధార ఆరోపణలు చేయడంలో “విశ్వసనీయత” ఎంతో ఆలోచించుకుంటే మంచిది. ఇలాగే సిపిఐ(యం)పై దిగజారి ఆరోపణలు చేసుకుంటూ పోతే వారి విశ్వసనీయతకే ముప్పు వస్తుందని గ్రహించాలి.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో టిడిపి గెలుపుతో వెయ్యి ఏనుగుల బలం వచ్చిందని మిగతా 2లో

టిటిడి ఆస్థాన విద్వాంసులు గరిమెళ్ల ఇక లేరు

ప్రజాశక్తి- తిరుమల

తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి) ఆస్థాన సంగీత విద్వాంసులు గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్ (76) ఆదివారం గుండెపోటుతో తిరుపతిలోని తన స్వగృహంలో కన్నుమూశారు. ఆయన మృతి పట్ల టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు తీవ్ర సంతాపం, కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. గరిమెళ్ల మృతి సంప్రదాయ సంగీత ప్రపంచానికి తీరని లోటని, టిటిడి ఆస్థాన విద్వాంసునిగా గరిమెళ్ల విశేష సేవలందించారని పేర్కొన్నారు. వెయ్యికిపైగా అన్నమాచార్య సంకీర్తనలకు స్వరకల్పన చేసిన ఘనత ఆయన సొంతమని తెలిపారు. వినరో భాగ్యము విష్ణుకథ, జగడపు చనువుల జాజర, పిడికిట తలంబ్రాల పెండ్లి కూతురు వంటి సుప్రసిద్ధ కీర్తనలకు స్వరాలు సమకూర్చారని, సంప్రదాయ కర్ణాటక, లలిత, జానపద సంగీతంలో ప్రసిద్ధులని వివరించారు. గరిమెళ్ల మృతికి టిటిడి మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి నివాళుర్పించారు. గరిమెళ్ల భౌతికకాయానికి సిఐటియు తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి పూలమాల వేసి నివాళులర్పించిలాయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడు తున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

బిఇడి పేపర్ లీకేజీ కేసులో పలువురి విచారణ

ప్రజాశక్తి - పెదకాకాని (గుంటూరు జిల్లా)

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పరిధిలో బిఇడి మొదటి సెమిస్టర్ పరీక్షల్లో భాగంగా గత శుక్రవారం నిర్వహించిన 'ప్రాస్పెక్టివ్స్ ఇన్ చైల్డ్ డెవలప్‌మెంట్' పరీక్ష ప్రశ్నా పత్రం లీకేజీ కేసులో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ కేసులో ఒడిశాకు చెందిన ముగ్గురిని గుంటూరు జిల్లా పెదకాకాని పోలీసులు శనివారం అదుపులోకి తీసుకోగా.. ఆదివారం మరో ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. వీరిలో పల్నాడు జిల్లా వినుకొండలోని వివేక కళాశాలకు చెందిన డైరెక్టర్, ప్రిన్సిపల్‌తోపాటు మరో ఐదుగురు ఉన్నారు. అనుమానితులుగా వారిని అదుపులోకి విచారణ చేస్తున్నామని, సాంకేతికతను ఉపయోగించి అసలైన సూత్రధారులను సాధ్యమైనంత త్వరగా పట్టుకుంటామని పెదకాకాని సిఐ టిపి.నారాయణస్వామి చెప్పారు.

గిట్టుబాటు ధరపై ఆశలు

(మొదటిపేజీ తరువాయి)

కురిసిన అకాల వర్షాలకు తోటలు దెబ్బతిన్నాయి. దీంతో, రెండు, మూడుసార్లు నాట్లు వేయాల్సి వచ్చింది. వాతావరణం సరిగా లేనందున ఎకరాకు రూ.50 వేలు అదనంగా పెట్టుబడి అయిందని టంగుటూరుకు చెందిన రైతు కాకుమాను శ్రీనివాసరావు తెలిపారు. ఎకరాకు లక్షన్నర పెట్టుబడి పెట్టినట్లు చెప్పారు. బ్యారన్‌కు రూ.10 లక్షల పెట్టుబడి పెట్టారు. పైగా బరువు కూడా తగ్గినట్లు చెబుతున్నారు. బేడు తొక్కాక గతేడాది 130 కిలోలు బరువు ఉండగా ఈ ఏడాది 110 కిలోలే వస్తుండడంతో పంట అంచనా కన్నా తగ్గే అవకాశాలు ఉంటాయని భావిస్తున్నారు.

ప్రారంభ ధరపైనే ఆశలు

ఒంగోలు, పొదిలి కేంద్రాల్లో సోమవారం నుంచి పొగాకు కొనుగోళ్లు మొదలు కానున్నాయి. ప్రారంభ ధర ఎంత ఇస్తారనే దానిపై రైతుల్లో ఉత్కంఠ ఉంది. ఎందుకంటే మొదట ఇచ్చిన ధర ఎక్కువ కాలంలో వేలంలో కొనసాగుతుంది. నెల రోజుల తర్వాతగానీ పెంచరు. గతేడాది కిలో రూ.230తో ప్రారంభించారు. గరిష్టంగా రూ.336కు చేరింది. రైతులకు సగటున కిలోకు రూ.270 వరకూ దక్కింది. ఈ ఏడాది ప్రారంభ ధర గతేడాది కంటే ఎంతోకొంత పెంచే ఇస్తారని రైతులు ఆశిస్తున్నారు. కర్ణాటకలో ఇచ్చిన ధర ఇస్తే నష్టం లేకుండా ఉంటుందని అంటున్నారు.

ఏటా పెరుగుతోన్న సిగరెట్ల ధరలు

సిగరెట్ ధరలు ఏటా పెరుగుతున్నాయి. ఒక్కో సిగరెట్ ధర ఏటా దాదాపు రూపాయి పెరుగుతోంది. ఈ లెక్కన పొగాకు ధరలు పెరగడం లేదు. సిగరెట్ కంపెనీలు ఏ ఒక్కటీ నష్టాల్లో లేవు. ఎగుమతులు పుష్కలంగానే ఉన్నాయి. మరోవైపు విదేశీ సిగరెట్లు ఇబ్బడిముబ్బడిగా దిగుమతి అవుతున్నాయి. ప్రీమియం బ్రాండ్ల పేరుతో రకరకాల సిగరెట్లు వస్తున్నాయి. వాటిని ఫ్యాషన్‌గా వాడుతున్నారు. ఇక్కడ ఐటిసి కంపెనీ సిగరెట్ల మార్కెట్లో అగ్రస్థానంలో ఉంది. దీని ధరలే ఎక్కువగా ఉన్నాయి. చైనా, యూరప్ దేశాల నుంచి ఎక్కువగా సిగరెట్లు ఇక్కడకు వస్తున్నాయి. వాటిపై నియంత్రణ లేదు. వాటి ప్రభావం దేశీయ కంపెనీలపై పడనుంది.

కమ్యూనిస్టుల చరిత్ర అంటే ప్రజల చరిత్రే

- 'నవ సమాజం కోసం' పుస్తకావిష్కరణ సభలో వి శ్రీనివాసరావు

పుస్తకావిష్కరణ చేస్తున్న వి.శ్రీనివాసరావు తదితరులు

ప్రజాశక్తి- కాకినాడ ప్రతినిధి

కమ్యూనిస్టుల చరిత్ర అంటే అది ప్రజల చరిత్ర అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. సిపిఎం కాకినాడ జిల్లా కమిటీ సభ్యులు దువ్వా శేషబాబ్జి రచించిన 'నవ సమాజం కోసం' పుస్తకావిష్కరణ కార్యక్రమం కాకినాడలోని అన్నదాన సమాజంలో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి కరణం ప్రసాదరావు అధ్యక్షతన నిర్వహించిన సభలో వి.శ్రీనివాసరావు ముఖ్యవక్తగా మాట్లాడారు. ప్రజా పోరాటాల చరిత్రే కమ్యూనిస్టు ఉద్యమ చరిత్ర అని వివరించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో స్వాతంత్ర్యోద్యమ కాలంలోనే కమ్యూనిస్టు బీజాలు పడ్డాయన్నారు. నాడు కాకినాడ అన్నదాన సమాజంలో రహస్యంగా పార్టీ ఏర్పడిందని తెలిపారు 1934-1964 మధ్య ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో కమ్యూనిస్టు ఉద్యమ ఘట్టాలను వివరిస్తూ శేషబాబ్జి 'నవ సమాజం కోసం' పేరుతో పుస్తకాన్ని తీసుకురావడం అభినందనీయమన్నారు. తెలంగాణ సాయుధ పోరాటానికి మద్దతుగా ఈ జిల్లాలో పోరాటం జరిగిందని గుర్తు చేశారు. కమ్యూనిజం అంతరించిపోయిందని అమెరికాలో తీవ్ర ప్రచారం జరిగిందన్నారు. నేడు కమ్యూనిస్టు పేరు వింటేనే ట్రంప్ ఉలిక్కి పడుతున్నారని తెలిపారు. ప్రపంచంలో ఆర్థిక సంక్షోభం తీవ్రతరం అవుతున్న నేపథ్యంలో ప్రజలు ఎర్రజెండా వైపు చూస్తారన్నారు. బూర్జువా, భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా ప్రజలను ఐక్యం చేయడం కమ్యూనిస్టుల కర్తవ్యం కావాలని సూచించారు. ఎంఎల్‌ఎలు, ఎంపిలు లేనంత మాత్రాన కమ్యూనిస్టుల చరిత్ర మరుగున పడిపోయేది కాదన్నారు. యువకులు ఈ పుస్తకాన్ని అధ్యయనం చేయాలని కోరారు. సమాజంలో మార్పు కోసం ఏమి చేయాలో మార్గనిర్దేశం చేయడానికి ఇది తోడ్పడుతుందని తెలిపారు. వామపక్షాల మద్దతుతో ఉపాధి హామీ వంటి అనేక చట్టాలు వచ్చాయన్నారు. కానీ, వాటిని నిర్వీర్యం చేసేందుకు క్రాప్ హాలిడేలాంటి కుట్రలు జరుగుతున్నాయని వివరించారు. కమ్యూనిస్టుల పోరాటాలు, త్యాగాలు వథా కాలేదన్నారు. వివిధ ప్రభుత్వ రంగ కార్యాలయాల్లో, సంస్థల్లో కార్మిక సంఘాలను నిర్మించింది కమ్యూనిస్టులేనని, కార్మికులను ఏకతాటిపైకి తీసుకొచ్చి పెట్టుబడిదారుల దోపిడీని ప్రశ్నించింది కమ్యూనిస్టులేనని గుర్తు చేశారు. ప్రజా ఉద్యమాలను ఏకం చేయడమే ముందున్న కర్తవ్యమన్నారు. తద్వారా కమ్యూనిస్టు పార్టీ బలమైన ప్రత్యామ్నాయ శక్తిగా ముందుకు వస్తుందని పేర్కొన్నారు. బూర్జువా, భూస్వామ్య పార్టీల కుట్రలు, కుతంత్రాలు ఎదుర్కొని ప్రజలను ఐక్యంగా నిలబెట్టాల్సిన అవసరం ఉందన్నారు. దేశంలో చరిత్ర వక్రీకరణ జరుగుతోందని, సామాన్యుల చరిత్రను పక్కనపెట్టి దాని స్థానంలో మతోన్మాద చరిత్రను ముందుకు తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. సామాజికాభివృద్ధి క్రమంలో ఉత్పత్తిని పెంచడానికి శ్రమ కీలకమైందనే విషయాన్ని బయటకు రానీయకుండా పెట్టుబడిదారులు అన్ని రకాల కుట్రలూ చేస్తున్నారన్నారు. శ్రమ కాకుండా పెట్టుబడే కీలకమంటూ వారు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో పుస్తక రచయిత దువ్వా శేషబాబ్జి, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎవి.నాగేశ్వరరావు, జెవివి సీనియర్ నాయకులు డాక్టర్ చెలికాని స్టాలిన్, ఐడియల్ విద్యా సంస్థల అధినేత డాక్టర్ పి.చిరంజీవినీకుమారి, సిపిఐ తూర్పుగోదావరి జిల్లా కార్యదర్శి టి.మధు, సిపిఎం తూర్పుగోదావరి జిల్లా కార్యదర్శి టి.అరుణ్, లిబరేషన్ నాయకులు గొడుగు సత్యనారాయణ, చిన్నబిల్లి నాగేశ్వరరావు, కమ్యూనిస్టు ఉద్యమంలో అమరుల కుటుంబ సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

12న 'ఉపాధి' కార్మికుల ధర్నా

- వ్యవసాయ కార్మిక సంఘం పిలుపు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉపాధి హామీ చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేసి వలసలు నివారించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్ చేసింది. ఉపాధి కార్మికుల డిమాండ్ల పరిష్కారం కోసం ఈ నెల 12న ధర్నా చేపట్టనున్నట్లు తెలిపింది. విజయవాడలోని ఎంబి విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆ సంఘం ప్రధాన కార్యదర్శి వి వెంకటేశ్వర్లు ఆదివారం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో తీవ్రమైన అతివృష్టి, అనావృష్టికి తోడు వ్యవసాయ సంక్షోభం, యంత్రాల ప్రవేశపెట్టడంతో గ్రామాల్లో పనులు లేక లక్షల వ్యవసాయ కార్మికులు వలసలు పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గుంటూరులో మిర్చికోత కోసేందుకు కర్నూలు జిల్లా నుంచి సుమారు లక్ష మంది వలస వచ్చారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థమవుతుందని తెలిపారు. ఈ వలసల వల్ల పిల్లల చదువులు పాడవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. జనవరి నుంచి ఇప్పటి వరకు వలసల వల్లే రాష్ట్రంలో 1570 మంది చనిపోయారని తెలిపారు. వలసల నివారణ కోసం తీసుకొచ్చిన ఉపాధి హామీ చట్టం పాలకుల నిర్లక్ష్యం వల్ల సక్రమంగా అమలు జరగడం లేదని పేర్కొన్నారు. ఉపాధి పథకానికి తగిన నిధులు కేటాయించి, ఉపాధి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం సహాయ కార్యదర్శి ఈ అప్పారావు, ఉపాధ్యక్షులు కోటా కళ్యాణ్, రాష్ట్ర కమిటీ సభ్యులు అప్పలస్వామి పాల్గొన్నారు.

సహకార రంగం బలోపేతానికి ఎపిసిసిబిఇఎ కృషి

- కె.రామకృష్ణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సహకార రంగం బలోపేతానికి ఆంధ్రప్రదేశ్ కోఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఎపిసిసిబిఇఎ) కృషి మరువలేనిదని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, అసోసియేషన్ వజ్రోత్సవ కమిటీ ఛైర్మన్ కె.రామకృష్ణ అన్నారు. అసోసియేషన్ 59 ఏళ్ల ప్రస్థానం, ఉద్యమం చారిత్రాత్మకంగా నిలిచిందన్నారు. విజయవాడలోని దాసరి భవన్‌లో ఎపిసిసిబిఇఎ వజ్రోత్సవాల లోగో, పోస్టర్‌ను అసోసియేషన్ నేతలతో కలిసి రామకృష్ణ ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఉద్యోగుల హక్కుల రక్షణ, గ్రామీణ వ్యవసాయ రంగ అభివృద్ధి లక్ష్యంగా అసోసియేషన్ పని చేస్తూ 60 ఏళ్లలోకి ప్రవేశించడం గర్వించదగిన విషయమని చెప్పారు. వజ్రోత్సవాలకు ఏఐబిఇఎ జాతీయ నాయకులు వెంకటాచలం, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు, తదితర ప్రముఖులను ఆహ్వానించనున్నట్లు తెలిపారు. అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెవిఎస్ రవికుమార్ మాట్లాడుతూ... ఏప్రిల్ 13, 14వ తేదల్లో విజయవాడలోని ఎంబివికెలో అసోసియేషన్ వజ్రోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించాలని నిర్ణయించినట్లు చెప్పారు.

12న వైసిపి 'యువత పోరు'

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వైసిపి ఆధ్వర్యంలో ఈ నెల 12న చేపట్టనున్న 'యువత పోరు' కార్యక్రమంలో యువత, నిరుద్యోగులను మోసం చేస్తోన్న కూటమి ప్రభుత్వ వైఖరిని నిలదీయాలని వైఎస్‌ఆర్‌సిపి రాష్ట్ర సమన్వయకర్త సజ్జల రామకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. యువత పోరు, పార్టీ ఆవిర్భావ దినోత్సవాలపై తాడేపల్లి పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఆదివారం రీజినల్ కోఆర్డినేటర్లు, జిల్లా అధ్యక్షులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సజ్జల మాట్లాడుతూ... ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.3,900 కోట్లు ఉంటే, బడ్జెట్‌లో కేవలం రూ.2,600 కోట్లు మాత్రమే ప్రభుత్వం కేటాయించిందన్నారు. మెడికల్ కళాశాలలను ప్రైవేటు పరం చేయాలని ప్రయత్నిస్తోందని తెలిపారు. ఈ నెల 12న వైసిపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఉత్సాహంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. మండల కమిటీల ఏర్పాటుకు నియోజకవర్గ ఇన్‌ఛార్జిలు చర్యలు తీసుకోవాలని సూచించారు.

సమస్యలు వింటూ.. భరోసా ఇస్తూ..

సిపిఎం ప్రజా చైతన్య యాత్రలు

నెల్లూరులో ప్రజా చైతన్య యాత్ర నిర్వహిస్తున్న సిపిఎం నేతలు

ప్రజాశక్తి-యంత్రాంగం

ప్రజా సమస్యల పరిష్కారం కోరుతూ సిపిఎం చేపట్టిన ప్రజా చైతన్య యాత్రలు ఆదివారం ప్రకాశం, పశ్చిమగోదావరి, విజయవాడ, నెల్లూరు జిల్లాల్లో సాగాయి. ఈ సందర్భంగా సిపిఎం నేతలు ఇంటింటికీ వెళ్లి స్థానిక ప్రజల సమస్యలు తెలుసుకుంటూ.. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని భరోసా ఇస్తూ ముందుకు సాగారు.

పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం మండలం రుస్తుంబాద నుంచి ప్రారంభమైన ప్రజా చైతన్య యాత్ర నరసాపురం పట్టణం, యలమంచిలి మండలం మీదుగా పాలకొల్లుకు చేరుకుంది. ఈ యాత్రకు జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ నాయకత్వం వహించారు. పలుచోట్ల ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరిస్తూ.. ఆయా సమస్యలను పరిశీలిస్తూ యాత్ర ముందుకు సాగింది. యలమంచిలి మండలం చించినాడలో దళితుల శ్మశానవాటికను ఆనుకుని నిబంధనలకు విరుద్ధంగా ఓ భూస్వామి తవ్విన రొయ్యల చెరువును తక్షణం పూడ్పించాలని ఆర్‌డిఒ దాసురాజు దృష్టికి గోపాలన్ తీసుకెళ్లారు. వారం రోజుల్లో అధికారులు చర్యలు తీసుకోకపోతే తామే ప్రత్యక్ష కార్యాచరణకు దిగుతామని హెచ్చరించారు. విజయవాడలోని వాంబే కాలనీ 'ఇ' బ్లాక్, కృష్ణలంక 21, 22వ డివిజన్‌లలో సిపిఎం నాయకులు, కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి ప్రజా సమస్యలను తెలుసుకున్నారు. శానిటేషన్ వ్యవస్థ అధ్వాన్నంగా ఉందని, దోమల బెడద అధికంగా ఉందని, మంచినీటి పైపుల్లో మురుగునీరు సరఫరా అవుతోందని స్థానికులు తెలిపారు. తాగేందుకు మంచినీళ్లు కొనుక్కొని తాగాల్సి వస్తుందని నేతల ఎదుట వాపోయారు.

విద్యుత్ బిల్లులు ఇబ్బడి ముబ్బడిగా పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. జెఎన్‌ఎన్‌యు ఆర్‌ఎం, టిడ్కో గృహాలను లబ్దిదారులమైన తమకు అప్పగించడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మ్యాన్‌హోల్స్ పొంగి పొర్లుతున్నాయని, కరకట్ట దిగువున కుక్కల బెడద ఎక్కువైందని, గంజాయి బ్యాచ్ ఆగడాలు ఎక్కువయ్యాయని తెలిపారు.

ఈ యాత్రల్లో భాగంగా 21వ డివిజన్‌లో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్, 22వ డివిజన్‌లో సిపిఎం సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శివర్గ సభ్యులు కె.దుర్గారావు మాట్లాడుతూ ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎ.కొండూరు మండలం పాత కొండూరు దళితపేట పేద రైతులు, కూలీలు తమకు భూ సమస్యను సిపిఎం నేతల దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై సిపిఎం జిల్లా కార్యదర్శి డివి కృష్ణ మాట్లాడుతూ ఈ నెల 24న తహశీల్దార్ కార్యాలయం వద్ద రైతులు ఆందోళన చేయాలని నిర్ణయించారు. ప్రకాశం జిల్లా కొండపి మండలంలోని మిట్టపాలెంలో చేపట్టిన ప్రజా చైతన్య యాత్రలో ప్రజలు పలు సమస్యలను నేతల దృష్టికి తీసుకొచ్చారు. రహదారులు, మంచినీరు, డ్రెయినేజీ సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కంకణాల ఆంజనేయులు, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కేజీ మస్తాన్, బి.రఘురామ్, కంకణాల రమాదేవి పాల్గొన్నారు. చీమకుర్తిలోని రామ్‌నగర్ కాలనీ, సంతనూతలపాడు మండలంలోని పేర్నమిట్ట, శాంతినగర్, అంబేద్కర్ నగర్, ఎన్‌టిఆర్ కాలనీ, ఉత్తర బజార్‌లో సిపిఎం నేతలు పర్యటించారు. నెల్లూరులోని 54వ డివిజన్, జనార్ధన్‌రెడ్డి కాలనీ, లక్ష్మీపార్వతి నగర్ ప్రాంతాల్లో సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, నగర కార్యదర్శి వర్గ సభ్యులు జి.నాగేశ్వరరావు, నగర కమిటీ సభ్యులు ఎం ప్రసాద్ ఇంటింటికి వెళ్లి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

పిపిపి విధానం ఉపసంహరించుకోవాలి

- వైద్య కళాశాలలపై సిఎంకు ప్రజారోగ్య వేదిక లేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో కొత్త వైద్య కళాశాలలను ప్రభుత్వ,ప్రైవేట్ భాగస్వామ్యం(పిపిపి) విధానంలో తీసుకురావాలనే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని ప్రజారోగ్యవేదిక డిమాండ్ చేసింది. ఈ మేరకు వేదిక అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎంవి రమణయ్య, టి కామేశ్వరరావు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఆదివారం లేఖ రాశారు. గత ప్రభుత్వం ప్రారంభించిన 17 వైద్య కళాశాలల్లో 10 కళాశాలలను పిపిపి విధానంలోకి మార్చడం, ఇదే విధానం ద్వారా కొత్త కళాశాలలను స్థాపించడం తీవ్ర ఆందోళన కలిగించే విషయమని పేర్కొన్నారు. ప్రజలకు వైద్యం అందించడం, ఆరోగ్యాన్ని సంరక్షించడం ప్రభుత్వ అత్యున్నత బాధ్యత అని తాము గట్టిగా విశ్వసిస్తున్నామని తెలిపారు. ఆరోగ్య సంరక్షణలో ముఖ్యమైన వైద్య విద్యను పిపిపి నమూనా ద్వారా ప్రైవేట్ సంస్థలకు అప్పగించడం వల్ల రాష్ట్ర ప్రజలకు ఆరోగ్య లభ్యత, వైద్య ఖర్చులను భరించగలిగే సామర్థ్యం, ప్రాథమిక హక్కు గురించి తీవ్రమైన ఆందోళనలు తలెత్తుతున్నాయని తెలిపారు. ఈ ప్రతిపాదనను పున:పరిశీలించాలని కోరారు. వైద్య కళాశాలల్లో స్వయం ఆర్థిక సీట్లను ప్రవేశపెట్టడాన్ని ప్రతిపక్షంలో ఉండగా టిడిపి వ్యతిరేకించిందని, ఈ విధానాన్ని రద్దు చేస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిందని తెలిపారు. ఇప్పుడు ఆ వాగ్దానాలకు, ప్రజల ఆశలకు విరుద్ధంగా పిపిపి పేరుతో ప్రయివేటుపరం చేయడం సమంజసం కాదన్నారు. స్వయం ఆర్థిక సీట్ల విధానాన్ని రద్దు చేయాలని గత ప్రభుత్వానికి కూడా తాము వినతిపత్రం అందించామని పేర్కొన్నారు. ప్రజల ఆర్థిక స్థితితో సంబంధం లేకుండా అందరికీ సమానమైన వైద్య అందించాలన్నా, వైద్య సేవల వాణిజ్యకరణను నిరోధించాలన్నా ఆరోగ్య సంరక్షణ ప్రభుత్వ నియంత్రణలోనే ఉండాలని తెలిపారు. వైద్య విద్యలో పిపిపి అమలు వల్ల వైద్య విద్య ఖర్చులు విపరీతంగా పెరుగుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. కాబట్టి ఈ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

కొల్లేరు ఆక్రమణలపై అటవీ శాఖ సర్వే

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

కొల్లేరులో సర్వే చేస్తున్న ఫారెస్ట్ అధికారులు

కొల్లేరు సరస్సు ఆక్రమణలపై అటవీశాఖ అధికారులు సర్వే ప్రారంభించారు. సుప్రీం కోర్టు తీర్పు నేపథ్యంలో కొల్లేరు ఐదో కాంటూరు పరిధిలోని సరిహద్దులకు సంబంధించిన నిర్ధారణపై వివరాలు తెలుసుకునేందుకు ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ రాష్ట్ర ఉన్నతాధికారి ఎకె.నాయక్, రాజమండ్రి ఫారెస్ట్ కన్జర్వేటర్ ఫారెస్ట్ అధికారి బిఎన్‌ఎన్.మూర్తి, జిల్లా ఫారెస్ట్ అధికారి విజయ, టెరిటోరియల్ డిఎఫ్ఒ త్రిశుభం, ఇతర ఫారెస్టు అధికారులు ఆదివారం కొల్లేరు ప్రాంతంలో పర్యటించారు. కొల్లేరు చిత్తడి నేలల పరిధిలో ఉండటంతో అధికారులు ఐదో కాంటూరుకు సంబంధించి సరిహద్దుల నిర్ధారణపై పరిశీలనకు దిగారు. కొల్లేరు ప్రాంతాలైన కలకుర్రు, పులపర్రు, గుడివాకలంక వద్ద మాధవాపురం, పత్తికోళ్లలంలో డ్రోన్ల సహాయంతో సరిహద్దులను పరిశీలిస్తున్నారు. గతంలో నిర్ణయించిన సరిహద్దులు కొన్నిచోట్ల సరిపోతుండగా మరికొన్ని చోట్ల జిరాయితీ భూముల్లో సరిహద్దులు ఉన్నట్లుగా తెలిసింది. కొల్లేరు సరిహద్దులను పూర్తి స్థాయిలో తేల్చాలని సుప్రీంకోర్టు ఆదేశాలతో అధికారులు దీనిపై పూర్తిగా నిమగ్నమయ్యారు. సరిహద్దుల నిర్ణయంలో ఎదురవుతున్న ఇబ్బందులను సుప్రీం కోర్టుకు తెలిపేందుకు ఉన్నతాధికారులే నేరుగా పరిశీలనకు వచ్చినట్లు తెలుస్తోంది. 2024 డిసెంబర్‌లో ఇచ్చిన సుప్రీంకోర్టు తీర్పుతో కొల్లేరు ఐదో కాంటూరులోపు ఉన్న అక్రమ చెరువులను గండ్లు కొట్టే ప్రక్రియ సాగుతోంది. ఇప్పుడు కొల్లేరు సరిహద్దుల నిర్ణయంపైన సుప్రీం కోర్టులో మరో కేసు ఉండడంతో ఆ పని తేల్చే పనిలో అధికారులు ఉన్నారు. రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారుల సైతం కొల్లేరులో పర్యటనకు రావడంతో అక్కడి ప్రజల్లో ఏం జరుగుతుందోనన్న ఆందోళన నెలకొంది.

మహాధర్నాకు భారీగా హాజరైన ఉక్కు కాంట్రాక్టు కార్మికులు

అక్రమ తొలగింపులపై ఉక్కు కాంట్రాక్టు కార్మికుల మహాధర్నా

ప్రజాశక్తి - గాజువాక (విశాఖపట్నం)

స్టీల్‌ప్లాంట్‌లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులను అక్రమంగా తొలగించడాన్ని నిరసిస్తూ ఉక్కు అఖిలపక్ష కాంట్రాక్టు కార్మిక సంఘాల ఆధ్వర్యాన పాత గాజువాక జంక్షన్‌లో ఆదివారం మహా ధర్నా జరిగింది. పెద్ద ఎత్తున కాంట్రాక్టు కార్మికులు తరలివచ్చారు. వారి ఆందోళనకు రాజకీయ పార్టీలు, ఉక్కు కార్మిక సంఘాలు మద్దతు తెలిపాయి. ప్లాంట్‌లో కాంట్రాక్టు కార్మికుల అక్రమ తొలగింపులను ఆపకుంటే నిరవధిక సమ్మెకు దిగక తప్పదని కాంట్రాక్టు కార్మికులు హెచ్చరించారు. కాంట్రాక్టు కార్మికులను ఎవ్వరినీ తొలగించొద్దని ఇప్పటి వరకూ తొలగించిన వారందరినీ విధుల్లోకి తీసుకోవాలని, ఇఎస్‌ఐ లేని కార్మికులకు స్టీల్ యాజమాన్యమే వైద్య సౌకర్యం కల్పించాలని, నిర్వాసితులకు శాశ్వత ఉపాధి కల్పించాలని పెద్దపెట్టున నినదించారు. స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు లేబర్ యూనియన్ (సిఐటియు) అధ్యక్షులు జి.శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌లో అక్రమ తొలగింపులను ఆపాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందన్నారు. ఇప్పటికీ ప్లాంట్‌లో ఉద్యోగాలు రాని నిర్వాసితులు 8500 మంది, భర్తీ చేయాల్సిన ఉద్యోగ ఖాళీలు 5 వేల వరకు ఉన్నాయని తెలిపారు. ప్లాంట్ ఉత్పత్తి సామర్థ్యం 4.3 నుండి 7.3 మిలియన్ టన్నులకు చేరిందని, భవిష్యత్తులో 20 వేల మిలియన్ టన్నుల వరకు విస్తరణకు అవకాశముందని వివరించారు. ఈ నేపథ్యంలో కార్మికులను పెంచాల్సిందిపోయి విఆర్‌ఎస్ పేరుతో పర్మినెంట్ కార్మికులను, బలవంతంగా కాంటాక్ట్ కార్మికులను తొలగించడం అన్యాయమన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు కెఎం.శ్రీనివాస్, ఎన్.రామారావు, ఉక్కు కాంట్రాక్టు కార్మిక సంఘాల నాయకులు నమ్మి రమణ, మంత్రి రవి, కె.వంశీ, ఉరుకూటి అప్పారావు, విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు జె.అయోధ్యరాం, డి.ఆదినారాయణ, ఎం రాజశేఖర్, యు.రామస్వామి, వైసిపి గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి, సిపిఐ నాయకులు కె.సత్యనారాయణ, టిడిపి నాయకులు పులి రమణారెడ్డి పాల్గొన్నారు.

సర్వేయర్ల సమస్యలు పరిష్కరించండి

- గ్రామ సర్వేయర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు మధుబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అర్హులైన సర్వేయర్లకు శాఖాపరమైన పరీక్షలు నిర్వహించి, పదోన్నతులు కల్పించాలని గ్రామ సర్వేయర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు బూరా మధుబాబు కోరారు. గ్రామ సర్వేయర్లు ఎదుర్కొంటున్న ఇతర సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వియజవాడలోని ధర్నా చౌక్‌లో ధర్నా కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మధుబాబు మాట్లాడుతూ... భూముల సర్వేకు అవసరమైన ల్యాప్‌ట్యాప్‌లు, ప్రింటర్లు, స్టేషనరీ ప్రభుత్వం సమకూర్చడం లేదన్నారు. మండలంలో సుమారు 15 మంది సర్వేయర్లకు ఒక ల్యాప్‌ట్యాప్ మాత్రమే ఇచ్చారని దీంతో సర్వే పనులు ముందుకు సాగని పరిస్థితి నెలకొందన్నారు. సచివాలయాలను క్రమబద్ధీకరించే క్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 9,801 గ్రామ సర్వేయర్లకు, 5079 మందిని సచివాలయాల్లో ఉపయోగించుకుని మిగిలిన 4,722 మందిని ఇతర శాఖల్లో సర్దుబాటు చేయాలని ప్రభుత్వం భావిస్తోందని, టెక్నికల్ నైపుణ్యం కలిగిన వీరిని అటువంటి శాఖల్లోనే సర్దుబాటు చేయాలని కోరారు. గ్రామ సర్వేయర్లు సర్వే చేసి ఇచ్చిన నివేదికలపై విఆర్వోలు సంతకాలు చేయడం లేదన్నారు. అందువల్ల రీ సర్వేలో విఆర్వోలను భాగస్వాములు చేయాలని కోరారు. ఎస్‌ఒపిలో ఉన్న ప్రొసీజర్‌ను అమలు చేయడం లేదన్నారు. రీ సర్వే డిప్యూటీ తహశీల్దారులు (ఆర్‌ఎస్‌డిటి) ఉన్న భూ తగాదాలను పరిష్కరించకుండా కొత్త సమస్యలు తెచ్చి పెడుతున్నారని తెలిపారు. వీరు భూ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లడం లేదని చెప్పారు. గ్రామ సర్వేయర్లు అధికారికంగా సెలవు తీసుకున్నా, పంచాయతీ కార్యదర్శులు, తహశీల్దారులు, మండల సర్వేయర్లు బలవంతంగా పని చేయించుకుంటున్నారని తెలిపారు. సంఘం విజయవాడ నగర అధ్యక్షులు కార్తీక్ మాట్లాడుతూ... గ్రామ సర్వేయర్లపై రెవెన్యూ అధికారుల అజమాయిషీ తగ్గించాలన్నారు. టైం స్కేల్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర నాయకులు అయ్యప్పల నాయుడు, అంకయ్య, ఓంకార్, జిల్లా నాయకులు లోకేష్, శ్రీనివాస్, సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

సిపిఐ(యం)పై ఎందుకీ అక్కసు?

(మొదటిపేజీ తరువాయి)

ఉబ్బితబ్బిబై పోతున్నారు. పిడిఎఫ్‌పై గెలవడానికి టిడిపి అనేక అక్రమ పద్ధతులు అనుసరించింది. రాధాకృష్ణగారు ఈ విషయం తెలుసుకొని విస్మరించినట్లు నటిస్తున్నారు. పిడిఎఫ్‌పై గెలిచి టిడిపి చేసుకుంటున్న సంబరాలు చూస్తుంటే ఎంత భయపడ్డారో ఎవరికైనా ఇట్టే అర్థమైపోతుంది. టిడిపి శ్రేణులే ఆశ్చర్యపోతున్నాయి. ఏమిటీ అల్ప సంతోషమని ముక్కున వేలేసుకుంటున్నారు. రాధాకృష్ణగారికి మాత్రం ఇది వెయ్యేనుగుల బలం ఇచ్చింది. టీచర్, గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో సిపిఐ(యం) ఏనాడూ పోటీ చేయలేదు. అభ్యుదయ విద్యావంతులు, ఉద్యమాల నాయకులు పిడిఎఫ్‌గా ఏర్పడి పోటీ చేస్తున్నారు. గత ఎన్నికల నుండి వైసిపి, టిడిపిలు రంగంలో దిగి వాటిని రాజకీయ రణంగా మార్చాయి. దానివల్ల నష్టపోతున్నది టీచర్లు, విద్యావంతులైన నిరుద్యోగులు, ఉద్యోగవర్గాలే. వారిలో పాలకపార్టీపై - అది వైసిపి అయినా, టిడిపి అయినా - విశ్వసనీయత తగ్గిపోతున్నది. ఈ ఆగ్రహాన్ని దారి తప్పించడానికే రాధాకృష్ణగారు కలం బాణాన్ని వదిలారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో, 2023లో జరిగిన రాయలసీమ తూర్పు, పశ్చిమ ఎన్నికల్లో వైసిపి దెబ్బకు తట్టుకోలేక టిడిపి చేతులెత్తేస్తే ఎదుర్కొని గట్టిగా నిలబడింది సిపిఎం అన్న విషయం టిడిపి నాయకులకు కూడా తెలుసు. నాడు పోలింగ్ బూత్‌ల వద్ద వైసిపి దుర్మార్గాలను ఎదుర్కొని నిలబడింది సిపిఐ(యం) పార్టీయేనన్నది జగమెరిగిన వాస్తవం. అప్పుడు సిపిఐ(యం) విశ్వసనీయత రాధాకృష్ణ గారికి గుర్తురాలేదు. జగన్ ముఖ్యమంత్రిగా ఉన్న ఐదు సంవత్సరాల కాలంలో టిడిపి ప్రజలకోసం చేసిన ఉద్యమాలేమిటి? వారిపై పెట్టిన కేసులెన్ని? రాధాకృష్ణగారు లెక్కలు సేకరించాలి. ఈ కాలంలో సిపిఐ(యం) నిర్వహించిన ఉద్యమాలు, కేసుల గురించి వారు చెప్తారు. గురివింద గింజ సామెతలాగా జగన్ దెబ్బకు భయపడి, కేసులొస్తాయని లొంగిపోయిన వాళ్ళు ఇప్పుడు అధికారం రాగానే వీరత్వం ప్రదర్శిస్తున్నారు. రాధాకృష్ణగారి బాధ నాడు సిపిఐ(యం) పోరాటాలు చేయనందుకు కాదు. ఇప్పుడు చేస్తున్నందుకు. అసలు విషయం దాచిపెట్టి నిందారోపణలకు దిగుతున్నారు. ఇదేనా మీ నిజాయితీ? సిపిఐ(యం) ఏనాడూ వైసిపితో సీట్లు సర్దుబాటుకోసం తహతహలాడలేదు. కనీసం ఆలోచించనూ కూడా లేదు. వైసిపికి వ్యతిరేకంగా టిడిపితో కలవనందుకే ఆర్‌కె గారికి బాధగా ఉంది. సిపిఐ(యం) ఇద్దరితోనూ కలవలేదు. కారణం బిజెపితో టిడిపికున్న స్నేహం. అది రాజకీయ విధానంపై ఆధారపడిన నిర్ణయం. టిడిపి బిజెపితో సర్దుబాటు చేసుకున్నందున సిపిఐ, కాంగ్రెస్ సిపిఐ(యం)తో సర్దుబాటుకు ముందుకొచ్చింది. ఇండియా బ్లాకు పార్టీలతో సర్దుబాటు చేసుకోవాలని సిపిఐ(యం) మొదటి నుండి ప్రయత్నించింది. సిపిఐ, సిపిఐ(యం) ఉమ్మడి అవగాహనతో పోవడం ఆర్‌కె గారికి ఇష్టం లేదని అర్థమవుతున్నది. ఈ వాస్తవాన్ని దాచిపెట్టి సిపిఐ(యం)ను నిందించడం తగునా రాధాకృష్ణగారు?

విరిగిన పట్టాకు మరమ్మతులు చేస్తున్న రైల్వే సిబ్బంది

విరిగిన రైలు పట్టా..

- హౌరా ఎక్స్‌ప్రెస్‌కు తప్పిన పెనుప్రమాదం

ప్రజాశక్తి- గూడూరు టౌన్:
తిరుపతి జిల్లా గూడూరు రైల్వేజంక్షన్ పరిధిలో హౌరా ఎక్స్‌ప్రెస్ రైలుకు పెను ప్రమాదం తప్పింది. గూడూరు అడవయ్య కాలనీ ప్రాంతంలో రైలు పట్టాలు విరిగి ఉండడం గమనించిన సునీల్ అనే స్థానికుడు రెడ్ క్లాత్‌ను కట్టి హౌరా ఎక్స్‌ప్రెస్ లోకో పైలట్‌ను అప్రమత్తం చేశారు. దీంతో పెనుప్రమాదం తప్పింది. ఆదివారం ఉదయం ఏడు గంటల ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకుంది. దీంతో సుమారు అరగంట పాటు రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. తిరుపతి వైపుగా వెళ్లే పలు రైళ్లు కొంత సమయం ఆలస్యంగా నడిచాయి. సునీల్ సమయస్ఫూర్తిగా వ్యవహరించి లోకో పైలట్‌ను అప్రమత్తం చేయడంతో హౌరా నుండి బెంగళూరు వెళ్లే 12863 హౌరా ఎక్స్‌ప్రెస్ రైలుకు పెనుప్రమాదం తప్పింది. దీంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. విరిగిన రైలు పట్టాలకు రైల్వే సిబ్బంది మరమ్మతులు చేయడంతో రైళ్ల రాకపోకలు కొనసాగాయి.

తెలంగాణలో చేనేత రుణాలు మాఫీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
చేనేత కార్మికులకు లక్ష రూపాయలలోపు ఉన్న రుణాలను మాఫీ చేస్తూ తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందుకోసం రూ. 33 కోట్లను మంజూరు చేసింది. ఈ సందర్భంగా ఆ రాష్ట్ర జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో చిన్నచూపునకు గురైన చేనేత రంగాన్ని సంవత్సరం కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం తిరిగి గాడిలో పెట్టేందుకు అనేక విధానపరమైన నిర్ణయాలు తీసుకుందని తెలిపారు. నేతన్నలకు నిరంతర ఉపాధి కలగడమే కాకుండా, వారి జీవనోపాధి మెరుగుపడడానికి, చేనేత పరిశ్రమ అభివృద్ధికి కషి చేస్తున్నామన్నారు. ఈ రంగంలో వస్తున్న నూతన టెక్నాలజీ, స్కిల్స్‌ను ఎప్పటికప్పుడు అప్‌గ్రేడ్ చేసుకునే విధంగా కొండ లక్ష్మణ బాపూజీ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్‌లూమ్ టెక్నాలజీ (ఐఐహెచ్‌టి)ని స్థాపించుకొన్నామన్నారు. ఇందులో ప్రతి సంవత్సరం 60 మంది విద్యార్థులకు మూడు సంవత్సరాల డిప్లొమా కోర్సు (డిహెచ్‌టిటి) అందిస్తున్నట్లు తెలిపారు.

పవర్‌లూమ్ ఆసామీల దీర్ఘకాలిక డిమాండ్‌ను పరిష్కరించేందుకు వేములవాడలో ప్రభుత్వం యార్న్ డిపో స్థాపించిందని చెప్పారు. చేనేత అభయహస్త పథకం అమలు చేయడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. నేతన్న చేయూత పథకం ద్వారా రూ.290.09 కోట్లు విడుదల చేసి, 36,133 మంది చేనేత కార్మికులకు లబ్ధి చేకూర్చామని, రూ.494.48 కోట్లు విడుదల చేసి, చేనేత సహకార సంఘాలు, ఎస్ఎస్ఐ, మాక్స్ సంస్థలకు పెండింగ్ చెల్లింపులు చెల్లించామని వివరించారు. 2017 ఏప్రిల్ ఒకటి నుంచి 2024 మార్చి 31 లోపు రూ. లక్ష లోపు రుణం తీసుకున్న వారు ఈ రుణమాఫీకి అర్హులని తెలిపారు. నేతన్న బీమా పథకం కింద రూ. పది లక్షల బీమా కల్పిస్తూ, వయోపరిమితిని తొలగించి, నేతన్న వృత్తిలో ఉన్నంతకాలం బీమా సౌకర్యం కల్పించేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. చేనేత సహకార సంఘాల నుండి స్టాకులను కొనుగోలు చేసి, చెల్లింపులకు నిధులు సమయానికి విడుదల చేయడం ద్వారా నేతన్నలకు నిరంతర ఉపాధి కల్పిస్తున్నామని మంత్రి తుమ్మల పేర్కొన్నారు.

పోర్టు ఆస్తుల ప్రైవేటీకరణ చర్యలు వేగవంతం

- గోల్డెన్ జూబ్లీ హాస్పిటల్‌కు రీ టెండర్
- 160 రోజులుగా పిపిపిపై పోరాడుతున్న ఉద్యోగులు, కార్మికులు
- పట్టించుకోని విపిటి యాజమాన్యం

పోర్టు గోల్డెన్ జూబ్లీ హాస్పిటల్

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో
విశాఖపట్నం పోర్టు అథారిటీ (విపిటి) యాజమాన్యం పోర్టు ఆస్తులను ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లో పెట్టే చర్యలను వేగవంతం చేసింది. ఇప్పటికే విశాఖ నగరంలోని శాలిగ్రాంపురంలోగల రూ.450 కోట్ల విలువైన 17 ఎకరాల పోర్టు భూములను 30 ఏళ్ల పాటు రహేజా ఇనార్బిట్ మాల్‌కు కేవలం రూ.125 కోట్లకే కట్టబెట్టింది. పోర్టు కల్యాణ మండపం, ఇండోర్, అవుట్ డోర్ స్టేడియాలను ప్రైవేటు వ్యక్తులకు లీజుకిచ్చేసింది. తాజాగా ఈ నెల మూడున పోర్టుకు చెందిన నగరం నడిబొడ్డునగల ఎకరన్నర స్థలంలో ఉన్న గోల్డెన్ జూబ్లీ హాస్పిటల్‌కు రీ టెండర్లను పిలిచింది. దీంతో, ఉద్యోగులు, కార్మికుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. వాస్తవానికి కొద్ది నెలల క్రితమే ఈ ఆస్పత్రిని పిపిపికి కట్టబెట్టాలని పోర్టు యాజమాన్యం చూసింది. దీన్ని వ్యతిరేకిస్తూ 160 రోజులుగా పోర్టు ఉద్యోగులు, రిటైర్డు ఉద్యోగులు, అధికారులు, కార్మికులు పోరాడుతున్నారు. రిలే నిరాహార దీక్షలు కొనసాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ టెండర్ కొనసాగింపును తాత్కాలికంగా నిలుపుదల చేసినట్లు రెండు నెలల క్రితం పోర్టు అధికారుల బోర్డు సమావేశంలో ప్రకటించారు. పిపిపి టెండర్‌ను పూర్తిగా రద్దు చేయాలని పోరాటం కొనసాగుతున్న క్రమంలో కొద్ది రోజులు నిశ్శబ్దంగా ఉన్న పోర్టు ఉన్నతాధికారులు తాజాగా రీ టెండరు పిలవడంతో కార్మికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 1933లో ప్రభుత్వ రంగంలో ఈ ఓడ రేవు ఏర్పడింది. 5,700 ఎకరాలు భూములు ఉండేవి. తాజాగా భూములన్నిటినీ ప్రైవేట్‌వారి చేతుల్లో పెట్టాలన్న కేంద్ర ప్రభుత్వ విధానాన్ని పోర్టు ఉన్నతాధికారులు అమలు చేస్తూ వస్తున్నారు.

ఎంతో విశిష్టం...

ప్రస్తుతం ఎకరన్నర స్థలంలో పోర్టు గోల్డెన్ జూబ్లీ హాస్పిటల్ 80 పడకలతో ఉంది. దీని చుట్టూ మరో నాలుగు ఎకరాల వరకూ పోర్టు భూములు ఉన్నాయి. 150 పడకలకు విస్తరించాలనేది లక్ష్యం. తాజాగా రూ.261 కోట్లకు పిపిపిలో ఇచ్చేందుకు రీ టెండర్‌ను పోర్టు అథారిటీ అధికారులు పిలిచారు. ఆస్పత్రిని పోర్టు స్వయంగా నిర్వహించాలని, లేనిపక్షంలో 40 వేల మంది ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు నష్టం జరుగుతుందని పోర్టు కార్మిక సంఘాల నాయకులు అంటున్నారు. ప్రస్తుతం 80 పడకలతో సమర్థవంతంగానే పోర్టు అండ్ డాక్ అధికారులకు, ఉద్యోగులకు, రిటైర్డ్ ఉద్యోగులకు, పూల్ కళాసీలకు, కార్గో హ్యాండ్లింగ్ డివిజన్ కార్మికులకు, సిఐఎస్ఎఫ్ సిబ్బందికి ఈ ఆస్పత్రిలో సేవలందుతున్నాయి. మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిని నిర్మిస్తామంటూ పోర్టు యాజమాన్యం దీన్ని ప్రైవేట్ చేతుల్లోకి పెట్టే విధానంతో కదులుతోంది. పోర్టు ఆస్పత్రి స్థలం విలువ బహిరంగ మార్కెట్లో వెయ్యి కోట్ల రూపాయల పైమాటే. పోర్టు ఏటా సరుకు రవాణా ద్వారా రూ.500 కోట్ల ఆదాయం ఆర్జిస్తోంది. ఈ ఆస్పత్రిని నిర్వహించే ఆర్థిక సామర్థ్యం పోర్టుకు ఉన్నా పిపిపికి కట్టబెట్టాలని చూడడం పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

అధికారులు ఏమంటున్నారంటే...

పిపిపికి ఆస్పత్రిని ఇచ్చినా నియంత్రణ పోర్టుదే ఉంటుందని విపిటి మెటీరియల్స్ మేనేజర్ రామ్‌ప్రసాద్ తెలిపారు. 300 పడకలకు విస్తరించేందుకు డిజైన్ బిల్ట్ ఫైనాన్స్ ఆపరేట్ అండ్ ట్రాన్స్‌ఫర్ (డిబిఎఫ్ఒటి) విధానంలో ఈ ఆస్పత్రిని ఇస్తున్నామని చెప్పారు. ఈ పిపిపి ప్రాజెక్టు మానటరింగ్ కోసం ఇద్దరు కార్మిక సంఘాల నాయకులు ఉంటారని తెలిపారు. ఏటా రూ.18 కోట్లు రిఫరల్ ఖర్చులను బయట కార్పొరేట్ ఆస్పత్రులకు చెల్లిస్తున్నామని చెప్పారు. పిపిపిలో ఈ ఆస్పత్రి పూర్తయితే ఇవే సౌకర్యాలు పోర్టు ఆస్పత్రిలో ఉద్యోగులు పొందవచ్చని తెలిపారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు నాగేశ్వరరావు

ఆప్కాస్ రద్దుకు వ్యతిరేకంగా 19న చలో విజయవాడ

- వాల్‌పోస్టర్ ఆవిష్కరించిన సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు నాగేశ్వరరావు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో:
టిడిపి కూటమి ప్రభుత్వం ఆప్కాస్ రద్దు చేస్తానన్న అనాలోచిత నిర్ణయాన్ని తక్షణమే విరమించుకోవాలని కోరుతూ ఈ నెల 19న చలో విజయవాడ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి తిరుపతి నగరంలోని సిఐటియు జిల్లా కార్యాలయంలో చలో విజయవాడ వాల్‌పోస్టర్‌ను ఆదివారం కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ జెఎసి చైర్మన్, సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి నాగేశ్వరరావు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఆప్కాస్ రద్దు చేయడం వల్ల లక్షా 20 వేల మందికి నష్టం జరుగుతుందన్నారు. జిఒ నెంబర్ 2 సవరించి అందరికీ మినిమం టైమ్ స్కేలు వర్తింపజేయాలని, ఇప్పటివరకు పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను కాంట్రాక్టు పద్ధతిలోకి మార్చి ఆయా డిపార్ట్‌మెంట్ల ద్వారా నేరుగా జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమానికి ఆప్కాస్, కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు తరలిరావాలని జెఎసి రాష్ట్ర అధ్యక్షులు జి చిన్నబాబు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా జెఎసి చైర్మన్ నాగ వెంకటేష్, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎస్ జయ చంద్ర, ఆప్కాస్ యూనియన్ నాయకులు ప్రభాకర్ రెడ్డి, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

జనసేన నుంచి తమ్మయ్య బాబు సస్పెన్షన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో
ప్రత్తిపాడు నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌ఛార్జి వరుపుల తమ్మయ్య బాబును పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు ఆ పార్టీ పేర్కొంది. ఈ మేరకు పార్టీ కాన్ఫ్లిక్ట్ హెడ్ వేములపాటి అజయ్‌కుమార్ ఆదివారం ప్రకటన విడుదల చేశారు. ప్రత్తిపాడు సిహెచ్‌సి ఘటనపై అందిన నివేదికలు, వివరణలు పరిగణలోకి తీసుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. విధి నిర్వహణలో ఉన్న ప్రత్తిపాడు సిహెచ్‌సి వైద్యులు శ్వేత పట్ల అనుచితంగా ప్రవర్తించి, దుర్భాషలాడిన ఘటన దురదృష్టకరమని పేర్కొన్నారు.

మాట్లాడుతున్న మంత్రి సవిత

మహిళలు ధైర్యంగా మెలగాలి

- మహిళా దినోత్సవంలో మంత్రి సవిత

ప్రజాశక్తి - మంగళగిరి (గుంటూరు జిల్లా)
ధైర్యంగా ఉంటేనే మహిళలు సమాజంలో ముందుకు రాగలుగుతారని రాష్ట్ర బిసి సంక్షేమశాఖ మంత్రి ఎస్.సవిత అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు గుంటూరు జిల్లా మంగళగిరి పట్టణంలో ఆదివారం నిర్వహించారు. బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు పారేపల్లి మహేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రి సవిత ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మహిళలకు అన్ని విభాగాల్లో సమానత్వాన్ని ఎన్‌టిఆర్ తీసుకువచ్చారని, ఆస్తిలో హక్కు, స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రాధాన్యం ఇచ్చారని తెలిపారు. ఆ కోవలోనే మహిళలను అన్ని రంగాల్లో ముందుకు తెచ్చేందుకు డ్వాక్రా సంఘాలు, వెలుగు లాంటి ప్రాజెక్టులను సిఎం చంద్రబాబు 30 ఏళ్ల క్రితమే ప్రవేశపెట్టారన్నారు. బిసి సంక్షేమ సంఘం మహిళా అధ్యక్షులుగా ఎస్.జయశ్రీ ప్రమాణ స్వీకారం చేసి మాట్లాడుతూ మహిళలు నేటికీ హత్యలు, దాడులు, అత్యాచారాలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలు అన్ని రంగాల్లో అభ్యున్నతి సాధించాలంటే విద్యావంతులు కావాలన్నారు. రాజకీయంగా, ఆర్థికంగా ఎదగడానికి విద్య తప్పనిసరని తెలిపారు. ఈ సందర్భంగా ఇంటర్నేషనల్ పవర్ లిఫ్టర్లు బి.చంద్రిక, జి.సాయిరేవతి, ఎస్.కె.సాదియా అల్మాస్, నాగం జ్ఞానదివ్య, డాక్టర్ సుస్మిత, డాక్టర్ పి.గిరిజ, ఎర్రబాలెం జడ్‌పి పాఠశాల హెచ్‌ఎం సుష్మను సత్కరించారు. స్థానిక టిడ్కో గృహాల వద్ద నిర్వహించిన ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఐదుగురికి సీమంతం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు, గౌరవాధ్యక్షులు, చేనేత ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ వావిలాల సరళాదేవి తదితరులు పాల్గొన్నారు.

సంక్షోభంలో గీత వృత్తి

- ఎపి కల్లు గీత కార్మిక సంఘం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో
రాష్ట్రంలో గీత కార్మికుల పరిస్థితి పెనం మీద నుంచి పొయ్యిలో పడినట్లుగా ఉందని ఎపి గీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుత్తిగ నరసింహమూర్తి అన్నారు. రాష్ట్ర విభజన అనంతరం ప్రభుత్వమే కల్లు గీత వృత్తిని సంక్షోభంలోకి నెట్టేసిందని చెప్పారు. విజయవాడలోని ఎంబివికెలో ఎపి కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా కల్లు గీత వృత్తిలో మార్పులు తెచ్చి అభివృద్ధి చేసి ప్రోత్సహించి కేరళ, తెలంగాణ రాష్ట్రాల తరహాలో లక్షలాది గీత కుటుంబాలకు ఉపాధి పెంచి ఆదుకోవాలని కోరారు. ఎన్నో ఔషధ గుణాలు ఉన్న సహజ సిద్ధమైన తాటికల్లును రసాయనలతో తయారయ్యే బీరు, బ్రాందీ, విస్కీలతో పోల్చవద్దన్నారు. గోవా, యానం తదితర ప్రాంతాల నుంచి రాష్ట్రానికి అక్రమ మద్యం వరదలా వస్తుందన్నారు. ప్రభుత్వం మారింది... గీత కార్మికుల తలరాతలు మారుతాయని ఎదురు చూసిన లక్షలాది గీత కార్మికుల కుటుంబాలకు కూటమి ప్రభుత్వం చుక్కలు చూపిస్తుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా విచ్చలవిడిగా బెల్ట్ షాపులు నడుస్తున్నాయని, ఇవి కాకుండా మోటారు సైకిళ్లు, వ్యాన్‌లలో మొబైల్ షాపులు విక్రయాలు సాగిస్తున్నాయని తెలిపారు. దీంతో కల్లు అమ్మకాలు లేక గీత కార్మికుల కుటుంబాలు సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నాయని చెప్పారు. ప్రమాదవశాత్తు తాటి చెట్టుపై నుంచి పడి చనిపోతున్న గీత కార్మికులకు ఎక్స్‌గ్రేషియా రూ.10 లక్షలు ఇవ్వాలని, ప్రభుత్వానికి గీత కార్మికులకు మధ్య వారధిలా పని చేసే గీత కార్మిక ఆర్థిక సంస్థలకు రూ.వెయ్యి కోట్లు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. వృత్తి సంఘాల రాష్ట్ర కన్వీనర్ ఎం.భాస్కరయ్య పలు అంశాలపై ప్రసంగించారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు కమన మునిస్వామి, బొక్కా చంటి, ఎమినేని స్టాలిన్, యర్రా దేవుడు, కడలి పాండు, బత్తెన నాగేశ్వరరావు. జుత్తిగ సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఒక్క చిత్రంలో వెయ్యి పదాల భావం

- రాజమహేంద్రవరం అర్బన్ డిఐ దిలీప్ కుమార్
- ఉత్సాహంగా చిత్రలేఖనం పోటీలు

గీచిన చిత్రాలను చూపిస్తున్న పోటీల్లో పాల్గొన్న చిన్నారులు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి
ఒక చిత్రంలో వెయ్యి పదాల భావం ఉంటుందని రాజమహేంద్రవరం అర్బన్ డిఐ (డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్) డి.దిలీప్‌కుమార్ అన్నారు. గోదావరి బాలోత్సవం, 'మనం' ఆర్ట్స్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం దానవాయిపేట మున్సిపల్ హైస్కూల్లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం, దామెర్ల రామారావు 128వ జయంతి సందర్భంగా చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్, సూపర్ సీనియర్స్ విభాగాల్లో పోటీలు జరిగాయి. జిల్లా నలుమూలల నుంచి సుమారు వేయి మంది వరకూ ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన ముగింపు సభకు గోదావరి బాలోత్సవం ఆర్గనైజింగ్ కార్యదర్శి టి.తులసి, మనం ఆర్ట్స్ అకాడమీ కార్యదర్శి నవీనకుమారి అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన డిఐ దిలీప్‌కుమార్ మాట్లాడుతూ చిన్నారుల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకు ఇలాంటి పోటీలు దోహదం చేస్తాయన్నారు. ఇటీవల సెల్ ఫోన్ వినియోగం పెరిగిందని, చిన్నారులు సైతం దీనికి బానిస అవుతున్నారని తెలిపారు. విజ్ఞానాన్ని పెంపొందించుకునేందుకు నూతన సాంకేతికతను వినియోగించుకోవాలని, విద్యార్థులు పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలని సూచించారు. దామెర్ల రామారావు మనవరాలు దామెర్ల ప్రేమ మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో కమ్యూనికేషన్ స్కిల్స్‌ను పెంచుకోవాలన్నారు. బొమ్మల ద్వారా కమ్యూనికేషన్స్ వ్యక్తపర్చవచ్చని తెలిపారు. మనం ఆర్ట్స్ అకాడమి వ్యవస్థాపక అధ్యక్షులు వినోద్ మాట్లాడుతూ.. పరీక్షలు ఉన్నప్పటికీ విద్యార్థులను ప్రోత్సహించిన తల్లిదండ్రులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన బుర్రకథ, ఆంధ్ర నాట్యం, కోలాటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ప్రదర్శనలు ఇచ్చిన చిన్నారులకు డిఐ డిలీప్ కుమార్, దామెర్ల ప్రేమ జ్ఞాపికలను అందజేశారు. బాలోత్సవం ఆర్గనైజింగ్ కార్యదర్శి తులసి మాట్లాడుతూ రెండేళ్లుగా బాలోత్సవం కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. వీటికి సహకారం అందించిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. అద్దంకి రాజయోనా, రాజకుమార్, శ్రీనివాస్, కిషోర్, గాయత్రి, లక్ష్మి, ప్రియాంక జడ్జిలుగా వ్యవహరించారు. బాలోత్సవం నాయకులు ఆనంద్, కుసుమ, ఎం.నాగేశ్వరావు, సురేష్, భాస్కర్, రాజేష్, మహేష్, పవన్ పాల్గొన్నారు.

మహాసంప్రోక్షణ కార్యక్రమంలో పాల్గొన్న టిటిడి చైర్మన్, అర్చకులు

ఒంటిమిట్టలో ఘనంగా మహాసంప్రోక్షణ

ప్రజాశక్తి-ఒంటిమిట్ట (వైఎస్ఆర్ జిల్లా)
ఒంటిమిట్ట శ్రీకోదండరామస్వామి ఆలయంలో ఆదివారం ఉదయం మహాసంప్రోక్షణ నిర్వహించారు. అనంతరం యాత్రికులకు స్వామివారి దర్శనానికి అనుమతించారు. ఈ కార్యక్రమంలో టిటిడి చైర్మన్ బి.ఆర్.నాయుడు దంపతులు, జెఇఒ వి.వీరబ్రహ్మం, ఆలయ అర్చకులు, సిపిఆర్ఒ డాక్టర్ టి.రవి, డిప్యూటీ ఇఒలు నటేష్ బాబు, గోవింద రాజన్, సెల్వం, ప్రశాంతి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

ఒంటిమిట్ట శ్రీకోదండరామ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల పోస్టర్లు, ఆలయ చరిత్ర తెలియజేసే కరపత్రాలను జెఇఒ వి.వీరబ్రహ్మంతో కలిసి టిటిడి చైర్మన్ బి.ఆర్.నాయుడు ఆదివారం ఆలయం ఎదుట ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టిటిడి చైర్మన్ మాట్లాడుతూ శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏప్రిల్ 6న శ్రీరామనవమి, పోతన జయంతి, ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయని తెలిపారు. ఏప్రిల్ 9న హనుమంత వాహనం, ఏప్రిల్ 10న గరుడవాహనం, ఏప్రిల్ 11న శ్రీ సీతారాముల కల్యాణం, ఏప్రిల్ 12న రథోత్సవం జరుగనున్నాయని వివరించారు. అనంతరం శ్రీ విశ్వావసు నామ సంవత్సర పంచాంగాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టిటిడి ఆస్థాన సిద్ధాంతి తంగిరాల వేంకటపూర్ణ ప్రసాద్ పాల్గొన్నారు.

ఈతకు వెళ్లి ఇద్దరు బాలురు మృతి

ప్రజాశక్తి-హిందూపురం (అనంతపురం జిల్లా)
అనంతపురం జిల్లా హిందూపురంలో విషాదం చోటుచేసుకుంది. ఈతకు వెళ్లి ఇద్దరు బాలురు మృతి చెందిన సంఘటన ఆదివారం ఉదయం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం పాఠశాలకు సెలవు కావడంతో రిహాన్ (14), అయాన్ (12), జహీర్ కలిసి ఆటోనగర్ సమీపంలోని సడ్లపల్లి చెరువులో ఈతకు వెళ్లారు. కొద్ది సేపటికే ప్రమాదవశాత్తు నీటి గుంతలో ఇరుక్కుపోయారు. జహీర్ ఒడ్డుకు చేరుకుని స్నేహితులను పైకి లాగేందుకు ప్రయత్నించినా సాధ్యం కాలేదు. దీంతో పెద్దగా కేకలు వేయడంతో సమీపంలో ఉన్న వారు చెరువు వద్దకు చేరుకుని బురదలో చిక్కుకున్న రిహాన్, అయాన్‌లను బయటకు తీసి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆ ఇద్దరూ మృతి చెందినట్లు ప్రకటించారు. టూటౌన్ సిఐ అబ్దుల్ కరీం సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన చెప్పారు.

అమ్మకపు ప్రకటన

కరుటూరి సెరామిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ (లిక్విడేషన్‌లో)
రిజిస్టర్డు ఆఫీసు: 23-16-44, జైగోపాల్ భవన్ హరిపురం, రాజమండ్రి, తూర్పు గోదావరి, ఆంధ్రప్రదేశ్, పిన్533105 ఇండియా.
లిక్విడేటర్ చిరునామా: ఇంటి నెం.1-1-380/38, అశోక్ నగర్ ఎక్స్‌టెన్షన్, హైదరాబాద్ -500020.
Contact: + 91 9849995678; E-mail: rp.kruturiceramics@gmail.com , bnagabhushan@yahoo.com
ఇన్సాల్వెన్సీ మరియు బ్యాంక్రప్టసీ కోడ్, 2016 క్రింద ఇ-వేలం

దిగువ పట్టికలో పేర్కొన్న వివరాల ప్రకారం గౌరవ ఎన్‌సిఎల్‌టి, అమరావతి బెంచ్ నియమించిన లిక్విడేటర్ ద్వారా 08 జనవరి, 2025 నాటి ఈ-వేలం ప్రక్రియ ద్వారా అందించబడిన గోయింగ్ కన్సర్న్‌గా కార్పొరేట్ డెటార్ అయిన మెసర్స్ **కరుటూరి సెరామిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ (లిక్విడేషన్‌లో)** ("కార్పొరేట్ డెటార్") అమ్మకానికి సంబంధించి ఆసక్తి వ్యక్తీకరణ ఆహ్వానం కోసం ప్రజలకు ఇందుమూలంగా నోటీసు ఇవ్వబడింది.
ఇన్సాల్వెన్సీ అండ్ బ్యాంక్రప్టసీ బోర్డ్ ఆఫ్ ఇండియా (లిక్విడేషన్ ప్రాసెస్) రెగ్యులేషన్స్, 2016 లోని రెగ్యులేషన్ 32 (ఇ) ప్రకారం గోయింగ్ కన్సర్న్‌గా కార్పొరేట్ డెటార్‌ను "ఎక్కడ ఎలా ఉన్నది మరియు అక్కడ అలాగే మరియు రికోర్స్ లేకుండా" విక్రయించాలని ప్రతిపాదించబడింది మరియు అందువల్ల, డిస్పోజల్ కోసం పేర్కొన్న ప్రతిపాదన ఎటువంటి వారంటీలు మరియు నష్టపరిహారాలు లేకుండా ఉంటుంది. బిడ్డింగ్ ఆన్‌లైన్ ఇ-వేలం సర్వీస్ ప్రొవైడర్ ద్వారా, ఇ బికెఆర్ఎవై ద్వారా వెబ్‌సైట్/ఇ-వేలం ప్లాట్‌ఫామ్ https://baanknet.com/ ద్వారా జరుగుతుంది మరియు బిడ్డర్లు ఈ-మెయిల్ support.baanknet@psballiance.com ద్వారా సర్వీస్ ప్రొవైడర్‌ను సంప్రదించవచ్చు.

1.	కార్పొరేట్ డెటార్ పేరు	కరుటూరి సెరామిక్స్ ప్రైవేట్ లిమిటెడ్
2.	కార్పొరేట్ డెటార్ ఇన్‌కార్పొరేషన్ తేది	18.06.2010
3.	కార్పొరేట్ డెటార్ క్రింద ఇన్‌కార్పొరేటెడ్/ నమోదిత అథారిటి	ఆర్ఓసి, విజయవాడ
4.	కార్పొరేట్ డెటార్ యొక్క కార్పొరేట్ గుర్తింపు నెంబరు	U26933AP2010PTC117739
5.	కార్పొరేట్ డెటార్ యొక్క రిజిస్టర్డ్ కార్యాలయం చిరునామా	23-16-44, జైగోపాల్ భవన్ హరిపురం, రాజమండ్రి, తూర్పు గోదావరి, ఆంధ్రప్రదేశ్, పిన్ 533105
6.	కార్పొరేట్ డెటార్ యొక్క లిక్విడేషన్ ప్రారంభ తేదీ	08.01.2025
7.	కాబోయే బిడ్డర్ ద్వారా అవసరమైన ఫారమ్‌లు, అఫిడవిట్‌లు, డిక్లరేషన్ మొదలైన వాటి సమర్పణ	27.03.2025న లేదా అంతకు ముందు ఇ-వేలం ప్లాట్‌ఫారమ్ https://baanknet.com/లో నమోదు చేసుకోవడం ద్వారా
8.	సైట్ సందర్శన & తనిఖీచేయు వ్యవధి	31.03.2025 నుండి 05.04.2025 వరకు
9.	ఈఎండి మొత్తం	రూ.2,48,91,250/- అనగా, రిజర్వ్ ధరలో 10% (పది శాతం)
10	ఈఎండి సమర్పణ చివరి తేదీ	09.04.2025 సా.17.00 గంటల వరకు (ఐఎస్టీ)
11	వేలం తేదీ మరియు సమయం	12.04.2023 మ.3:00 గం.ల నుండి సా5:00 గం.ల మధ్య అపరిమితంగా "5 నిమిషాలు" పొడిగింపు ఉంటుంది, అనగా వేలం ముగిసే ముందు చివరి 5 నిమిషాలలోపు బిడ్ వేస్తే ఇ-వేలం ముగింపు సమయం 5 నిమిషాల చొప్పున పొడిగించబడుతుంది.
12	రిజర్వ్ ధర (రూ.)	రూ. 24,89,12,500/- (రూజ ఇరవై నాలుగు కోట్ల ఎనభై తొమ్మిది లక్షల పన్నెండు వేల ఐదు వందలు మాత్రమే)
13	బిడ్ ఇంక్రిమెంటల్ విలువ (రూ.)	రూ. 5,00,000/- (రూ. ఐదు లక్షలు మాత్రమే)
14	అర్హత ప్రమాణాలు & ఇతర వివరాలు	వెబ్‌సైట్: https://baanknet.com/ లో అప్‌లోడ్ చేసిన నియమ& నిబంధనల పత్రం ప్రకారం ఆసక్తిగల బిడ్డర్లు కంపెనీ పేరు కరుటూరి సెరామిక్స్ ప్రైవేట్ లిమిటెడ్‌ను ఉపయోగించి వెబ్‌సైట్‌లో పేర్కొన్న కంపెనీ కోసం వెతకాలి.

1) ఆసక్తిగల బిడ్డర్లు వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసిన ప్రక్రియతో సహా సంబంధిత ప్రాసెస్ డాక్యుమెంట్ నిబంధనలు మరియు షరతులను చదివి అంగీకరించిన తర్వాత తమ ఆసక్తి వ్యక్తీకరణను సమర్పించాలని మరియు పాల్గొనాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం, దయచేసి దిగువ సంతకందారు వారిని సంప్రదించండి.
2) లిక్విడేటర్/ఎస్‌సిసి వారికి ఏదేని సమయంలో ఇ-వేలం యొక్క ఏవైనా నియమ & నిబంధనలను ఆమోదించచు లేదా రద్దుచేయు లేదా పొడిగించడానికి లేదా సవరించడానికి హక్కు ఉంది. లిక్విడేటర్/ఎస్‌సిసి ఎటువంటి కారణాలు చెప్పకుండానే ఏవైనా బిడ్‌లను తిరస్కరించే హక్కు ఉంది.

నాగ భూషణ్ భగవతి
లిక్విడేటర్
ప్రదేశం: హైదరాబాద్
తేదీ: 10.03.2025
IBBI/IPA-001/IP-P00032/2016-17/10085

HDFC BANK
We understand your world

నమోదిత కార్యాలయం : హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ హౌస్, సేనాపతి బాపట్ మార్గ్, లోవర్ పారెల్ (పశ్చిమం), ముంబాయి-400013 మరియు హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్, 1వ అంతస్తు, I-థింక్ టెక్నో క్యాంపస్, కంజూర్ మార్గ్ (తూర్పు), ముంబాయి-400042 వద్ద ఉన్న రిటైల్ పోర్ట్ పోలియో నిర్వహణగా దాని కార్యాలయం ఒకటి.

హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్‌కి తాకట్టు పెట్టిన సెక్యూరిటీల విక్రయానికి సంబంధించిన విక్రయ సమాచారం మరియు బహిరంగ నోటీసు.

హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్ ("బ్యాంకు") యొక్క దిగువ పేర్కొన్న రుణగ్రహీతలు బ్యాంకుకు తాకట్టు పెట్టిన సెక్యూరిటీల విక్రయానికి సంబంధించి, రుణం/ఓవర్‌డ్రాఫ్ట్ స్వభావంలో క్రెడిట్ సౌకర్యాలను పొందడం కోసం దీని ద్వారా తెలియజేయబడుతుంది.
అంగీకరించిన లోన్ నిబంధనల ప్రకారం బకాయిలను తిరిగి చెల్లించడంలో రుణగ్రహీతల నిరంతర డీఫాల్ట్ కారణంగా, దిగువ రుణ ఖాతాలు అపరాధ స్థితిలో ఉన్నాయని బ్యాంకు ఈ రుణగ్రహీతలకు అనేక నోటీసులు జారీ చేసింది, దిగువ పేర్కొన్న తేదీలో తుది విక్రయ నోటీసుతో సహా, బ్యాంక్ ప్లెడ్జ్‌ను చేయించిన మరియు దిగువ ఖాతాలలో మొత్తం బకాయిలను తిరిగి చెల్లించడానికి రుణగ్రహీతకు 7 రోజుల సమయం ఇచ్చింది. విఫలమైతే బ్యాంక్ ఈ విషయంలో తదుపరి నోటీసు జారీ చేయకుండా తాకట్టు పెట్టిన సెక్యూరిటీలను విక్రయించడానికి స్వేచ్ఛ ఉంటుంది. రుణగ్రహీతలు నిర్లక్ష్యానికి గురయ్యారు మరియు సరియైన చెల్లింపులు చేయడంలో విఫలమయ్యారు, కాబట్టి రుణ ఒప్పందం ప్రకారం బ్యాంకు తన హక్కులను వినియోగించుకోవడంలో ప్లెడ్జిగా రుణగ్రహీతల నుండి బ్యాంకుకు చెల్లించాల్సిన బకాయిలను రికవరీ చేయడానికి **17 మార్చి, 2025**న లేదా ఆ తర్వాత సెక్యూరిటీలను విక్రయించాలని/డిస్పోస్ చేయాలని నిర్ణయించింది. ఇండియన్ కాంట్రాక్ట్ యాక్ట్ 1872 యొక్క సెక్షన్ 176 మొత్తంలో అమ్మకం నోటీసుగా పరిగణించమని రుణగ్రహీలకు ఇక్కడ తెలియజేయడమైనది. రుణగ్రహీతలు మార్జిన్ అవసరంలో మరింత లోపాన్ని సృష్టించడానికి స్టాక్ మార్కెట్‌లో అస్థిరత కారణంగా ఎప్పుడైనా తాకట్టు పెట్టిన సెక్యూరిటీల విలువ మరింత పడిపోతే, ఈ విషయంలో తదుపరి నోటీసు లేకుండా బ్యాంకు తన అభీష్టానుసారం తాకట్టు పెట్టిన సెక్యూరిటీని క్యాలెండర్ రోజు ఒకటి (1) లోపు విక్రయిస్తుంది. రుణగ్రహీతలు ఏదైనా మిగిలిన బకాయి మొత్తాన్ని తిరిగి చెల్లించడానికి, తాకట్టు పెట్టిన సెక్యూరిటీలను విక్రయించడం ద్వారా వచ్చిన మొత్తాన్ని సర్దుబాటు చేసిన తర్వాత బ్యాంకుకు బాధ్యత వహిస్తారు.

క్ర. సం.	లోన్ అకౌంట్ నెం.	రుణగ్రహీతల పేరు	06 మార్చి, 2025 నాటికి బకాయి మొత్తం (భారత రూపాయలలో)	విక్రయ నోటీసు తేదీ
1	XXXX0405	వంకాయలపాటి మృణాలిని	11,817.93	07-03-2025
2	XXXX2331	సంజయ్ గుప్తా	4,13,699.44	07-03-2025
3	XXXX6184	సి హరిబాబు	69,899.61	07-03-2025
4	XXXX7501	గోవిందనాథ్ చౌదరి	4,39,144.00	07-03-2025
5	XXXX9565	వెంకట సత్యనారాయణ రాజు కలిదిండి	33,289.53	07-03-2025
6	XXXX7351	దేవవరపు రంగ మోహన శేష సాయి	30,514.26	07-03-2025
7	XXXX4704	సాయి కిరణ్ ఈశపతి	20,17,013.16	07-03-2025
8	XXXX6241	మారెళ్ల సౌజన్య	9,96,787.00	07-03-2025
9	XXXX7946	చిరంజి లాల్ అగర్వాల్	20,18,984.02	07-03-2025
10	XXXX1709	పఠాన్ ముర్తుజ ఖాన్	1,16,162.50	07-03-2025
11	XXXX7687	పసగడి కళావతి	6,58,637.64	07-03-2025
12	XXXX1981	జెట్టి కల్పన	2,58,792.21	07-03-2025
13	XXXX7832	బి.కుముదా రాణి	1,05,783.76	07-03-2025
14	XXXX0538	సందీప్ కుమార్	53,435.00	07-03-2025
15	XXXX5267	దొంతు మహేష్	2,39,228.07	07-03-2025
16	XXXX3008	గొర్లి ఎల్ అరుణ కుమారి	3,01,282.82	07-03-2025
17	XXXX4141	లలిత కుర్ర	45,499.91	07-03-2025
18	XXXX7930	కె.నాగ కృష్ణ సత్య శ్రీనివాస్ ప్రసాద్	9,74,332.34	07-03-2025
19	XXXX3598	త్రినాథ్ సిగడం	9,66,806.00	07-03-2025
20	XXXX9495	ముదుండి బాలగంగాధర తిలక్	46,845.64	07-03-2025
21	XXXX3713	సుబ్రేష్ బాబు పి	67,869.18	07-03-2025
22	XXXX1981	బొమ్మిశెట్టి శివరామకృష్ణ	5,04,672.57	07-03-2025
23	XXXX1397	నితిన్ విజయ్ సత్వాని	8,46,604.29	07-03-2025
24	XXXX2880	ఉద్దగిరి వెంకటేశ్వరరావు	2,60,460.00	07-03-2025
25	XXXX9900	పి.సౌమ్య	5,54,234.08	07-03-2025
26	XXXX0823	వట్టివెళ్ల రంగబాబు	9,88,770.18	07-03-2025
27	XXXX7993	అలవాల బ్రంహారెడ్డి	81,958.00	07-03-2025
28	XXXX8216	నారాయణం కీర్తి ప్రియ	26,235.56	07-03-2025
29	XXXX2984	గునపల్లి వెంకట సత్యాదేవి	11,22,574.13	07-03-2025
30	XXXX5483	విజయ్ కుమార్ జమిలి	95,338.26	07-03-2025
31	XXXX9020	చోరగుడి కనకరాజ శేఖర్	2,84,130.27	07-03-2025
32	XXXX5479	మల్లేడి కనకలక్ష్మి	9,84,295.17	07-03-2025
33	XXXX4370	పుజారి తరుణ్	1,66,295.00	07-03-2025
34	XXXX3943	శేఖర్ గుండాల	2,51,578.52	07-03-2025
35	XXXX3224	తిరువాయిపాటి నరసింహారావు	45,784.00	07-03-2025
36	XXXX4768	పానుగోటి శ్రీజ	7,14,344.00	07-03-2025
37	XXXX0518	బల్లని పార్థ సారధి	1,67,503.30	07-03-2025
38	XXXX7099	నియోటియా అంకిత్	93,765.00	07-03-2025
39	XXXX7494	గోరకాటి ప్రసాదరెడ్డి	1,82,473.99	07-03-2025
40	XXXX9440	సరోజ కొత్త	3,65,382.82	07-03-2025
41	XXXX6862	అట్టలూరి శ్యామల	9,49,630.00	07-03-2025
42	XXXX9490	పద్మనాభుని హరి	47,599.82	07-03-2025
43	XXXX3134	రోక్కం రేణుక	9,58,731.36	07-03-2025
44	XXXX5710	జక్కా స్వాతి	8,13,741.82	07-03-2025
45	XXXX3395	కొర్రు నరేష్ కుమార్ రెడ్డి	8,87,284.82	07-03-2025
46	XXXX3155	గజులపల్లి బ్రంహయ్య ఆచారి	41,621.82	07-03-2025
47	XXXX8080	అంకం సుభాషిణి	9,99,712.82	07-03-2025
48	XXXX3573	సంతోష్ జన్రాపురియ	5,08,410.00	07-03-2025

తేది: 10.03.2025
ప్రదేశం: ఆంధ్రప్రదేశ్
సం/-
హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్



అక్షరం

ప్రజాశక్తి
www.prajasakti.com
facebook/prajasakti, twitter/prajasakti

ఒక అద్భుతమైన ప్రకృతి దృశ్యం
కన్నా మానవ నిర్మితమైన
కర్మాగారమే నన్ను అమితంగా
ఆకర్షిస్తుంది.
– మాగ్జిం గోర్కి



75 ఏళ్ళ మహాప్రస్థానం : ప్రచురణ – ప్రభావం

సందర్భం

తెలుగు జాతిపై, భాషా సాహిత్యాలపై చెరగని ముద్రవేసిన మహాప్రస్థానం కావ్యం ప్రచురణకూ ఇది 75వ వార్షికోత్సవ సందర్భం. మహాకవి శ్రీశ్రీ 115వ జయంతి సంవత్సరం కూడా. అప్పటికే పెద్దవాళ్ల అభినందనలు పొందుతూ, యువసాహిత్య కారుల జేబుల్లో కత్తిరించుకున్న కాగితాల్లోంచి వినిపిస్తున్న మహాప్రస్థాన గీతాలు పదేళ్ల వూహల, ఆలస్యాల తర్వాత 1950లో పుస్తకరూపం తీసుకున్నాయి.

'చూడు చూడు నీడలు పేదవాళ్ల వాడలు" అన్నా, "ఇంతేలే పేదల గుండెలు" అన్నా శ్రీశ్రీ కవితలను సానుభూతి కవితగా భావిస్తారు తప్ప స్వానుభవ కవితలనుకోరు. నిజానికి అది అచ్చమైన ఆయన జీవితానుభవం. ప్రపంచాన్ని శాసించగలిగిన కవితా స్రష్ట అయివుండి కూడా కోరి ప్రజా కవిత్వ మార్గాన్ని చేపట్టిన శ్రీశ్రీ తదుపరి జీవితంలో అనుభవించిన కష్టాల గురించి చాలా మందికి తెలుసు. కాని అంతకుముందు కూడా ఆయన జీవితంలో వెలుగు నీడలున్నాయి. 30వ దశకం ఆకలి దశకం అని, ఆ కాలంలోనే తన మహాప్రస్థాన గీతాలు వెలువడ్డాయని ఆయన చాలాసార్లు చెప్పారు. ".. 1930 నుంచి 1940 దాకా నేను చాలా అవస్థలు పడ్డాను. ఆ దశాబ్దంలోనే నా మహాప్రస్థానం గీతాలన్నీ (చాలామట్టుకు) రాశాను. అదో భయంకరమైన దశాబ్దం. దాన్ని హంగ్రీ థర్టీస్ అన్నారు చరిత్రకారులు."

ఈ ఆర్థిక సంక్షోభం రెండవ ప్రపంచ యుద్ధానికి కూడా దారి తీసింది. పరాయి పాలనలోని ఈ దేశం ఆ దుష్ప్రభావాన్ని మరింతగా మోయవలసి వచ్చింది. సామాన్యుల జీవితాలు సంక్షుభితమయ్యాయి. శ్రీశ్రీ తండ్రి రమణయ్య మాస్టారు వ్యసనాలు, ఇతర కారణాలతో ఆస్తిని పోగొట్టుకుని అప్పుల పాలయ్యాడు. శ్రీశ్రీ మద్రాసులో చదువు పూర్తి చేసే నాటికే కుటుంబ పరిస్థితి దిగజారుతున్నది. ఈ కారణం గానే తనకు లక్నో వెళ్లి ఎంఎ చదవాలని వున్నా మానుకున్నాడు. అప్పుడే ప్రాణాంతకమైన టైఫాయిడ్ బారిన పడ్డాడు. "భయంకరమైన జ్వరంతో వచ్చేప్రాణం పోయే ప్రాణంగా ఉంటుండగా మా ఇల్లు వేలం పాటలో అమ్మకమై పోయింది. అవి నా దరిద్రపు రోజులు. రెండేసి రోజులు తిండి లేకుండా బతికాను. ఆ పది సంవత్సరాల్లోనే మహాప్రస్థాన గీతాలు రాశాను.." అని శ్రీశ్రీ ఆ రోజుల గురించి రాసుకున్నారు.

సంఘర్షణాత్మకమైన నాటి దేశ కాల పరిస్థితులు కూడా ప్రజాకవి ప్రభావాన్ని ఆహ్వానిస్తున్నాయి. గురజాడ, కందుకూరి గతించేనాటికి తెలుగుదేశంలో పరిశ్రమలు అపుడపుడే తలెత్తుతున్నాయి. శ్రీశ్రీ కాలం నాటికి అవి బాగా ఊపందుకున్నాయి. ఆ యంత్ర యుగమే, పారిశ్రామిక వాతావరణమే తెలుగులో శ్రామికవర్గ మహాకవికి జన్మనిచ్చింది. విశాఖపట్టణంలో హార్బరు నిర్మాణం చురుకుగా సాగిపోతోంది. దూరంగా కొండ మీద నిలబడి, టెలిగ్రాఫు తీగలను చూస్తూవుంటే, ఆ సమానాంతర రేఖల్లో ఆయనకో అద్వితీయ అనుభూతి కలిగింది. ఇది దేవుడు గారు సృష్టించిన ప్రకృతి గాదు. ప్రకృతిని తన అదుపులోకి తీసుకురావడానికి మానవుడు చేస్తున్న ప్రయత్నం అని తెలుసుకున్నాడు. ఆ తీగల్లో ప్రసరించే విద్యుచ్ఛక్తి తన నూతన కవిత్వానికి ఆవేశం ఇచ్చింది. దీనికి నాటి ప్రపంచ రాజకీయ పరిస్థితులు కూడా తోడయ్యాయి. 'మహాప్రస్థానం' గీతాలు రాస్తున్న దశాబ్దం (1930–40)లో స్పెయిన్‌లో ప్రచండమైన అంతర్యుద్ధం సాగింది. 1920 సత్యాగ్రహోద్యమం ప్రారంభమైన కాలానికే రష్యాలో విప్లవం విజయవంతమైంది. దాని ప్రభావ ఛాయలు ఉన్నవ వారి 'మాలపల్లి'లో ప్రస్ఫుటమయ్యాయి.

1920 దశకం నాటికి సాహిత్యరంగంలో భాషలో, భావంలో, సాహితీ సంస్థల నిర్మాణంలో మార్పులు వచ్చాయి. భాషా పాండిత్యాలకే పరిమితమైన సాహితీసంస్థలు పోయి, సాహితీసమితి, నవ్యసాహిత్య పరిషత్తు లాంటివి తలెత్తాయి. విదేశీ పాలన నుంచి స్వేచ్ఛనే గాక ఫ్యూడల్ సమాజ బంధనాల నుంచి విశృంఖల భావ స్వాతంత్ర్యాన్ని కోరుతూ వచ్చారు కృష్ణశాస్త్రి తరం భావకవులు. మహిళా హైన్యస్థితి విధ్వంసనకై స్వేచ్ఛను బోధించారు చలం లాంటి వాళ్లు. కర్షకుల, పాటక జనుల జీవిత పరిస్థితులను దువ్వూరి రామిరెడ్డి, కవి కొండల వెంకటరావు మొదలైనవారు తమ కవితల ద్వారా చిత్రించారు. రెండు సత్యాగ్రహ ఉద్యమాలు ముగిసి, కాంక్షించిన స్వరాజ్యం రాకపోగా జాతీయ అంతర్జాతీయ పరిస్థితులు తెలుగు కవుల్లో గొప్ప జాగృతిని కల్గించాయి. జర్మనీలో హిట్లర్ నాజీ ప్రభుత్వం ఏర్పడింది. ప్రపంచ సంస్కృతి పరిరక్షణ ఒక ప్రధాన కర్తవ్యంగా ప్రపంచమందలి వివిధ దేశాల మేధావుల కర్తవ్యమైంది.

తుమ్మల సీతారామమూర్తి, విద్యాన్ విశ్వం మొదలైనవారు రైతు సమస్యలపై రాసిన పాటలను కవితలను 'రైతు భజనావళి' ప్రచురించారు. 1934లోనే సోషలిస్టు పార్టీ ప్రత్యక్షంగానూ, కమ్యూనిస్టు పార్టీ ప్రచ్ఛన్నంగాను పనిచేయడం ప్రారంభించిన రోజుల్లోనే తుమ్మల రాసిన 'ఎగరాలి ఎగరాలి మన ఎర్రజెండా' అనే పాట, 'ఆకలి మంటల మలమలమాడే అనాథలందరు లేవండోయ్' అనే అంతర్జాతీయ గీత అనువాదం, 'అన్నా కూలీ లేకము కావలెరా' అనే కార్మిక ఐక్యతా ప్రబోధగేయం, గోర్కీ 'అమ్మ' మొదలైన రచనలు తెలుగునాట అభ్యుదయ రచనోద్యమానికి అంకురార్పణ చేశాయి. వ్యావహారిక భాషా ఉద్యమం విజయ పతాకను ఎగురవేస్తున్నది. సంస్కరణోద్యమాల ప్రభావమూ, హేతువాద దృష్టి, సమకాలీన సమాజ దుస్థితి పరిశీలనా ప్రారంభ మయ్యాయి. ఈ స్వాతంత్ర్య చైతన్యం తదుపరి దశ సామ్యవాద చైతన్యం. శ్రీశ్రీ దానికి ప్రతినిధి. తన దృష్టి ఆర్థిక స్వాతంత్ర్యం, సమానత్వం కోసం సాగే పోరాటంపై కేంద్రీకృతమైంది. అందుకోసం ఆయన మోగించిన కవిత జయభేరి. 'జయభేరి'తో మొదలైన కవితా ప్రస్థానం మహాప్రస్థానం గీతంతో తారాస్థాయికి చేరింది. ఈ రెంటికీ మధ్యన ఒక రాత్రి, గంటలు, ఆకాశదీపం కవితలు వస్తాయి. తెలుగు జాతి జీవనాదాల్లో ఒకటిగా మిగిలిపోయిన మహత్తర గీతం మహాప్రస్థానం రాయడానికి అయిదు నిముషాలు కూడా పట్టలేదంటే ఆ భావం అంతరాంతరాల్లో ఆయన ఎంతగా నిబిడీకృతమై పోయిందో తెలుస్తుంది. ఈ మహత్తర గీత రచనపై ఆయనే చాలా హృద్యంగా చెప్పాడు. 'మరో ప్రపంచం/ మరో ప్రపంచం' గీతాన్ని 1934 ఏప్రిల్ 12వ తేదీన రాశారు. పెన్ను దొరక్కపోతే పెన్సిలుతోనే రాశాడు. మరో ప్రపంచం అని ప్రారంభించి భుగభుగలు అని ముగించేదాకా పెన్సిల్ ఆపలేదు.

"మహాప్రస్థానం' గీత సంపుటిలోని చాలా రచనలు ఒక్కమాటు ఒక్కచోట ఒక్కపూటలో రాసినవే. నాలుగైదు గీతాలు మాత్రం మొదట ప్రారంభించి తర్వాత కొన్నాళ్ళకు పూర్తి చేసినవి. 'దేశచరిత్రలు' వరుసగా రెండురోజులు కూర్చుని రాశాను. ప్రారంభించిన తేదీకాక పూర్తిచేసిన తేదీనే విషయానుక్రమణికలో ఇచ్చాను. మొదట కొంతవరకు రాసి, తర్వాత చాలాకానికి పూర్తి చేసిన గీతాలలో ముఖ్యమైనది 'జగన్నాథుని రథచక్రాలు'. ఇది ఎప్పటికీ అసంపూర్ణంగా ఉండిపోతుందేమో అని ఒక్కొక్కప్పుడు నాకే సందేహం కలిగేది. మహాప్రస్థానం సంపుటిలో మొట్టమొదటి గీతం మహాప్రస్థానం, చిట్టచివరి గీతం జగన్నాథుని రథచక్రాలు ఉండాలని నా ఉద్దేశం. 1940లో ఒకరోజు రథచక్రాలు రాయడం పూర్తి అయింది. కాని తర్వాత పదేళ్ళ వరకు గాని గ్రంథం అచ్చు కాలేదు. అందుచేత 40 తర్వాత వ్రాసిన నీడలు, నిజంగానే, గర్జించు రష్యా అనే గేయాలు కూడా ఈ సంపుటిలో చేర్చాను.' అని శ్రీశ్రీ వివిధ చోట్ల చెప్పారు.

మహా ప్రస్థానం రాసే నాటికి తనకు మార్క్సిజం తెలియదని శ్రీశ్రీ అన్న మాటకు విపరీతార్థాలు తీసేవారు కొందరున్నారు. ఆయనే ఇలా స్పష్టం చేశాడు : "గురజాడ అప్పారావు గారు మార్క్సిజం చదువుకోలేదు. కాని ఆయన 'కన్యాశుల్కం'లో కనబడే సామాజిక పరిశీలన చాలా గొప్పది. మార్క్సిజం చదివినవాడికే అది సాధ్యమవుతుంది. గురజాడ శిక్షణ ద్వారా, అధ్యయనం ద్వారా మార్క్సిస్టు కాకపోవచ్చు. కాని ఆయనలో అలాంటి భావాలు వ్యక్తమయినాయి. అలాగే నేను 'మహాప్రస్థానం' రాసేనాటికి మార్క్సిజం చదవలేదు. అయితే మయకోవస్కీ లాంటి మార్క్సిస్టు రచయితల రచనలు, కవిత్వం చదివాను. వారి ప్రభావం నామీద వుంది. అలాగే చాలామంది యువ రచయితల మీద అప్పుడు వీస్తున్న గాలి ప్రభావం వుంది. మార్క్సిజం ప్రేరణ వుంది."

తన గీతాల సంపుటి కొంపెల్ల జనార్ధనరావుకు అంకితం చేస్తూ శ్రీశ్రీ 1937లోనే స్మృతి గీతం రాసి పెట్టుకున్నాడు. కనీసం 1940లోనే వాటిని పుస్తకంగా తీసుకురావాలనుకున్నాడు. అప్పట్లో ఆయనకు 'అనధికార ప్రచారాధికారి'గా వున్న జరుక్ శాస్త్రి సూచనపై అందుకు చలంతో ముందుమాట రాయించి పెట్టుకున్నాడు. కింద చలం సంతకం దగ్గర 17.7.1940, బెజవాడ అని వుంటుంది. అయితే అది అచ్చులో రావడానికి మరో పదేళ్లు ఆగవలసి వచ్చింది. నళినీ కుమార్ అనే సహృదయ సాహితీమిత్రుడు సహాయం చేయడంతో 'మహాప్రస్థానం' 1950లో వెలుగు చూసింది.

'మహాప్రస్థానం' పునర్ముద్రణలు విశాలాంధ్ర నిరాఘాటంగా కొనసాగిస్తోంది. ముఖచిత్రంగా మా.గోఖలే వేసిన చిత్రం కొన్ని వేల మెదళ్లలో ముద్రితమై పోయింది. బహుశా తెలుగులో అత్యధికంగా అమ్ముడుపోయిన సృజనాత్మక కవిత్వం అదేనంటే అందరూ అంగీకరిస్తారు. 1981లో శ్రీశ్రీ దంపతుల లండన్ పర్యటన సందర్భంగా గూటాల కృష్ణమూర్తి ఆ కావ్యాన్ని శ్రీశ్రీ స్వదస్తూరితో అద్భుతంగా తీసుకొచ్చారు. ఆయన గానం చేసిన క్యాసెట్‌ను కూడా జతపర్చారు. 2021లో విజయవాడ శ్రీశ్రీ ప్రింటర్స్ విశ్వేశ్వరరావు మహాకవి కోరిన సైజులో కాకున్నా భారీ సైజులోనే మహాప్రస్థానం ప్రత్యేకంగా ప్రచురించి అభినందనలు పొందారు. విరసం వారు సంపుటాలుగా ప్రచురించారు. మనస్విని ట్రస్టు ప్రస్థాన త్రయం తీసుకొచ్చింది. 2010లో శ్రీశ్రీ శతజయంతి సందర్భంలో నేను రాసిన 'శ్రీశ్రీ జయభేరి' జీవితం– సాహిత్యం – రాజకీయాలు కూడా ఆరు ముద్రణలపైగా వచ్చిందంటే ఆ ప్రభావం ఎంత బలమైందో తెలుస్తోంది. ఎవరో అన్నట్టు– శ్రీశ్రీ కన్నా ఆయన కవిత్వం గొప్పది, కవిత్వం కన్నా ఆయన కవితా మార్గం మరింత గొప్పది. పదండి ముందుకు అని నడిపిస్తూనే వుంటుంది.

– తెలకపల్లి రవి

అమ్మ వాడు భాష అమరమై వెలుగు



బంగ్లాదేశ్ ఏర్పడ్డాక, ఆ దేశంలో అధిక శాతం ప్రజలు మాట్లాడే బెంగాలీ భాషని కూడా అధికార భాషగా ప్రకటించాలని చేసిన ఉద్యమం గుర్తుగా 26 సంవత్సరాల క్రితం 21 ఫిబ్రవరిని అంతర్జాతీయ మాతభాషా దినోత్సవంగా ప్రకటించారు. ఒకే మతానికి చెందిన దేశం నుంచి విడిపోయిన ప్రజలు మతపరమైన హక్కుల కోసం కాకుండా, తాము మాట్లాడే భాష ఉనికిని రక్షించుకోవడం కోసం ఉద్యమం చేశారు. మనుషులు పాటించే ఆచార వ్యవహారాలు, అవలంబించే మతాలూ ఊహ తెలిసాక అవగాహనకి వస్తాయి. కానీ, భావ వ్యక్తీకరణకి అవసరమైన భాష అమ్మ ఒడిలోనుంచే అబ్బుతుంది. గమనించవలసిన ఇంకో విషయం ఏమిటంటే, మన పొరుగు రాష్ట్రాలైన కేరళ, తమిళనాడులలో ప్రజలు అవలంబించే మతాలు ఏమైనా దాదాపుగా రాష్ట్ర ప్రజలందరూ వారి రాష్ట్ర భాష మాట్లాడతారు, అది గర్వకారణంగా భావిస్తారు. ఇప్పటికీ కేరళ, తమిళనాడులలో ఆయా భాషల్లో వచ్చే దినపత్రికలూ, వారపత్రికలతో సహా సాహిత్య పత్రికలని కొని చదువుతారు. దురదృష్టవశాత్తూ, ఈ పాఠక ప్రాచుర్యం తెలుగు రాష్ట్రాల విషయంలో నిజమని చెప్పలేను.

భాష వ్యక్తి ఉనికికే కాదు, సమాజపు ఉనికికి కూడా ఆయువుపట్టు. సమాజ, జాతి ఏకీభావనకు భారతీయ భాషల ఆలంబన అవసరం. మిగతా దేశాల్లో లేని సంక్లిష్టత భారత దేశంలో ఉన్నది. అది బహుభాషా సౌరభం. మాతృభాషలో మాట్లాడడం వల్ల బుద్ధి బాగా వికసిస్తుందని, పిల్లలు మాతృభాషలో ప్రాథమిక విద్యనభ్యసిస్తే భవిష్యత్తులో బాగా రాణించగలరని, మాతృభాషలో ప్రావీణ్యం ఉన్న వారు వేరే భాషలు సునాయాసంగా నేర్చుకోగలరని, ఇలా ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని పరిశోధనలలో తేలినట్టు చదువుతున్నాం, వింటున్నాం. ఇవన్నీ ముంజేతి కంకణానికి అద్దం ఎందుకన్న సామెతని గుర్తు చేస్తాయి.

భారత రాజ్యాంగం మాతృభాషలో ప్రాథమిక విద్యా బోధన జరగాలని నిర్దేశించినా, కొన్ని రాష్ట్రాలు ఆంగ్ల మాధ్యమంలో ప్రాథమిక విద్యాబోధనకే మొగ్గు చూపుతున్నాయి. ముఖ్యంగా, ఆంధ్రప్రదేశ్ విషయానికి వస్తే, పరిస్థితి అగమ్యగోచరమనే చెప్పాలి. తెలుగు మాధ్యమంలో బోధించే పాఠశాలలు మరుగవుతుండడం ఒక విపత్కర పరిణామాన్ని సూచిస్తోంది. అయినా సరే, ఆంగ్ల విద్య, ఆంగ్ల మాధ్యమంలో బోధనలో జరిగే చదువు కేవలం ఉన్నత సామాజిక వర్గ పురోగతికి కారణమని చెప్పే ఒక తప్పుడు ప్రచారం జరగడం విచారకరం. తెలుగు మాధ్యమంలో డిగ్రీ వరకూ చదువుకుని, తెలుగు సాహిత్యంలో ఉన్న ఎన్నో అపురూపమైన పాఠ్యాంశాలని చదువుకుని, ఉన్నత విద్యనభ్యసించి, వేర్వేరు రంగాల్లో నిష్ణాతులుగా రూపొంది ప్రపంచంలో వెలుగొందుతున్న వారు ఎంతోమంది ఉన్నారు. ఎంతోమంది ప్రవాసులు, వారి వృత్తి ఏదైనాకానీ, తెలుగు సాహిత్యాధ్యయనంతో పాటు రచనా వ్యాసంగాన్ని కూడా అభిరుచిగా ఎంచుకుని కొనసాగిస్తున్నారు.

కూటి కోసం, ఉన్నత విద్య, ఉద్యోగ లక్ష్యాలను నెరవేర్చుకోవడం కోసం ఎంతోమంది గత మూడు, నాలుగు దశాబ్దాలుగా భారతదేశం దాటి వేరువేరు దేశాలకు వలస వెళ్ళడం ఒక చారిత్రక పరిణామం. ఏదో కోల్పోతున్నామేమో అనే బాధ, ఆతృతతోనూ, సహజమైన భాషా సంస్కృతుల పట్ల ఉన్న ప్రేమ, మక్కువ కారణంగా కొంతమంది నాయకత్వంలో తెలుగు సంఘాలు ఏర్పడి, తెలుగు వారు వారి ఆచార వ్యవహారాలని మరవకుండా, పండగలకీ, పబ్బాలకీ కలుస్తూ భాషా సంస్కృతులను పరిరక్షించుకునే ప్రయత్నం అభినందనీయం. ఇళ్లలోనో, గుళ్ళలోనో నడిపే తెలుగు బడులకి వారాంతంలో వానలో, ఎండలో, మంచులో, మైళ్ల కొద్దీ ప్రయాణించి పిల్లలని తీసుకువెళ్ళి తెలుగు నేర్పించే ప్రయత్నం చేసే తెలుగు ప్రవాసులు ఎందరో ఉన్నారు. అప్రస్తుతం అనిపిస్తున్నా, సందర్భం కోసం ఒక విషయం చెప్పాలి. మా అమ్మాయి చిన్నప్పుడు 'బాలభారతి' అనే తెలుగు బడిని అమెరికాలో స్థాపించి సుమారు ఆరేళ్లు శ్రీమతి అరుణ గురజాడ, నేనూ నిర్వహించాం. ఈ సంస్థ ద్వారా శ్రీమతి సావిత్రి గారి హరి కథ, కార్టూనిస్ట్ మల్లిక్ గారి కార్టూన్ ఫెస్టివల్ (పిల్లల కోసం), గరికిపాటి నరసింహారావు గారి పిల్లలనుద్దేశించిన ఉత్తేజపూరిత ప్రసంగం ... ఇలా ఎన్నో కార్యక్రమాలు చేసి పిల్లలకి భాష పట్ల అభిరుచిని కలిగించే ప్రయత్నం చేశాము. కొందరు తల్లిదండ్రుల పని ఒత్తిడి, అనాసక్తి లాంటి కారణాల వల్ల ఇంట్లో పిల్లలకి తెలుగుభాష పట్ల ఆసక్తి కలిగించలేకపోవడం దురదృష్టకరమైనా, చాలామంది తెలుగువారు ఇంట్లో తెలుగు మాట్లాడడం వల్ల వారి పిల్లలకి తెలుగు నేర్చుకునే అవకాశం కలిగించారు, కలిగిస్తున్నారు. ఈ సందర్భంగా 'మాతృభాష' అనే కంటే, 'ఇంటి భాష' అనడం సబబేమో! కానీ, భాషాంతర వివాహాలు ఎక్కువవుతున్న ఈ రోజుల్లో ఆంగ్ల భాష అమ్మ భాషగా అలరారుతుండడం గమనించదగ్గ విషయం. భారతదేశంలో కూడా ఈ పరిస్థితి అరుదు కాదు. కాబట్టి, అమ్మ భాష ఏదైనా, బిడ్డ నేర్చే భాష అమ్మ సంస్కారం మీదే ఆధార పడి ఉంటుంది. అందుకే, అమ్మకి మాతృభాష పట్ల మక్కువ చెక్కు చెదరకుండా ఉండాలి.

తెలుగు రాష్ట్రాల విషయానికి, ముఖ్యంగా ఆంధ్ర రాష్ట్రం విషయానికి వస్తే, తెలుగుభాష మనుగడ గురించి ఆందోళన కలుగుతుంది. తెలుగు మాధ్యమంలో ప్రాథమిక విద్యస్థాయిలో బోధనకి ప్రభుత్వమే అనానుకూల పరిస్థితి కలిపించడం, కొందరు తల్లిదండ్రులు, మేధావులు అన్నప్రాశన నుండే ఆంగ్లం పట్ల మొగ్గు చూపడం హర్షనీయం కాదు. ఏ భాషా మాధ్యమంలో చదివినా, మాతృభాషపై గౌరవం, మక్కువ, మాతృభాషలో ప్రావీణ్యం, మాతృ భాషలో ఉన్న సాహిత్యాన్ని, సారస్వతాన్నీ అధ్యయనం చేసే అభిరుచి కలిగి ఉండడం చాలా అవసరం. ఈ అవసరాన్ని తల్లిదండ్రులు, ప్రభుత్వాలు గుర్తించకపోవడం, నిర్లక్ష్యం చేయడం, చారిత్రికమైన తప్పిదమవుతుంది.

ఈనాటి సమాజంలో మాట్లాడే అవసరం, రాసే అవసరం అంతగా లేదు. సాంకేతికత, అధునాతన పరికరాల అందుబాటు కారణంగా ఏమి చెప్పాలన్నా, ఏమి రాయాలన్నా మౌఖికంగా కన్నా, పరోక్షంగా డిజిటల్ మాధ్యమాలలో ఏమోజీలనే బొమ్మల రూపంలో తెలియచేయడం సాధారణమయిపోయింది. ఇంకొంత కాలానికి భాషకి బదులు బొమ్మల ద్వారా జరిపే సంభాషణే విరివిగా కొనసాగే అవకాశం ఉంది – ఆదిమ మానవుడిలా!

ఈ పరిస్థితి చక్కపడాలంటే చేయవలసిన పనులు, కార్యక్రమాలు సూచిస్తూ పండంటి భాషకి పదహారు సూత్రాలనో, పన్నెండు సూత్రాలనో కొందరు విద్యావేత్తలు రాసిన వ్యాసాలు చూస్తుంటాం. కానీ, అంకితభావంతో కూడిన కార్యాచరణ లేకపోతే గట్టిమేల్ తలపెట్టని వట్టి మాటల నీటి మూటల్లా ఆలోచనలు అక్షరాలకే పరిమితమవుతాయి. తెలుగువారికి మాతృభాషకి సంబంధించిన సంకటంతోపాటు, వ్యావహారిక భాషా సంకటం కూడా తోడయింది. నన్నయ నుంచి నేటి వరకూ, గ్రాంథిక భాషలో రచనలు చేయాలా, లేక వ్యావహారిక భాషలో చేయాలా అన్న చర్చ కొనసాగుతూనే ఉంది. చదివే వారు, రాసేవారూ ఉన్నత సామాజిక వర్గానికి చెందిన వారు ఉన్న కాలంలో వ్యావహారిక భాష నీచభాష అనే భావన నుంచి, సామాన్యులకి సైతం అర్థమయ్యే భాషలా రూపాంతరం చెంది, ఎన్నో కవితా ప్రక్రియలకీ, కథా రూపాలకీ, నవలల ఆవిర్భావానికీ ఆలంబననిచ్చిన గురజాడ, గిడుగుల విశేష కృషి మరువరానిది. పండిత భిషక్కుల భాషా వైద్యం వికటించకముందే తెలుగు భాషను సామాన్య ప్రజల భావ ప్రకటనా పరికరంగా మార్చిన 'వ్యవహార భాషా ప్రయోక్త' ద్వయానికి తెలుగు జాతి ఋణపడి ఉంది.

– ఆచార్య కొవ్వలి గోపాలకృష్ణ, అమెరికా
+17329917742

అనగనగా ఒక రాజు, రేపటి శత్రువు నాటికల్లో సన్నివేశాలు

అలనాటి నాటికలు అదరహో...!

రంగస్థలం

ఆధునిక తెలుగు నాటకరంగంలో విశాఖపట్నం నగరానికి ఓ విశిష్టత, ప్రత్యేకతలున్నాయి. ఇందుకు దోహదపడిన ఎందరెందరో అత్యంత ప్రముఖ దర్శకులు, నటులు, ప్రయోక్తల్లో కీర్తిశేషులు మందులు, కొండవలస లక్ష్మణరావు వంటి ఉద్దండుల్ని కచ్చితంగా ప్రస్తావించి తీరాలి. దాదాపు ఐదు దశాబ్దాల నాడు 'అనగనగా ఒక రాజు' (రచన: దాడి వీరభద్రరావు), 'రేపటి శత్రువు' (రచన : ఆకెళ్ల సూర్యనారాయణ) నాటిక ప్రదర్శనలు వారి దర్శకత్వంలో ప్రభంజనం సృష్టించాయంటే ఏ మాత్రమూ అతిశయోక్తి లేదు. ఇన్నేళ్ల తర్వాత ఆ నాటికలను మరోసారి చూసే అవకాశాన్ని విశాఖపట్నంలోని కళాభారతి యాజమాన్యం ప్రేక్షకులకు కల్పించింది. కళాభినయ (అనగనగా ఒక రాజు), శ్రీమతి జ్యోతి సరళ స్మారక కళాపరిషత్ (రేపటి శత్రువు) బృందాలు ఆ అవకాశాన్ని ఈనెల ఏడో తేదీన ఎంచక్కా సద్వినియోగం చేసుకున్నాయి. ప్రేక్షకులూ సంతృప్తి చెందారు. 'అనగనగా ఒక రాజు' ప్రధానంగా రాజకీయాలు, వ్యవస్థలో లోపాల్ని చర్చిస్తుంది. మంచి పాలన అందిస్తారని ఎన్నుకుంటే ప్రజల్ని అసలేమాత్రం పట్టించుకోపోవడంతో రాజుపై విఫల హత్యాయత్నానికి ఒడిగట్టిన ఓ సామాన్యురాలిని బంధించడంతో నాటిక ప్రారంభమవుతుంది. మంత్రి, సేనాని సమక్షంలోనే తీవ్ర వాగ్వాదం.. అనంతరం– వ్యవస్థను బాగు చేయాలంటే ఏం చెయ్యాలని రాజు అడిగితే తనను ఓ సంవత్సరం పాటు మంత్రిని చెయ్యాలంటుందామె. రాజు ఇచ్చిన అవకాశంతో ఆమె ఎన్నో సంస్కరణలనూ సంక్షేమ పథకాలనూ ప్రవేశపెడుతుంది. అయితే ఏడాది తర్వాత తుది సమీక్షలో ప్రజలకు కించిత్ ప్రయోజనం కూడా జరగలేదని తెలుతుంది. పథకాలూ నిర్ణయాలూ అన్నీ పత్రాలపైనే తప్ప ఆచరణలో జరగకపోవడానికి బాధ్యులు ఎవరో తేల్చుకోవడానికి తన వద్ద మహిమ గల అంగుళీయంలో చూడొచ్చని నూతన మంత్రి అంటే.. అందులో తాను కనిపించడంతో రాజు హతాశుడవుతాడు. తామూ కనిపిస్తామేమోనని పాత మంత్రీ సేనానీ ఆ ఉంగరాన్ని కాజేయడానికి పన్నిన కుట్ర బయటపడటంతో రాజునే ఆ ఇద్దరూ హత్యజేసి.. కొత్త మంత్రి నిర్వాకంతో దారుణ ఫలితాల నేపథ్యంలో ఆత్మహత్య చేసుకున్నాడని.. కొత్త మంత్రి మహిళ కారణంగా ఉపేక్షిస్తున్నామని, పాత మంత్రి గద్దెనెక్కాక అధికారిక ప్రకటనతో నాటిక ముగుస్తుంది. ఈ క్రమంలో సమాజంలో నిరుద్యోగం, అవినీతి, అధిక ధరలు ఇత్యాది సమస్యలు, పరిష్కార మార్గాలు పదునైన సంభాషణలతో ప్రేక్షకుల్ని ఇప్పటికీ ఆకట్టుకోగలగడం ప్రత్యేకత. రాజు మంచివాడే, మంత్రి, సేనాని మాత్రమే అసలు దుర్మార్గులు అని చూపడం ప్రస్తుతం ఎంతో కొంత వివాదమనిపించొచ్చు. సామాన్యురాలిని వ్యక్తిగానేగాక కోటానుకోట్ల ప్రజల ప్రతీకగా చెబితే మరింత ఆమోదయోగ్యమనిపించేదేమో! అంగుళీయం మహిమ ట్రిక్ ప్రస్తుత పరిస్థితుల్లో నిలవకపోవొచ్చు. దాదాపు ఏడు పదులు దాటినా ఇంకా విజయలక్ష్మి సమర్థంగా నటించడం చాలా చాలా విశేషం. 'సెల్యూలాయిడ్‌పై 'మహానటి' సావిత్రి, నాటకరంగ వేదికపై విశాఖ విజయలక్ష్మి' అనే నానుడి అక్షరసత్యంగా భావిస్తోంది ప్రేక్షకలోకం.

రెండో నాటిక 'రేపటి శత్రువు' ... తనూ కోడలిగానే ఆ ఇంట ప్రవేశించిందని అత్తా– రేపు తనూ అత్త అవుతాననీ ఆనక వృద్ధురాలినవుతాననీ కోడలికీ– ఎప్పటికి స్పృహ కలిగేనో..! ఇంటింటి బాగోతమే ఈ నాటిక. జీవిత చరమాంకంలో పూర్తిగా సంతానంపైనే ఆధారపడొద్దు.. కొంత తమ కోసం ఉంచుకోవాలి.. అలాగే– అరవైలు డెబ్బైలు దాటాక కూడా కొడుకు / కూతురు జీవితంలో సలహాలు.. అనుభవాలు.. అభిప్రాయాలు వ్యక్తంజేసే పేరుతో అన్నింట్లో తలదూర్చడం అసలేమాత్రం క్షేమదాయకం కాదు.. అని హేతుబద్ధంగా, శక్తిమంతంగా సూత్రీకరించారు రచయిత ఆకెళ్ల.

ఇన్నేళ్లూ తాను కంటిపాపలా చూసుకున్న పుత్రుడు భార్య కొంగుచాటు వాడవుతున్నాడనే బాధ.. కోడలు పిల్ల తనను అసలేమాత్రం ఖాతరు చేయడం లేదనే బాధ మరో వైపు.. ఇలాంటి ఏ పాత్రలో జీవించటానికైనా విజయలక్ష్మికే చెల్లునేమో..! అంతిమంగా కొడుకు, కోడలు తమను విడిచి ఇంట్లోంచి వెళ్లిపోతామనేసరికి.. వయసును సైతం పక్కనబెట్టి కాళ్లావేళ్లాబడినా ఫలితం ఉండకపోవడంతో హతాశులైన వృద్ధ దంపతులు.. అనివార్యమై కడకు తామే తమ ఊరి లోని పాత ఇంటికి వెళ్లిపోవడానికి సిద్ధమవ్వడంతో నాటిక ముగుస్తుంది. 'మనిషి 40 ఏళ్లు వచ్చే వరకే మనిషిలా బతుకుతాడు. 60 ఏళ్లు వచ్చేవరకూ గాడిద బరువు మోస్తాడు. కుక్కలా కాపలా కాస్తూ మొరుగుతూ ఉంటాడు. 80 ఏళ్లు దాటాక గుడ్లగూబలా చూస్తుంటాడు. ఇదీ మనిషి జీవితం. "మన పిల్లలు గానీ బంధువులు గానీ శత్రువులు కారు. మన వార్ధక్యమే మన శత్రువు. ఆ శత్రువును ఎదుర్కోవడానికి మన దగ్గర శక్తి ఉన్నప్పుడే అర్థబలాన్ని, అంగబలాన్ని దాచుకోవాలి. అప్పుడే మనకు హాయి. మనశ్శాంతి." వంటి సంభాషణలను ప్రేక్షకులు కరతాళ ధ్వనులతో హర్షించారు.

ప్రధాన పాత్రలు పోషించిన (మీసాల) నాయుడు (అనగనగా ఒకరాజు), ప్రసాద్ (రేపటి శత్రువు) నాటికలను పర్యవేక్షించారు. ఇంకా కన్నబాబు, జీవీఎస్సెన్ మూర్తి, రమాదేవి, వర్రే నాంచారయ్య తదితరులు పాత్రోచితంగా నటించారు.

– జి.వి.రంగారెడ్డి, సీనియర్ పాత్రికేయులు
99126 15747

ఆకులు అంటుకుంటున్న దుఃఖం

సూర్యుడు కాంతిబింబాలై విచ్చుకుని
చివుళ్ళ మొనల కొనల నుంచి
జారుతున్న బిందువుల్లో
గాయాలు బొమ్మలు బొమ్మలుగా కదుల్తున్న
యీ కంటి శోకపు కారుమబ్బులు
కమ్ముతున్న సమయాన

అమ్మీ..!
అడవుల ఆర్తనాదాలు వినిపీలేదా
ఆకులపై అభాగ్యుల నెత్తుటి ధారలు
కనిపీలేదా
కత్తులు ఎవ్వరివో
కార్పణ్యాల విత్తులు ఎక్కడివో?

పూలు పండ్లు కాయలు
ఎంత మధురమైవో అడవుల్లో ప్రేమదుంపలు
యెక్కడివీ నెత్తుటి రుచిమరిగిన ముళ్లకంపలు?

ఏళ్ళు లేళ్ళు వాగులు
ఎంత సుందరమైనవో అడవుల చెలిమిలోగిళ్ళు
యే మూర్ఖుల గుంపు చలి కాచుకుంటున్నవో
యీ రంపుమంటలు?
నిజాన్ని మసిపూసి మారేడు చేసే
ముదనష్టపు పన్నాగాలకు
అరణ్యాల మీద ఎందుకింత కసి!?
రేవుల కాడా రేచులై కాపుగాసి
వనపేగు బంధాలను పీనుగులు చేస్తున్న దృశ్యం
అగుపీలేదా?

ఆకులు అంటుకుంటున్న దుఃఖం
కొమ్మలు మండుతున్న దుఃఖం
అమ్మవంటి అడవి కుములుతున్న దుఃఖం
అయ్యవంటి కట్రవలు కాలుతున్న దుఃఖం

అమ్మీ.!
నాగదారి పండ్లు ముక్కున కరుచుకుని
పక్షులు ఎగిరే యీ ప్రేమోదయాన
సత్యాన్ని నీ చేతుల్లో ఒంపుతున్న
కనుబొమ్మల మద్దెన పొద్దుని
అమరగీతంగా దిద్దుకుని ఒద్దిక పాడతావు కదూ!

అమ్మీ
అడవంటే
మంటల్ని కనే నిండు చూలాలు కదా
అడవంటే కంతాల్ని రగిలించే కవిత్వం కదా!
(అన్యాయానికి బలవుతున్న అడవిబిడ్డలకు)
– పల్లిపట్టు నాగరాజు

డిపోర్టేషన్

పగిలేంత వరకే అద్దం అందం
పగిలిపోయాక అదొక విచ్చిన్న దృశ్యశకలం
ముక్కలన్నీ కలిపి అద్దాన్ని అతికితే అతకొచ్చు
దృశ్యం అతకదు గాక అతకదు
అతుకు పడని ప్రతిబింబానికి
ఎన్ని రంగులేసి ఏం లాభం చెప్పు?

ఇక్కడ ఏదో లేదని
తప్పిపోవడానికి తిరునాళ్లకెళ్ళినట్టు
అక్కడకెళ్లి వెర్రి చూపులకు
వెలుతురులద్దలని చూస్తావు
అక్కడ ఏముందో ఎప్పటికీ తెలియదు
అలా అని తిరిగొస్తే
తల కొట్టేసినంత పని కదా!?

ఇక్కడ రూపాయి అక్కడ డాలర్
ఇక్కడ బువ్వ అక్కడ బ్రెడ్
ఇక్కడ ఆవకాయ అక్కడ సాస్
ఇది ఇండియా అయితే
అది అమెరికా కాకపోతే మరొకటి

వాడు ఒద్దు కాక వద్దని
యుద్ధ విమానాల్లోంచి విసిరి పారేస్తుంటే
డిపోర్టేషన్ అంటూ కొత్తగా ప్రొనౌన్సియేట్
చేస్తున్నావు కానీ
నిజానికి వాడు నిన్ను నెట్టేస్తున్నాడు
ఇంకా చెప్పాలంటే
మెడపట్టి గెంటేస్తున్నాడు

ఇప్పటికైనా బోధపడిందా?!

మన అమ్మ మన అమ్మే
మన నాన్న మన నాన్నే
మన ఇల్లు మన ఇల్లే
నువ్వు పొలమారుతున్న ప్రతిసారీ
దేశం నిన్ను తలుచుకుంటుందని మాత్రం తెలుసుకో!
(అమెరికా నుంచి భారతీయుల్ని యుద్ధ విమానాల్లో తిప్పి పంపుతున్న వైనానికి)
– బంగార్రాజు కంఠ
85003 50464

ఉపవాస వేళ

ఈ బూడిద రంగు ఆకాశంలో
నెలవంక పొడిచింది
డొక్కలెండిన నేలకు
ఉపవాసం అలవాటే కదా!

ఖుదా తొంగి చూడని
ఈ నేలపై ఇంకా కొన్ని
ప్రాణాలు మిగిలే వున్నాయి
వాడేదో దయ తలచి విసిరిన
మెతుకులను ఏరుకుంటూ
ఊపిరి తీస్తున్న వాళ్ళం కాదు కదా

తలవంచని గడ్డి పోచలులా
నిబ్బరంగా నిలిచి వున్నాం
మరో మారు గాజా నేల మీద
విరిగిన మీనార్లపై నుంచి
ముజ్జిన్ అధాన్ వినబడుతోందిలా
'ఈ నేల వాడిదో పక్కనున్న వీడిదో
కాదు మాదీ' అని ..
– కెక్యూబ్ వర్మ
94934 36277

ర్యాలీలో అభివాదం చేస్తున్న ప్రకాశ్‌కరత్, పినరయి విజయన్

బహిరంగ సభలో మాట్లాడుతున్న విజయన్

పోరాటాలు మరింత బలోపేతం

కొల్లాం బహిరంగ సభలో ప్రకాశ్‌కరత్

కొల్లాం : హిందూత్వ, కార్పొరేట్ శక్తులకు వ్యతిరేకంగా పోరాటాలను మరింత బలోపేతం చేస్తామని సిపిఎం సమన్వయ కర్త ప్రకాశ్ కరత్ స్పష్టం చేశారు. కేరళ సిపిఎం 24వ రాష్ట్ర మహాసభ ముగింపు సందర్భంగా కొల్లాంలో ఆదివారం నిర్వహించిన భారీ బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. కేరళలో పార్టీ సంస్థాగతంగా, రాజకీయంగా అత్యున్నత ఐక్యతను సాధించిందని చెప్పారు. భవిష్యత్ సవాళ్లను ఎదుర్కోవడానికి పార్టీ మరింత బలాన్ని పొందిందని చెప్పారు. పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, మాజీ రాష్ట్ర కార్యదర్శి కొడియేరి బాలకృష్ణన్‌ల నాయకత్వంలో కన్నూర్‌లో పార్టీ 23వ రాష్ట్ర మహాసభ నిర్వహించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. హిందూత్వ, కార్పొరేట్ ఆధిపత్య శక్తులకు ప్రాతినిధ్యం వహిస్తున్న మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఈ కాలంలో పార్టీ విస్తృతంగా పోరాడిందని తెలిపారు. కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు, సమాజంలోని అణగారిన వర్గాల సమస్యలపై ఉద్యమించిందని చెప్పారు. నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, వ్యవసాయ సంక్షోభం, నయా ఉదారవాద విధానాల వల్ల కలిగే సామాజిక సమస్యలకు, ప్రజలు ఎదుర్కొంటున్న సవాళ్లకు వ్యతిరేకంగా అచంచల నిబద్ధతతో పార్టీ పోరాడిందని తెలిపారు. నయా ఉదారవాద విధానాలు, కార్పొరేట్ ప్రయోజనాలకు వ్యతిరేకంగా రాజీలేని పోరాటాలకు పార్టీ సిద్ధమైందని చెప్పారు. హిందూత్వ శక్తులు రాష్ట్రంలోని ప్రతి విభాగంలోకి చొరబడి విభజించడానికి, రాజకీయ ఆధిపత్యం పొందడానికి ప్రయత్నిస్తున్నాయని, ఈ ప్రయత్నాలను సిపిఎం నిరంతరం ప్రతిఘటించిందని, స్థిరంగా రాజకీయ ప్రచారం చేసిందని తెలిపారు.

కేంద్రం నిర్లక్ష్యం చేసినా కేరళ తన కాళ్లపై నిలబడుతుంది : ఎంవి గోవిందన్

కేరళను అభివృద్ధి చెందిన దేశాల ప్రమాణాలకు పెంచుతామని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి ఎంవి గోవిందన్ అన్నారు. అట్టడుగు వర్గాల అభ్యున్నతే లక్ష్యమని, కేరళలో అభివృద్ధి రంగంలో ఊహించని మార్పు వస్తుందని ఆయన పేర్కొన్నారు. "మేము అన్ని సంక్షోభాలనూ అధిగమిస్తాం. పార్టీ సవాళ్లను అధిగమించి బలంగా ముందుకు సాగుతుంది. ఈసారి రాష్ట్ర కమిటీలోకి 17 మంది కొత్త వారు చేరారు. మహాసభలో ఆరోగ్యకరమైన చర్చలు జరిగాయి. " అని అన్నారు. "కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేసినప్పటికీ కేరళ తన కాళ్ల మీద తాను నిలబడుతుంది" అని ఆయన స్పష్టం చేశారు. "ఈ మహాసభ పార్టీ చరిత్రలో ఒక మైలురాయిగా మారింది. ఈ మహాసభతో కొత్త సవాళ్లను ఎదుర్కోవడానికి పార్టీని సిద్ధం చేయడమే తన లక్ష్యమని పార్టీ ప్రకటించింది. మెజారిటీ మతతత్వం, మైనారిటీ మతతత్వంతో కలిసిపోయి అందరికీ ఉమ్మడి శత్రువు సిపిఎం అని చేస్తోన్న ప్రచారాన్ని మనం ఎదుర్కోవాలి. ప్రజల మద్దతుతో మనం రెండోసారి అధికారంలోకి వచ్చినట్లే, 2026 ఎన్నికల్లో, దానికి ముందు జరిగే స్థానిక ఎన్నికల్లో మనం విజయం సాధించాలి. అన్ని ప్రతికూల పరిస్థితులనూ ఎదుర్కొంటూ ముందుకు సాగగలగాలి. అది సాధ్యం కావాలంటే మనం మన సంస్థాగత నిర్మాణాన్ని బలోపేతం చేసుకోవాలి" అని గోవిందన్ అన్నారు.

కొల్లాంలో నాలుగు రోజుల పాటు జరిగిన సిపిఎం కేరళ రాష్ట్ర 24వ మహాసభ రెడ్ షర్ట్ వలంటీర్ల మార్చ్‌తో ఆదివారం ముగిసింది. ఈ మహాసభకు 530 మంది ప్రతినిధులు మహాసభకు హాజరయ్యారు. మహాసభకు పొలిట్‌బ్యూరో సభ్యులు ప్రకాష్ కరత్, కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్, బృందాకరత్, సుభాషిణి అలీ, బివి రాఘవులు, అశోక్ ధావలే, ఎంఎ బేబి, ఎ. విజయరాఘవన్ తదితరులు హాజరయ్యారు.

అరుణసంద్రంగా కొల్లాం

వేలాది మంది రెడ్ షర్ట్ వలంటీర్ల కవాతు, లక్షలాది మంది కార్యకర్తలు, ప్రజానీకం భారీ ర్యాలీలతో కేరళలోని కొల్లాం అరుణ సంద్రంగా మారింది. పేద ప్రజల అణచివేతపై పోరాటానికి స్ఫూర్తిగా నిలిచిన కడక్కల్ నుంచి వచ్చిన ఆరేళ్ల కామ్రేడ్ అభి మార్చ్‌కి ముందు నిలిచాడు. పిల్లలు, యువకులు, మహిళలు, కార్మికులు దాదాపు 25 వేల మంది రెడ్ ఆర్మీ వలంటీర్లు కవాతు నిర్వహించారు.

కేరళ రాష్ట్ర కార్యదర్శిగా ఎంవి గోవిందన్

- 16 మందితో రాష్ట్ర కార్యదర్శివర్గం
- 89 మందితో రాష్ట్ర కమిటీ ఎన్నిక

సిపిఎం కేరళ రాష్ట్ర కార్యదర్శిగా ఎంవి గోవిందన్ తిరిగి ఎన్నికయ్యారు. 16 మంది రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులతో కలిసి 89 మందితో నూతన రాష్ట్ర కమిటీ ఎన్నికైంది. రాష్ట్ర రాజకీయ, నిర్మాణ నివేదికను రాష్ట్ర కార్యదర్శి ఎంవి గోవిందన్ ప్రవేశపెట్టారు. ఈ నివేదికపై 47 మంది ప్రతినిధులు చర్చల్లో పాల్గొన్నారు. మహాసభ ఏకగ్రీవంగా ఆమోదించింది. అనంతరం రాష్ట్ర నూతన కమిటీని మహాసభ ఎన్నుకుంది. రాష్ట్ర కార్యదర్శిగా ఎంవి గోవిందన్ తిరిగి ఎన్నికయ్యారు. రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులుగా పినరయి విజయన్, ఇపి జయరాజన్, కెకె శైలజ, థామస్ ఐజాక్, టిపి రామకృష్ణన్, కెఎన్ బాలగోపాల్, పి.రాజీవ్, కెకె జయచంద్రన్, విఎన్ వాసన్, సాజి చెరియన్, ఎం.స్వరాజ్, పిఎ మహ్మద్ రియాజ్, పికె బిజు, పుతలత్ దినేషన్, సిఎన్ మోహనన్ ఎన్నికయ్యారు. రాష్ట్ర కమిటీకి 17 మంది కొత్తగా ఎన్నికయ్యారు.

ఎల్‌డిఎఫ్‌కు అండగా నిలవాలి

- సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు

కొల్లాం : కేరళలో లెఫ్ట్ డెమొక్రటిక్ ఫ్రంట్ ప్రభుత్వం విజయవంతంగా కొనసాగాలని దేశవ్యాప్తంగా ఉన్న కమ్యూనిస్టులు, వామపక్ష శ్రేణులు విప్లవాభినందనలు తెలియజేస్తున్నాయని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు అన్నారు. సిపిఎం కేరళ రాష్ట్ర మహాసభలకు హాజరైన ఆయన తనను కలిసిన మీడియాతో మాట్లాడారు. కేరళలో ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం దేశంలో కమ్యూనిస్టుల కోటగా ఇప్పటికీ నిలిచివుంది. నిలదొక్కుకోవడానికి, బలోపేతం కావడానికి ఇది పరీక్షా సమయం. కమ్యూనిస్టులు ఇతర ప్రాంతాలకు విస్తరించడానికి, అభివృద్ధి చెందడానికి స్ఫూర్తి ప్రదాతగా కేరళ ఉంది. ఇది మంచి పరిణామం. కేరళ ప్రజలు దేశానికి ఈ సందేశాన్ని ఇవ్వాలి. ఆర్ఎస్ఎస్, మతతత్వ శక్తులతోపాటు మైనారిటీ మతతత్వ శక్తులు కేరళ ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహంతో ఉన్నాయి. కేరళ ప్రజలు సెక్యులర్ వ్యవస్థను, ప్రజాస్వామ్య విలువలను ఆదరించి, కాపాడుకోవాలి. జాతీయంగా, అంతర్జాతీయంగా ఉన్న మతతత్వ శక్తులు వామపక్ష శక్తులను ఓడించాలని తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి. వామపక్షాలు, కమ్యూనిస్టులు, ముఖ్యంగా దేశవ్యాప్తంగా ఉన్న సిపిఎం శ్రేణులు ఈ పరిస్థితిని అర్థం చేసుకోవాలి. కేరళ ప్రజల పక్షాన నిలవాలి. రక్షణగా ఉండాలి. వామపక్ష ప్రభుత్వ పాలనను కొనసాగించేందుకు అండగా నిలవాలి' అని అన్నారు.

పనిగంటల పెంపు సబబు కాదు

- సమర్థత, నాణ్యత దెబ్బతింటాయి
- దేహానికి విశ్రాంతి తప్పనిసరి
- డబ్ల్యూహెచ్‌ఓ మాజీ ప్రధాన శాస్త్రవేత్త సౌమ్యా స్వామినాథన్

న్యూఢిల్లీ : దీర్ఘకాల పనిగంటలను ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) మాజీ ప్రధాన శాస్త్రవేత్త సౌమ్యా స్వామినాథన్ తీవ్రంగా వ్యతిరేకించారు. దీనివల్ల పనిలో నాణ్యత దెబ్బతింటుందని ఆమె అభిప్రాయపడ్డారు. ఎక్కువ సేపు పనిచేయాలా? వద్దా? అనేది వ్యక్తిగత విషయమని చెప్పారు. ప్రజలు తమ శరీరం చెప్పేది వినిపించుకోవాలని, ఎప్పుడు విశ్రాంతి అవసరమో గుర్తించాలని సూచించారు. దీర్ఘకాల పనిగంటలు సమర్థతను తగ్గిస్తాయని అన్నారు. సౌమ్యా స్వామినాథన్ పిటిఐ వార్తా సంస్థకు ఇంటర్వ్యూ ఇస్తూ స్వల్పకాలంలో ఎక్కువసేపు పనిచేయడం సాధ్యమేనని, కోవిడ్ సమయంలో దీనిని చూశామని చెప్పారు. అయితే దీర్ఘకాలంలో అది మంచిది కాదని అభిప్రాయపడ్డారు. ఎన్ని గంటలు పనిచేశామన్న దానిపై కాకుండా ఎంత నాణ్యతతో పనిచేశామన్న దాని పైనే ఉత్పాదకత ఆధారపడి ఉంటుందని ఆమె తెలిపారు. మానవ ఆరోగ్యంపై దీర్ఘకాల పనిగంటల ప్రభావం గురించి అడిగిన ప్రశ్నకు సౌమ్యా స్వామినాథన్ సమాధానమిస్తూ 'చాలా కష్టపడి పనిచేసే అనేక మందిని నేను చూశాను. అది వ్యక్తిగత విషయమేనని అనుకుంటాను. మీరు ఎప్పుడు అలసిపోయారో మీ శరీరం చెబుతుంది. కాబట్టి అప్పుడు మీ శరీరం చెప్పినట్లు వినాలి. మీరు కొన్ని నెలల పాటు చాలా కష్టపడి పనిచేయగలరు. కోవిడ్ సమయంలో మనమంతా అదే చేశాం కదా. కానీ దానిని సంవత్సరాల తరబడి కొనసాగించగలమా? చెప్పలేను' అని అన్నారు. 'ఆ రెండు మూడు సంవత్సరాలు కష్టపడి పనిచేశాం. ఎక్కువ సేపు నిద్ర పోలేదు. చాలా సమయం ఒత్తిడితో గడిపాం. అనేక విషయాలపై కలత చెందాం. ముఖ్యంగా ఆరోగ్య సంరక్షణ కల్పించే వారి గురించి ఆలోచించాం. వాళ్లు రాత్రింబవళ్లూ పనిచేశారు. కోవిడ్ తర్వాత చాలామంది తమ వృత్తిని వదిలేశారు. మనం ఆ విధంగా స్వల్పకాలంలో మాత్రమే కష్టపడగలం. కానీ వాస్తవానికి అది సరికాదు' అని చెప్పారు.

సుస్థిరమైన పనితీరు కనబరచాలంటే మానసిక ఆరోగ్యం, విశ్రాంతి అవసరమని భారతీయ వైద్య పరిశోధనా మండలి (ఐసిఎంఆర్) మాజీ డైరెక్టర్ జనరల్ కూడా అయిన అంతర్జాతీయ ఆరోగ్య నిపుణురాలు సౌమ్యా స్వామినాథన్ అభిప్రాయపడ్డారు. మానవ శరీరానికి నిద్ర, మానసిక ప్రశాంతత అవసరమని ఆమె తెలిపారు. 'మీరు మీ టేబుల్ ముందు 12 గంటలు కూర్చోగలరు. కానీ 8 గంటల తర్వాత నాణ్యమైన పని చేయలేరు. కాబట్టి ఈ విషయాలన్నింటినీ పరిగణనలోకి తీసుకోవాలి' అని అన్నారు.

గతంలో ఎవరేమన్నారు?

పనిగంటలపై గతంలో ఎల్ అండ్ టి ఛైర్మన్ ఎస్ఎన్ సుబ్రమణ్యన్ చర్చకు తెర తీశారు. ఉద్యోగులు ఆదివారాలు సహా వారానికి 90 గంటలు పని చేయాలని ఆయన సూచించారు. ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నారాయణ మూర్తి కూడా సుబ్రమణ్యన్ అభిప్రాయాలతో ఏకీభవించారు. ఆయన వారానికి 70 పనిగంటలను సూచించారు. 2047 నాటికి భారత్‌ను 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలంటే భారతీయులు మరింత కష్టపడి పనిచేయాలని నీతి ఆయోగ్ మాజీ సిఇఒ అమితాబ్ కాంత్ సలహా ఇచ్చారు. వారానికి 80 లేదా 90 గంటలు కానివ్వండి.... లక్ష్య సాధనకు కష్టపడి పనిచేయాల్సిందే అని చెప్పారు. పని గంటలను పెంచే ప్రతిపాదన ఏదీ లేదని కేంద్ర కార్మిక, ఉపాధి శాఖ సహాయ మంత్రి శోభా కరంద్లజే ఇటీవల పార్లమెంటుకు తెలిపారు.

ఉగ్రవాదులే హత్య చేశారు

- కతువాలో ముగ్గురి మృతిపై కేంద్ర మంత్రి

న్యూఢిల్లీ : కథువా జిల్లాలో ఇటీవల ముగ్గురు యువకుల్నీ ఉగ్రవాదులే హత్య చేశారని కేంద్ర సిబ్బంది, ప్రజా ఫిర్యాదుల శాఖ సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ తెలిపారు. కాశ్మీర్‌లో శాంతియుత వాతావరణాన్ని దెబ్బతీయడానికి కుట్ర జరుగుతుందని ఆరోపించారు. ఈ మేరకు ఆదివారం మంత్రి సోషల్ మీడియాలో పోస్టు చేశారు. కతువా జిల్లా మల్హార్ ప్రాంతంలో ఒక నదిలో శనివారం సాయంత్రం ముగ్గురి మృతదేహాలను గుర్తించారు. వీరిని యోగేష్ (32), దర్శన్ (40), వరుణ్ (14)గా కనుగొన్నారు. బిల్లావర్ సమీపంలోని దేహోటా గ్రామానికి చెందిన వీరు దేహోటా గ్రామం నుంచి సురగ్ గ్రామానికి వెళ్తుతున్న వివాహ ఊరేగింపుతో వెళ్తూ గురువారం రాత్రి 8:30 గంటల సమయంలో దారితప్పిపోయారు. సురగ్ గ్రామానికి ఊరేగింపు చేరుకున్న తరువాత ఈ విషయాన్ని ఇతరులు గుర్తించారు. శనివారం వీరి మృతదేహాలను పోలీసులు గుర్తించారు. యువకుల మృతితో బిల్లావర్ ప్రాంతంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. సబ్ జిల్లా కేంద్రం ఆసుపత్రి వద్ద మృతుల కుటుంబాలను శనివారం పరామర్శించడానికి వచ్చిన స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ రామేశ్వర్ సింగ్‌పై ఆందోళనకారులు దాడి చేశారు. భారీ ఎత్తున పోలీసు, పారా మిలటరీ బృందాలను మోహరించారు. ఈ ప్రాంతంలో పరిస్థితిని సమీక్షించడానికి కేంద్ర హోం శాఖ కార్యదర్శి స్వయంగా రానున్నట్లు కేంద్ర మంత్రి పోస్టు చేశారు.

కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థులుగా అద్దంకి దయాకర్, విజయశాంతి, శంకర్ నాయక్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణాలో ఎమ్మెల్యే కోటాలో ముగ్గురు కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థులను ఎఐసిసి ప్రకటించింది. ఈ మేరకు శనివారం ఎఐసిసి ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్ అభ్యర్థుల జాబితాను విడుదల చేశారు. నాలుగు స్థానాల్లో మూడు కాంగ్రెస్ తీసుకోగా, ఒక స్థానాన్ని సిపిఐకి కేటాయించింది. కాంగ్రెస్ అభ్యర్థులుగా టిపిసిసి ప్రధాన కార్యదర్శి అద్దంకి దయాకర్, నల్లగొండ డిసిసి అధ్యక్షులు శంకర్‌నాయక్, టిపిసిసి ప్రచార కమిటీ కో ఛైర్మన్, సీనియర్ నేత విజయశాంతి పేర్లను ప్రకటించారు. ఎమ్మెల్యే కోటాలో ఐదుగురు ఎమ్మెల్సీలకు అవకాశం ఉంది. ఈ నెల 10లోగా నామినేషన్లు దాఖలు చేయాల్సి ఉంది. ఎమ్మెల్యేల సంఖ్యా బలం ఆధారంగా నాలుగు కాంగ్రెస్‌కు, ఒకటి బిఆర్ఎస్‌కు వస్తాయి. కాంగ్రెస్‌కు ఎంఐఎంతో పాటు బిఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలు ఓట్లు వేసే అవకాశం ఉందని పార్టీ వర్గాలు అంటున్నాయి.

కాలిఫోర్నియాలో ఆలయంపై విద్వేష రాతలు

- ఖండించిన భారత్

కాలిఫోర్నియా: అమెరికా కాలిఫోర్నియాలో హిందూ ఆలయంపై దాడి జరిగింది. చినో హిల్స్‌లోని బాప్స్ స్వామినారాయణ్ మందిరంపై పెయింట్‌తో కొందరు వ్యక్తులు శనివారం విద్వేషపూరిత రాతలు రాశారు. ఆలయ అధికారులు ఎక్స్ వేదికగా ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ దుశ్చర్యను భారత ప్రభుత్వం ఖండించింది. విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ ఈమేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. 'కాలిఫోర్నియా చినో హిల్స్‌లోని హిందూ ఆలయంపై జరిగిన దాడి వార్తలను చూశాం. ఇలాంటి హేయమైన చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నాం. ఈ ఘటనకు బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని స్థానిక అధికారులను డిమాండ్ చేస్తున్నాం. అదే విధంగా ప్రార్థనా స్థలాలకు తగిన భద్రతను కల్పించాలని కోరుతున్నాం' అని జైశ్వాల్ పేర్కొన్నారు. న్యూయార్క్‌లోని భారత రాయబార కార్యాలయం ఈ సంఘటనను 'ఆమోదయోగ్యంకాదు' అని ఖండించింది.

ఎయిమ్స్‌లో ఉపరాష్ట్రపతి

న్యూఢిల్లీ: ఉపరాష్ట్రపతి జగదీప్ దన్కర్ ఎయిమ్స్‌లో చేరారు. ఉపరాష్ట్రపతి ఆరోగ్య పరిస్థితి తెలిసిన వెంటనే ప్రధాని మోడీ ఆస్పత్రికి వచ్చి.. వైద్యులను అడిగి తెలుసుకున్నట్టు మోడీ స్వయంగా 'ఎక్స్'లో పోస్టు చేశారు. దన్కర్ ఆరోగ్యంగా ఉండాలని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆదివారం తెల్లవారు జామున 2గంటల సమయంలో ఛాతిలో నొప్పి రావడంతో జగదీప్ ధన్‌ఖడ్‌ను ఆస్పత్రిలో చేర్పించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఆయన్ను ఎయిమ్స్‌లోని క్రిటికల్ కేర్ యూనిట్ (సిసియు)లో ఉంచి కార్డియాలజీ విభాగాధిపతి డాక్టర్ రాజీవ్ నారంగ్ ఆధ్వర్యంలో చికిత్స అందిస్తున్నారు. అంతకుముందు కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి జెపి నడ్డా ఆస్పత్రికి వెళ్లి ఉపరాష్ట్రపతి ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకున్నారు.

కాల్పుల విరమణ ఒప్పందంపై చర్చల కోసం నేడు కతార్‌కు ఇజ్రాయిల్ ప్రతినిధి బృందం

జెరూసలేం : గాజాలో కాల్పుల విరమణ ఒప్పందంపై చర్చించడానికి ఈ నెల 10న కతార్‌కు ఇజ్రాయిల్ ఒక ప్రతినిధి బృందాన్ని పంపనుంది. 'అమెరికా మద్దతుగల మధ్యవర్తుల ఆహ్వానాన్ని అంగీకరిస్తూ తమ బృందం కతార్‌కు వెళ్లనుంది' అని ఇజ్రాయిల్ ప్రధాని బెంజిమన్ నెతన్యాహూ కార్యాలయం ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొంది. హమాస్ ప్రతినిధి అబ్దేల్ –లతీఫ్ అల్ కనౌవా కూడా ఎటువంటి వివరాలు ప్రకటించలేదు. నిజానికి కాల్పుల విరమణపై రెండో దశ చర్చలు ఒక నెల ముందే ప్రారంభం కావాల్సి వుంది. ఇజ్రాయిల్ వైఖరి కారణంగా ఈ చర్చలు ముందుకు సాగలేదు. గత వారంలో హమాస్ వద్ద మిగిలిన ఉన్న బందీల్లో సగం మందిని విడుదల చేయాలని, దీని తరువాత కాల్పుల విరమణపై చర్చలు ప్రారంభిస్తామని ఇజ్రాయిల్ తెలిపింది. హమాస్‌పై ఒత్తిడి తీసుకుని రావడానికి గాజాకు ఎలాంటి మానవతా సాయం అందకుండా సరిహద్దులు మూసివేసింది. దీంతో ఇజ్రాయిల్‌పై తీవ్రస్థాయిలో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

న్యూయార్క్‌లో కార్చిచ్చు

- ఆకాశాన్నంటిన దట్టమైన పొగ..

న్యూయార్క్ : న్యూయార్క్‌లోని హాంప్టన్స్ సమీపంలో కార్చిచ్చు రాజుకుంది. తీవ్రమైన గాలుల కారణంగా ఆ ప్రాంతమంతా ఆకాశాన్నంటే దట్టమైన పొగ కమ్ముకుంది. మాన్‌హట్టన్‌కు తూర్పున 80 మైళ్ల దూరంలో ఉన్న లాంగ్ ఐలాండ్‌లోని పైన్ బారెన్స్‌లో పెద్ద ఎత్తున కార్చిచ్చు చెలరేగింది. పైన్ బారెన్స్ అనేది సఫోల్క్ కౌంటీలోని 105,000 ఎకరాల విస్తీర్ణంలో విస్తరించి ఉన్న అటవీ, రక్షిత ప్రాంతం. ఈ ప్రాంతంలో రేగిన కార్చిచ్చును అదుపు చేసేందుకు అగ్నిమాపక సిబ్బంది ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికే సోషల్ మీడియాలో దీనికి సంబంధించిన వీడియోలు వైరలవుతున్నాయి.

యుపిలో జర్నలిస్టు దారుణ హత్య

- హంతకుల అరెస్టుకు కుటుంబ సభ్యుల డిమాండ్
- అంత్యక్రియలకు నిరాకరణ

లక్నో : ఉత్తరప్రదేశ్‌లో మరో దారుణం జరిగింది. వాహనంతో ఢీకొట్టి.. కాల్పులు జరిపి ఓ జర్నలిస్టును గుర్తుతెలియని దుండగులు దారుణంగా కాల్చి చంపారు. ధాన్యం కొనుగోళ్లలో అవకతవకలు, భూమి కొనుగోళ్లలో స్టాంప్ డ్యూటీ ఎగవేత వంటి అంశాలపై వార్తలను రాసిన సీతాపూర్‌లో ఒక హిందీ దిన పత్రిక జర్నలిస్టు రాఘవేంద్ర బాజ్‌పేయ్ (35) ఆర్‌టిఐ కార్యకర్త కూడా. ఆయనకు శనివారం మధ్యాహ్నం 3.15 గంటల సమయంలో ఫోన్ వచ్చింది. దీంతో ఇంటి నుంచి బైక్‌పై బయలుదేరాడు. లక్నో-ఢిల్లీ జాతీయ రహదారిపై బైక్‌పై వెళ్తున్న జర్నలిస్ట్ రాఘవేంద్రను ఒక వాహనం ఢీకొట్టింది. ఆ తర్వాత అతడిపై మూడు రౌండ్ల కాల్పులు జరిగాయి. రక్తం మడుగులో పడి ఉన్న రాఘవేంద్ర రోడ్డు ప్రమాదానికి గురై మరణించినట్టుగా తొలుత పోలీసులు భావించారు. మృతదేహాన్ని జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించగా అతడి శరీరంలో నాలుగు తూటాలున్నట్టు డాక్టర్లు గుర్తించారు. దీంతో జర్నలిస్ట్ రాఘవేంద్రను హత్య చేసినట్టు పోలీసులు నిర్ధారించారు. హత్య అభియోగాలపై గుర్తు తెలియని వ్యక్తులపై ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు లక్నో రేంజ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ప్రశాంత్ కుమార్ తెలిపారు. నిందితులను అరెస్ట్ చేసేందుకు నాలుగు బృందాలను ఏర్పాటు చేశామన్నారు. రాఘవేంద్ర కాల్ రికార్డులను పరిశీలిస్తున్నామని, సెల్‌ఫోన్‌ను ఫోరెన్సిక్ విశ్లేషణ కోసం పంపామని చెప్పారు. పోస్టుమార్టం తరువాత రాఘవేంద్ర మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. హంతకుల్ని అరెస్టు చేసేవరకూ అంత్యక్రియలు చేయడానికి బంధువులు నిరాకరిస్తుండగా, అధికారులు ఒత్తిడి తీసుకొస్తున్నట్టు తెలిసింది. రాఘవేంద్ర కుటుంబానికి పరిహారం ఇవ్వాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

సీతాపూర్‌లోని మహోలి ప్రాంతంలో వ్యవసాయాధార కుటుంబానికి చెందిన బాజ్‌పేయ్ పదేళ్లుగా జర్నలిస్టుగా పని చేస్తున్నారు. ఆయనకు భార్య, ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారు. బాజ్‌పేయ్ అన్నయ్య 15 ఏళ్ల క్రితం రోడ్డు ప్రమాదంలో మరణించడంతో తల్లిదండ్రులకు కూడా ఆయనే ఆధారం. స్థానిక అక్రమార్కులకు వ్యతిరేకంగా వార్తలు రాస్తున్నందుకే బాజ్‌పేయ్‌ను హత్య చేశారని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నాటో నుంచి అమెరికా నిష్క్రమించాలి : ఎలన్ మస్క్

వాషింగ్టన్ : నార్త్ అట్లాంటిక్ ట్రీటీ ఆర్గనైజేషన్ (ఎన్ఏటీఓ) కూటమిపై ప్రపంచ కుబేరుడు ఎలన్ మస్క్ కీలక వ్యాఖ్యలు చేశారు. నాటో కూటమి నుంచి నిష్క్రమించాలని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ సీనియర్ సలహాదారు మైక్ లీ సోషల్ మీడియా వేదికగా చేసిన పోస్ట్‌కు మస్క్ మద్దతుపలికారు. వెంటనే అగ్రరాజ్యం నాటో, ఐక్యరాజ్య సమితి నుంచి నిష్క్రమించాలని కోరారు. ఐరోపా దేశాల రక్షణ కోసం యూఎస్ డబ్బులు చెల్లించడం ఏమాత్రం సమంజసమైన విషయం కాదని పేర్కొన్నారు.

ఇప్పటికే నాటో భవిష్యత్తుపై ఆ దేశాల్లో సందిగ్ధత కొనసాగుతున్న నేపథ్యంలో మస్క్ వ్యాఖ్యలు పలు ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. గతంలో నాటో దేశాల్లో నిధుల కేటాయింపుపై ట్రంప్ మాట్లాడుతూ..కూటమిలో నిర్ణయించిన విధంగా అన్ని దేశాలు రక్షణ వ్యవస్థ బలోపేతానికి తమ జీడీపీ నుంచి తగిన మొత్తంలో నిధులు కేటాయించాలన్నారు. నాటోలోని ఇతర దేశాలు తమ వంతు నిధులను కేటాయించకపోతే తమ రక్షణ దళాలను వెనక్కి తీసుకుంటామని హెచ్చరించారు.

కాగా రక్షణ వ్యయాన్ని భారీగా పెంచే ఉద్దేశంతో ఈయూ దేశాలు గత వారం బ్రస్సెల్స్‌లో అత్యవసర శిఖరాగ్ర సమావేశం నిర్వహించాయి. తమ రక్షణ వ్యవస్థలను బలోపేతం చేసుకునేందుకు 800 బిలియన్ యూరోల (841 బిలియన్ డాలర్ల)తో ప్రణాళిక ప్రతిపాదించాయి. రక్షణ కోసం సభ్య దేశాలకు 162.5 బిలియన్ డాలర్ల రుణాలను అందించే యూరోపియన్ కమిషన్ ప్రతిపాదనపై చర్చించాయి. తాజాగా ఉక్రెయిన్ పట్ల అమెరికా తీరు ఐరోపా దేశాల్లో ఆందోళనను రేకెత్తిస్తోంది. అసలు యూఎస్ వ్యూహం ఏమిటో ఇప్పటికీ స్పష్టంగా తెలియట్లేదని ఈయూ రక్షణ కమిషనర్ ఆండ్రియస్ కుబిలియస్ అన్నారు.

అంగన్‌వాడీలపై నిర్బంధం

- కొందరి హౌస్ అరెస్టు
- పోలీస్ స్టేషన్‌కు మరికొందరి తరలింపు
- నేటి విజయవాడ మహాధర్నాను భగ్నం చేసేందుకు ప్రభుత్వ యత్నం

ప్రజాశక్తి- యంత్రాంగం

తమ సమస్యల పరిష్కారానికి అంగన్‌వాడీలు విజయవాడలో సోమవారం తలపెట్టిన మహాధర్నాను భగ్నం చేసేందుకు ప్రభుత్వం నిర్బంధం ప్రయోగించింది. పలువురి అంగన్‌వాడీలను పోలీసులు గృహ నిర్బంధం చేశారు. విజయవాడ బయలుదేరిన కొంతమందిని ఎక్కడికక్కడ అడ్డుకున్నారు. మరి కొంతమందిని అరెస్టు చేసి వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు. ఈ చర్యలను అంగన్‌వాడీ యూనియన్లు, సిఐటియు ఖండించాయి. ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్ యూనియన్ విజయనగరం జిల్లా అధ్యక్షులు బి.పైడిరాజును విజయనగరంలోనూ, జిల్లా కమిటీ సభ్యులు కె.తులసిని కొత్తవలసలోనూ పోలీసులు గృహ నిర్బంధం చేశారు. వైఎస్ఆర్ జిల్లా నుంచి విజయవాడ బయల్దేరిన 41 మంది అంగన్‌వాడీలను కడప, మైదుకూరు రైల్వేస్టేషన్లలో పోలీసులు అడ్డుకున్నారు. వారిలో 20 మందిని కడప, 21 మందిని మైదుకూరు పోలీస్ స్టేషన్లకు తరలించి నిర్బంధించారు. పార్వతీపురం మన్యం జిల్లా కొమరాడ మండలం గుమడ రైల్వేస్టేషన్ వద్ద ఏడుగురు అంగన్‌వాడీ కార్యకర్తలను, సిఐటియు నాయకుడు కె.సాంబమూర్తిని పోలీసులు అడ్డుకున్నారు. నిడగల్లులో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జ్యోతిలక్ష్మిని, మక్కువలో అంగన్‌వాడీ మండల నాయకులు దాలమ్మను గృహ నిర్బంధం చేశారు. విజయవాడకు వెళ్తున్న అంగన్‌వాడీలను అల్లూరి జిల్లా గంగవరం మండల కేంద్రంలో పోలీసులు అడ్డుకున్నారు. కొందరిని హౌస్ అరెస్టు చేశారు. చిత్తూరు జిల్లా నుంచి బయలుదేరుతున్న కార్వేటినగరం ప్రాజెక్టు అధ్యక్షులు విజయను పోలీసులు గృహ నిర్బంధం చేశారు. తిరుపతి జిల్లా పుత్తూరులో అంగన్‌వాడీలకు, సిఐటియు నాయకులకు నోటీసులు నోటీసులు ఇచ్చి వారిని హౌస్ అరెస్టు చేశారు.

అనంతపురం నుంచి రైలులో వస్తున్న అంగన్‌వాడీల బోగీలో వెళ్లి మహిళలను వీడియో తీస్తున్న మగ పోలీసు. మహిళలను ఎలా వీడియో తీస్తారంటూ అంగన్‌వాడీలు అభ్యంతరం చెప్పినా సదరు పోలీసు అధికారి చిత్రీకరణ కొనసాగించారు.

అరెస్టులకు ఖండన

సమస్యల పరిష్కారానికి శాంతియుతంగా తలపెట్టిన మహాధర్నాను భగ్నం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం పోలీసులతో అంగన్‌వాడీలను అక్రమంగా అరెస్టు చేయించడాన్ని తీవ్రంగా ఖండిస్తునట్లు సిఐటియు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎవి నాగేశ్వరరావు, సిహెచ్ నర్సింగరావు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మహాధర్నాను అడ్డుకోవాలని చూడడం సరైంది కాదని తెలిపారు. నిర్బంధ చర్యలను టిడిపి కూటమి ప్రభుత్వం ఆపాలని డిమాండ్ చేశారు. బడ్జెట్ సమావేశాల సందర్భంగా ధర్నా చేసేందుకు తాము ఇప్పటికే అనుమతి కోరామని కె.సుబ్బరావమ్మ (ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్), జె లలిత (ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్), విఆర్ జ్యోతి (ఎపి ప్రగతిశీల అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్) తెలిపారు. నిర్బంధ చర్యలను ప్రభుత్వం ఆపి మహాధర్నాకు అనుమతి ఇవ్వాలని కోరారు.

నేడు మహాధర్నా

పోలీసుల నిర్బంధం అడుగడుగునా కొనసాగినా..అంగన్వాడీల మహాధర్నా సోమవారం ఉదయం 10.30 విజయవాడలోని ధర్నా చౌక్‌లో ప్రారంభమవుతుందని సిఐటియు, ఏఐటియుసి, ఐఎఫ్‌టియు అంగన్వాడీ అనుబంధ సంఘాలు ఆదివారం ప్రకటించాయి. వేతనాలు పెంచాలని, గ్రాట్యుటీ ఉత్తర్వులు సవరించడం, మిని సెంటర్లు మెయిన్ సెంటర్లుగా మారుస్తూ ఉత్తర్వులు జారీ, 42 రోజుల సమ్మెకాలపు ఒప్పందాలు అమలు చేయాలని, తదితర డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ఈ మహాధర్నా చేపట్టినట్లు ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర కార్యదర్శి సుబ్బరావమ్మ, ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ (ఏఐటియుసి) రాష్ట్ర కార్యదర్శి జె.లలితమ్మ, ఎపి ప్రగతిశీల అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (ఐఎఫ్‌టియు) రాష్ట్ర కార్యదర్శి వి.ఆర్.జ్యోతి సంయుక్తంగా ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

మీకోసం

చింతపండు ఎక్కువ రోజులు తాజాగా ఉండాలంటే అది నిల్వ చేసే డబ్బాలో రాళ్ల ఉప్పు వేయాలి.

జీవన సౌరభం

శ్రమ శక్తి ఈ ప్రపంచంలో చాలా ఉన్నతమైనది. దాన్ని జయించే శక్తి మరే శక్తికీ లేదు.

మొక్క తెచ్చిన మార్పు

రాలుగాయి పిల్లవాడు
రాముడనే ఒక బాలుడు
ఆటలకూ అల్లరికీ
ముందుండే కొంటెవాడు

చిన్నపిల్లలను గిల్లుట
తోటి బాలలను కొట్టుట
అలవాటుగ మారిపోయె
తగాదాలు పడుచుండుట

దండనతో మారడాయె
గురువులింక విసిగిపోయె
తండ్రికి విషయము చెప్పగ
అతడేమో తెల్లబోయె

కన్న తండ్రి దిగులుపడెను
తన తండ్రికి చెప్పుకొనెను
కొడుకు యొక్క దుడుకుతనము
అదుపులోన పెట్టమనెను

తాత మనవడిని పిలిచెను
విత్తనాలు అందించెను
ఓపిక తగ్గెను తనకని
అబద్ధాలనూ పలికెను

విత్తనాలు చల్లించెను
తగునీటిని పోయించెను
ప్రతి దినమూ ఉదయమునే
గమనించుట మరువకనెను

ఒకనాడా విత్తులన్ని
మొలకలుగా
మారెనన్ని
సంబరాన
గంతులేసి
చల్లె గింజలింక
కొన్ని

గట్టి గింజ మొలకెత్తుట
నేల పొరలు చీల్చుకొనుట
రాముకెంతొ వింతగొలిపె
మొదలుపెట్టె ఇష్టపడుట

చిన్ని చిన్ని మొలకలుగా
పెరగసాగె ముచ్చటగా
మారాకులు తొడగసాగె
దినదినమూ దివ్యముగా

ఒకనాడొక పరీక్షలో
రాము ప్రథమ స్థానంలో..
గేటు వేయడం మరిచెను
వార్త చెప్ప తొందరలో

అయ్యో! ఒక మేక వచ్చి
పెరటిలోకి చొచ్చుకొచ్చి
మొక్కలన్ని మెక్కసాగె
ఆనందం ముంచుకొచ్చి

రాము గుండెలవిసిపోయె
బావురుమని కూలిపోయె
ప్రాణంలా పెంచుకున్న
మొక్కలన్ని చచ్చిపోయె

మరుసటిరోజున రాముడు
దురుసుతనము చూపలేదు
ఎత్తిన చేతిని దించెను
మొక్క వలెనె కద మిత్రుడు

తాను మొక్క పెంచినట్లు
ప్రాణముగా చూచినట్లు
ఏ తల్లయినా బిడ్డను
ప్రేమగాను సాకునట్లు

ప్రాణుల బాధించరాదు
తల్లులనేడ్పించరాదు
ప్రకృతినీ, ప్రాణులనూ
ప్రేమించుట మరువరాదు

– గుడిపూడి రాధికారాణి,
మచిలీపట్నం.

నేను గీసిన బొమ్మ



నారంశెట్టి వైభవ్,
2వ తరగతి,
శ్వేతచలపతి ఇంగ్లీషు
మీడియం స్కూల్,
బొబ్బిలి, విజయనగరం.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

వేసవి వేళ ఎన్నో పానీయాలు...

ఎండాకాలం క్రమంగా పెరుగుతోంది. విపరీతమైన చెమట కారణంగా డీహైడ్రేషన్ సమస్య ఎక్కువగా ఉంటోంది. అలసట కూడా వస్తుంది. రోగ నిరోధక వ్యవస్థ మాదిరిగానే పొట్టలో కూడా అనేక మార్పులు చోటుచేసుకుంటాయి. ఫలితంగా జీర్ణక్రియ సమస్యలు ఎక్కువవుతుంటాయి. ప్రధానంగా అతిసారం, ఎసిడిటీ, కడుపు ఉబ్బరం, గ్యాస్, మలబద్ధకం వంటి జీర్ణక్రియ సమస్యలు పెరుగుతుంటాయి. ఈ సమస్యలకు ముగింపు పలకాలన్నా, కడుపును శాంతపర్చటానికి పొట్టను చల్లబర్చే ఆహారం తినటం చాలా ముఖ్యం. కడుపును చల్లగా ఉంచే పానీయాలు సేవించటం మరింత ఉత్తమం కూడాను. శరీరానికి ఎండల నుంచి ఉపశమనం కోసం ఈకాలంలో లభించే పండ్లు, పండ్ల రసాలు తీసుకుంటే ఎంతోకొంత ఉపశమనం పొందొచ్చు. సీజనల్‌లో దొరికే పండ్లను తీసుకోవటం ద్వారా శరీరానికి మరింత శక్తి ఒనగూరుతుంది. పండ్లుగా తినటమే కాకుండా రసాలు (జ్యూసులు)గా కూడా వీటిని తీసుకుంటే చక్కటి ఆరోగ్యం సొంతమవుతుంది. బొప్పాయి, జామ, ఆపిల్, ద్రాక్ష, మామిడి, పుచ్చకాయ వంటివి మార్కెట్లో ప్రస్తుతం విరివిగా దొరుకుతున్నాయి. పండ్లలో బెటాకెరోటీన్, యాంటీ ఆక్సిడెంట్స్, విటమిన్–సి, పొటాషియం, విటమిన్–బి కలిగివుండటం వల్ల శరీరానికి కావాల్సిన వ్యాధి నిరోధక శక్తి సమకూరుతుంది. మంచి ఆరోగ్యానికి కూడా ఇవి దోహదపడతాయి. పుల్లని నిమ్మ, నారింజ పండ్లలో విటమిన్–సి అధికంగా ఉంటుంది. పండ్లుగానూ, జ్యూస్‌లుగానూ కూడా వీటిని తీసుకోవచ్చు. జ్యూస్ కన్నా పండ్లను నేరుగా తీసుకోవటం మంచిది. పండ్లలో ఎక్కువశాతం విటమిన్లు, మినరల్స్, ఫైబర్లు, ఫ్లావనోయిడ్స్ ఉంటాయి. జ్యూస్ చేసేటప్పుడు తొక్కను తీసేస్తుంటాం. అలాంటప్పుడు వాటిలో ఉండే ఫైబర్, మినరల్స్, విటమిన్స్ తగ్గిపోతాయి. పండ్లను తీసుకోవటం ద్వారా శరీరంలో షుగర్ శాతం పెరుగకుండా ఉంటుంది. పీచు శాతం ఎక్కువగా ఉండటంతో జీర్ణక్రియ నెమ్మదిగా జరిగి గ్యాస్టిక్ తగ్గిస్తుంది. పండ్ల రసాల్లో పీచుపదార్థం లేకపోవటంతో త్వరగా జీర్ణం అయ్యి, రక్తంలోని షుగర్ లెవల్స్ పెరుగుతాయి. పండ్ల రసం కన్నా పండ్ల వల్ల వచ్చే కేలరీలు తక్కువగా ఉంటాయి. జ్యూస్‌లో వాడే చక్కెర వల్ల కేలరీలు పెరిగి, అధిక బరువు పెరిగే ప్రమాదం ఉంటుంది. పిల్లలకు జ్యూస్‌లను అలవాటు చేయటం వల్ల ఊబకాయం వచ్చే అవకాశం ఉంటుంది. పండ్లలో యాంటీ ఆక్సిడెంట్స్, ఫాయిటో

స్టెరోల్స్, ఫ్లావనోయిడ్స్ వంటివి శరీర ఆరోగ్యానికి కూడా దోహదపడతాయి. అదే జ్యూస్ అయితే ఈ ఫాయిటోకెమికల్స్ పండ్ల తొక్కలోనే ఉండిపోతాయి.

కొన్ని పానీయాల గురించి తెలుసుకుందాం

మజ్జిగ : వేసవి పానీయాల్లో మొదటిగా చెప్పుకునేది మజ్జిగ గురించే. శరీరాన్ని ఎండల నుంచి కాపాడి వడదెబ్బ నుంచి రక్షిస్తుంది. ఆరోగ్యానికి చాలా మంచిది. ఇందులో ప్రోబయాటిక్స్ ఎక్కువగా ఉండి ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. జీర్ణ సంబంధిత సమస్యలను దూరం చేస్తాయి. క్యాల్షియం,ప్రొటీన్, బి 12 వంటి విటమిన్లు పుష్కలంగా ఉన్నాయి. ప్రతిరోజూ కనీసం ఒక్క గ్లాసైనా తాగాల్సిందే.

కొబ్బరి బోండాం : సమ్మర్‌లో మరో హెల్దీ డ్రింక్‌గా కొబ్బరిబోండాంను చెబుతుంటారు. వేసవి తాపాన్ని తట్టుకోవటానికి రోజుకు ఒక గ్లాస్ కొబ్బరినీటిని తీసుకుంటే మంచిది. దీనివల్ల అందులోని ఎలక్ట్రోలైట్స్ మన శరీరానికి అందుతాయి. మూత్ర విసర్జన సమయంలో వచ్చే మంట వంటి సమస్యలు పోతాయి. శరీరాన్ని చల్లబరుస్తాయి. ఈ కాలంలో తరచూ కొబ్బరినీటిని తాగటం ఎంతో మంచిది. ఒక గ్లాసు కొబ్బరి నీటిలో 9 శాతం ఫైబర్ ఉంటుంది. జీర్ణ వ్యవస్థ మెరుగుపడుతుంది. ఎసిడిటీ వేధిస్తుంటే గ్లాసు కొబ్బరినీళ్లు తాగితే ఉపశమనం లభిస్తుంది.

చెరకు రసం : చెరకును ముక్కలుగా కట్ చేసి నమలొచ్చు. మిషన్ ద్వారా చెరకు రసం కూడా తీసి తాగొచ్చు. దీనిని తీసుకోవటం వల్ల తక్షణ శక్తి లభిస్తుంది. వేడికారణంగా అలసిన శరీరానికి దీనివల్ల ఉపశమనం లభిస్తుంది. చెరకు రసాన్ని కూడా బెస్ట్ సమ్మర్ డ్రింక్‌గా చెబుతారు. అలసట, నిస్సత్తువ మాయమవుతాయి. శరీరాన్ని రీ హైడ్రేట్ చేస్తుంది. ఇందులో సమృద్ధిగా ఉన్న ఫైబర్ జీర్ణక్రియకు మేలు చేస్తుంది. మలబద్ధకం వంటి సమస్యలు పోతాయి.

పుచ్చకాయ : వేసవిలో శరీరానికి ఉపశమనం కల్పించేవాటిలో పుచ్చకాయలు కూడా కీలకపాత్ర పోషిస్తాయి. ఇందులో నీటిశాతం చాలా ఎక్కువగా ఉంటుంది. దీనిని తినటం వల్ల డీహైడ్రేషన్ సమస్య తగ్గుతుంది. కాయను ముక్కలుగా చేసి తినొచ్చు. లేదా డ్రింక్‌గా తయారుచేసుకుని తాగొచ్చు. వేసవిలో దీనిని బెస్ట్ సమ్మర్ డ్రింక్‌గా పిలుస్తుంటారు.

పచ్చి మామిడి రసం : పచ్చిమామిడిని కూడా ముక్కలుగా కోసి తినొచ్చు. లేదా మిక్సీలో వేసి రసంలా చేసి తాగొచ్చు. ఇది కూడా వేసవి తాపాన్ని తగ్గించేసి శరీరానికి శక్తినిస్తుంది. దీనివల్ల హైడ్రేట్‌గా కూడా ఉండొచ్చు. టిఫిన్ లేదా భోజనం ఒకవేళ ఆలస్యమైనా రోజంతా అలసట రాకుండా ఉంటుంది. ప్రస్తుతం తోతాపురి, చిన్నరసాలు, బంగినపల్లి మామిడి కాయలు మార్కెట్లోకి వస్తున్నాయి.

కోల్డ్ కాఫీ, టీ: చాలామంది ప్రతిరోజూ కాఫీ తాగుతుంటారు. ప్రతిసారీ హాట్ కాఫీ తాగేబదులుగా ఈ సీజన్‌కు తగ్గట్టుగా కోల్డ్ కాఫీ తాగటం కూడా మంచిదే. మనసు ప్రశాంతంగా హాయిగా ఉంటుంది. టీ కూడా అంతే. చల్లగా కూడా తీసుకోవచ్చు. పాలు లేకుండా డికాషన్‌లో నిమ్మరసం వేసి దానిని చల్లబరిచి తీసుకోవచ్చు. తద్వారా అలసట కూడా తగ్గుతుంది.

లస్సీ : పెరుగుతో చేసిన లస్సీ కూడా మంచి రీఫ్రెషింగ్ డ్రింక్‌గా చెబుతారు. దీనిని తీసుకోవటం వల్ల శరీరం చల్లబడుతుంది. ఎంత వేడిగా ఉన్నా కాస్తా లస్సీ తాగితే చాలా రిలాక్స్‌గా ఉంటుంది. పడుకునే ముందు పటిక బెల్లం వేసిన పాలు తాగితే చాలా మంచిది. ఇది శరీరాన్ని చల్లబరుస్తుంది. మంచి నిద్రకు సహాయపడుతుంది.



నిమ్మనీరు : ఎండాకాలంలో తప్పకుండా తాగాల్సిన నీరు నిమ్మరసం. ఈ రసాన్ని నీటిలో పిండి కొద్దిగా ఉప్పు, కొద్దిగా పంచదార వేసి షర్బత్‌లా తీసుకోవచ్చు. చక్కటి ఉపశమనం శరీరానికి వస్తుంది. మనం తీసుకునే ఆహారం జీర్ణం కావటానికి నిమ్మరసంలోని యాసిడ్స్ తోడ్పడతాయి.ఎసిడిటీ, కడుపుబ్బరం వంటి జీర్ణ సమస్యలు రావు. ఒంట్లో నీటిశాతం పడిపోకుండా రోజూ ఉదయాన్నే నిమ్మరసం తాగటం అలవాటు చేసుకోవాలి. సబ్జాగింజలు నానబెట్టిన నీటిలో నిమ్మరసం పిండి తీసుకుంటే ఇంకా మంచిది. ఈ డ్రింక్ శరీరంలో ఎలక్ట్రోలైట్లను సమతుల్యం చేస్తుంది.

ఫైనల్లోనూ అదే జోరు

- మూడోసారి ఛాంపియన్స్ ట్రోఫీని ముద్దాడిన టీమిండియా
- టీమిండియాపై ప్రశంసల జల్లు
- రెండో ఐసిసి ట్రోఫీతో రోహిత్ రికార్డు

దుబాయ్: ఐసిసి ఛాంపియన్స్ ట్రోఫీలో టీమిండియా అద్భుత ప్రదర్శనతో ముగించింది. టోర్నీ ఆరంభం నుంచి ఓటమి ఎరుగని రోహిత్ సేన ఫైనల్లోనూ అదే జోరును ప్రదర్శించి టైటిల్‌ను కైవసం చేసుకుంది. ఆదివారం జరిగిన ఫైనల్లో టీమిండియా నాలుగు వికెట్ల తేడాతో న్యూజిలాండ్‌పై ఘన విజయం సాధించింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన కివీస్ నిర్ణీత 50ఓవర్లలో 251పరుగులు చేయగా.. ఆ లక్ష్యాన్ని టీమిండియా 49ఓవర్లలో 6వికెట్లు కోల్పోయి ఛేదించింది. రోహిత్ శర్మ(76) కెప్టెన్సీ ఇన్నింగ్స్‌కి తోడు శుభ్‌మన్(31), శ్రేయస్(48), అక్షర్(29), కేఎల్ రాహుల్(34నాటౌట్), హార్దిక్(18) టీమిండియా గెలుపులో కీలకపాత్ర పోషించారు. అంతకుముందు టాస్ గెలిచి తొలిగా బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్‌కు శుభారంభం లభించింది. తొలి వికెట్‌కు యంగ్, రచిన్ రవీంద్ర అర్ధసెంచరీ భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. ఓపెనర్ విల్ యంగ్(15) వరుణ్ చక్రవర్తి బౌలింగ్‌లో ఎల్‌బి కావడంతో న్యూజిలాండ్ తొలి వికెట్ కోల్పోయింది. కుల్దీప్ యాదవ్ బౌలింగ్‌లో రచిన్ రవీంద్ర బౌల్డ్ కావడంతో ఓపెనర్లు ఇద్దరూ ఔటయ్యారు. వన్‌డౌన్ బ్యాటర్‌గా వచ్చిన కేన్ విలియమ్సన్ క్రీజ్‌లో నిలబడలేకపోయాడు. కుల్దీప్ యాదవ్ బౌలింగ్‌లోనే రిటర్న్ క్యాచ్ ఇచ్చి కేన్ విలియమ్సన్ పెవిలియన్ దారి పట్టాడు. అప్పటికి కివీస్ మూడు వికెట్లు కోల్పోయి 75 పరుగులు చేసింది. కేన్ విలియమ్సన్ స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చిన వికెట్ కీపర్ టామ్ లాథమ్‌ను రవీంద్ర జడేజా ఎల్బీడబ్ల్యూ చేయడంతో 108 పరుగులకే నాలుగు వికెట్లు కోల్పోయింది. ఈ తరుణంలో డెరిల్ మిచెల్, గ్లెన్ ఫిలిప్స్ నెమ్మదిగా ఆడుతూ జట్టు స్కోర్ పెంచేందుకు ప్రయత్నించారు. ఐదో వికెట్ భాగస్వామ్యానికి 50 పరుగులు జత చేసిన తర్వాత గ్లెన్ ఫిలిప్స్ .. వరుణ్ చక్రవర్తి బౌలింగ్‌లో బౌల్డయి పెవిలియన్ బాట పట్టాడు. గ్లెన్ ఫిలిప్స్‌తో కలిసి డెరిల్ మిచెల్ వడివడిగా ఆడుతూ దూసుకెళ్లారు. డెరిల్ మిచెల్ అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్న తర్వాత దూకుడుగా స్కోర్ పెంచడానికి ప్రయత్నించాడు. షమీ బౌలింగ్‌లో కవర్‌లో రోహిత్ శర్మకు క్యాచ్ ఇచ్చి 63 పరుగుల వద్ద డెరిల్ మిచెల్ పెవిలియన్ దారిపట్టాడు. ఫిలిప్స్ తర్వాత బ్యాటింగ్‌కు వచ్చిన మిచెల్ బ్రేస్‌వెల్ దూకుడుగా ఆడుతూ 53 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. మిచెల్ శాంత్నర్‌ను కోహ్లీ, కేఎల్ రాహుల్ రనౌట్ చేశారు. దీంతో నిర్ణీత 50 ఓవర్లలో న్యూజిలాండ్ ఏడు వికెట్లు కోల్పోయి 251 పరుగులు చేసింది.

రోహిత్ రికార్డు...

ఐసిసి ఛాంపియన్స్ ట్రోఫీని ముద్దాడిన టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ రికార్డు పుటల్లోకెక్కాడు. గత ఏడాది టి20 ప్రపంచకప్‌ను అందించిన రోహిత్.. 2025 ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్లోనూ కెప్టెన్సీ ఇన్నింగ్స్‌తో అదరగొట్టాడు. 83బంతుల్లో 7ఫోర్లు, 3సిక్సర్ల సాయంతో 78పరుగులు చేసి ఈ ఏడాది ఆరంభంలోనే టీమిండియాకు రెండో ఐసిసి ట్రోఫీని అందించాడు.

స్కోర్‌బోర్డు...

న్యూజిలాండ్ ఇన్నింగ్స్: యంగ్ (ఎల్‌బి)వరుణ్ చక్రవర్తి 15, రచిన్ రవీంద్ర (బి)కుల్దీప్ 37, విలియమ్సన్ (సి అండ్ బి)కుల్దీప్ 11, మిఛెల్ (సి)రోహిత్ (బి)షమీ 63, లాథమ్ (ఎల్‌బి)జడేజా 14, ఫిలిప్స్ (బి)వరుణ్ చక్రవర్తి 34, బ్రాస్‌వెల్ (నాటౌట్) 53, సాంట్నర్ (రనౌట్)కోహ్లి/రాహుల్ 8, స్మిత్ (నాటౌట్) 0, అదనం 16. (50ఓవర్లలో 7వికెట్ల నష్టానికి) 251పరుగులు. **వికెట్ల పతనం:** 1/57, 2/69, 3/75, 4/108, 5/165, 6/211, 7/239 **బౌలింగ్:** షమీ 9-0-74-1, హార్దిక్ పాండ్యా 3-0-30-0, వరుణ్ చక్రవర్తి 10-0-45-2, కుల్దీప్ 10-0-40-2, అక్షర్ పటేల్ 8-0-29-0, జడేజా 10-0-30-1.

ఇండియా ఇన్నింగ్స్: రోహిత్ శర్మ (స్టంప్)లాథమ్ (బి)రచిన్ రవీంద్ర 76, శుభ్‌మన్ (సి)ఫిలిప్స్ (బి)సాంట్నర్ 31, కోహ్లి (ఎల్‌బి)బ్రాస్‌వెల్ 1, శ్రేయస్ (సి)రచిన్ రవీంద్ర (బి)సాంట్నర్ 48, అక్షర్ పటేల్ (సి)రూర్కే (బి)బ్రాస్‌వెల్ 29, కెఎల్ రాహుల్ (నాటౌట్) 34, హార్దిక్ పాండ్యా (సి అండ్ బి)జేమీసన్ 18, జడేజా (నాటౌట్) 9, అదనం 8. (49ఓవర్లలో 6వికెట్ల నష్టానికి) 254పరుగులు. **వికెట్ల పతనం:** 1/105, 2/106, 3/122, 4/183, 5/203, 6/241 **బౌలింగ్:** జామిసన్ 5-0-24-1, రూర్కే 7-0-56-0, స్మిత్ 2-0-22-0, సాంట్నర్ 10-0-46-2, రచిన్ రవీంద్ర 10-1-47-1, బ్రాస్‌వెల్ 10-1-28-2, ఫిలిప్స్ 5-0-31-0.

ఛాంపియన్స్ ట్రోఫీ విజేతలు...

1998 : దక్షిణాఫ్రికా(వెస్టిండీస్‌పై 4వికెట్ల తేడాతో)
2000 : న్యూజిలాండ్(భారత్‌పై 4వికెట్ల తేడాతో)
2002 : ఇండియా – శ్రీలంక(సంయుక్త విజేత)
2004 : వెస్టిండీస్ (ఇంగ్లండ్‌పై 2వికెట్ల తేడాతో)
2006 : ఆస్ట్రేలియా (వెస్టిండీస్‌పై 8వికెట్ల తేడాతో)
2009 : ఆస్ట్రేలియా (న్యూజిలాండ్‌పై 6వికెట్ల తేడాతో)
2013 : ఇండియా (ఇంగ్లండ్‌పై 5పరుగుల తేడాతో)
2017 : పాకిస్తాన్ (ఇండియాపై 180పరుగుల తేడాతో)
2025 : ఇండియా (న్యూజిలాండ్‌పై నాలుగు వికెట్ల తేడాతో గెలుపు)

అభినందనల వెల్లువ

ఛాంపియన్స్ ట్రోఫీని కైవసం చేసుకున్న టీమిండియాకు అభినందనలు వెల్లువెత్తాయి. భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ట్విటర్(ఎక్స్)లో 'ఐసిసి ఛాంపియన్స్ ట్రోఫీని మూడు సార్లు గెలిచిన ఏకైక జట్టుగా భారత్ నిలిచింది. టీమిండియాకు శుభాకాంక్షలు' అని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోడీ 'అసాధారణ మ్యాచ్.. అపూర్వ విజయం' అంటూ పేర్కొనగా.. 'స్మాషింగ్ విక్టరీ'.. భారత జట్టులోని ప్రతి ఒక్కరూ కోట్లాది మంది హృదయాలను గర్వంతో ఉప్పొంగేలా చేశారని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా చరిత్ర సృష్టించిన విజయమిది, దేశం గర్వపడేలా చేశారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు 'ఎక్స్' వేదికగా దేశాన్ని గర్వపడేలా చేసిన భారత క్రికెట్ జట్టు కృషి, అంకితభావాన్ని కొనియాడుతూ అభినందనలు తెలిపారు. సిరీస్ అంతటా అసాధారణ ప్రతిభను టీమ్ ఇండియా ప్రదర్శించిందని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు అందుకోవాలని ఆకాంక్షించారు. ఈ విజయం దేశానికి గర్వకారణమని వైసిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి తెలిపారు. రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఫైనల్ మ్యాచ్‌లో కివీస్‌పై భారత జట్టు విజయం దేశం గర్వించదగ్గ విషయమన్నారు. రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ఈ విజయంలో స్పిన్నర్లది కీలకపాత్రగా పేర్కొన్నారు. మూడవ సారి ఛాంపియన్స్ ట్రోపి గెలిచిన భారత జట్టుకు అభినందనలు తెలిపారు. బ్యాటింగ్, బౌలింగ్‌లో రాణించి టీమ్ ఇండియా అద్భుత విజయం సాధించిందని పిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిల పేర్కొన్నారు.

NPPA
AFFORDABLE MEDICINES FOR ALL
सभी के लिए वहनीय दवाईयाँ
Government of India

ఔషధ కొనుగోలుదారు నుండి విక్రేత వరకు
అందరికీ ఇది తప్పనిసరి
ఫార్మా సహీ ధామ్ యాప్

ఔషధ కొనుగోలుదారులు
ఔషధ ధరలను తక్షణమే ధృవీకరించండి
మరింత ఆదా చేయడానికి ప్రత్యామ్నాయాలను కనుగొనండి
పూర్తి కూర్పు వివరాలను పొందండి
అధిక ధరలు, కొరత మొదలైన వాటి గురించి ఫిర్యాదులను నమోదు చేయండి



ఔషధ సరఫరాదారులు
ప్రభుత్వ నిబంధనలు & ధరల పరిమితుల గురించి అప్‌డేట్‌గా ఉండండి
పారదర్శక ధరలను నిర్ధారించడం ద్వారా నమ్మకాన్ని పెంచుకోండి
ధరలపై కస్టమర్లకు అవగాహన కల్పించండి
వాట్సప్ & మరిన్నింటి ద్వారా ఔషధ సమాచారాన్ని సజావుగా పంచుకోండి

యూజర్-ఫ్రెండ్లీ ఇంటర్‌ఫేస్ మరియు హిందీ & ఇంగ్లీష్ భాషలో అందుబాటులో ఉంది
సులభమైన నావిగేషన్ కోసం వాయిస్-ఎనేబుల్డ్ సర్చ్
ముఖ్యమైన ఔషధ వివరాలను బుక్‌మార్క్ చేయండి
ఆండ్రాయిడ్ & ఐఓఎస్ లో అందుబాటులో ఉంది

ఔషధాల వివరణాత్మక సమాచారం కోసం
ఈరోజే క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోండి

Cbc 02107/13/0005/2425

హెల్ప్‌లైన్ నెం: 1000 111 255 (పని దినాలలో ఉ.10:00 నుండి సా.6:00 వరకు) | @nppa_india @india.nppa www.nppaindia.nic.in

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68